


సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



సాఫ్ట్‌వేర్‌లో ముగిసిన స్వర్ణయుగం **04**

ఆధార్ సహా, నిర్దేశిత డాక్యుమెంట్‌తో దరఖాస్తుకు ‘సుప్రీం’ అనుమతి **05**




సంపుటి 28, సంచిక: 64 | శనివారం | 23-08-2025 | హైదరాబాద్ — Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar — పేజీలు: 12 | వెల రూ. 5.00


## సిపిఐ అగ్రనాయకులు, మాజీ పార్లమెంటేరియన్

# కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి అస్తమయం

- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల నిర్వహణ
- కార్మిక శాఖ స్థాయి సంఘానికి చైర్మన్‌గా విధులు
- రెండుసార్లు నల్లగొండ జిల్లా ఎంపిగా ప్రాతినిధ్యం
- నల్లధనం, 2జి స్పెక్ట్రంపై పార్లమెంట్ వేదికగా పోరాటం
- పాలమూరులో అంబలి కేంద్రాల నిర్వహణ, కరువు పెన్షన్ల మంజూరులో కీలక పాత్ర
- డోన్ ఉప ఎన్నికల్లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై పోటీ
- బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ వ్యూహకర్త
- సురవరం మృతికి సంతాప సూచికగా ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్‌లో మూడురోజులపాటు పార్టీ పతాకం అవనతం
- ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రదానం
- ప్రజల సందర్శనార్థం ఆదివారం (ఆగస్టు 24) మధ్యాహ్నం 3 గంటలకు వరకు మగ్ధూంభవన్‌లో భౌతికకాయం



పునర్నిర్మాణం అనంతరం జూలై 10వ తేదీన మగ్దూంభవన్ ప్రారంభం సందర్భంగా చివరిసారిగా వేదికపై సురవరం
(1942–2025)

ఆసుపత్రిలో సురవరం భౌతికకాయం వద్ద విజయలక్ష్మి ని ఓదారుస్తూ కంటతడి పెట్టిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పార్టీ సీనియర్ నేతలు




ప్రజాపక్షం/హైదరాబాద్

సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటేరియన్ సురవరం సుధాకరరెడ్డి శుక్రవారం రాత్రి పది గంటల ప్రాంతంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. ఆయనకు భార్య డాకర్ బివి విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. శ్రీమతి విజయలక్ష్మి ఎఐటియుసి నాయకురాలుగా పనిచేస్తున్నారు. సురవరం ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హృదయం స్పందన నిలిచిపోవడంతో మృతి చెందారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ముగిసిన కొద్ది నిమిషాలకే తమ ఆత్మీయ నేత సురవరం మరణించిన వార్త తెలియడంతో సిపిఐ నాయకులు, పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కమ్యూనిస్టు శ్రేణుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మరణ వార్త తెలిసిన తరువాయి 2లో

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి

# కూనంనేని సాంబశివరావు

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ
- పది మంది కార్యదర్శివర్గం, 32 మంది కార్యవర్గం సహా 101 మందితో నూతన రాష్ట్ర సమితి

**సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా**



(ఇ.చంద్రశేఖర్)
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రెండవ సారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇటి.నర్సింహా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ‘కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్’(గాజుల రామారం)లో జరిగిన సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ చివరి రోజు శుక్రవారం నాడు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పది మంది కార్యదర్శివర్గ సభ్యులు, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది. కార్యదర్శిగా కూనంనేని పేరును సిపిఐ సీనియర్ నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా, కలవేన శంకర్ బలపర్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర సమితి ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసింది. అలాగే రాష్ట్ర సమితికి క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులను, రాష్ట్ర కార్యవర్గానికి ఆహ్వానితులను కూడా ఎన్నుకున్నారు. నూతన నాయకత్వాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అభినందించారు. రాష్ట్రంలో సిపిఐని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు.

**రాష్ట్ర కార్యవర్గం:** కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా,బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సిహెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్ రాజ్, మందా పవన్, బి.విజయసారధి, కర్రె భిక్షపతి, తరువాయి 3లో




**రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**
కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, వివిఎస్.బోస్, ఇటి.నర్సింహా

## ఉద్యమాల ద్వారానే

# ఎదురులేని శక్తిగా సిపిఐ

రాష్ట్ర నాలుగవ మహాసభల్లో కూనంనేని సమాధానం


(బి. అంజన్‌కుమార్)
కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ నుంచి

ఉద్యమాల ద్వారానే పార్టీ ఎదురు లేని శక్తిగా ఎదుగుతుందని, ఇందుకు ప్రతి నాయకుడు , కార్యకర్త క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలకు సంబంధించి పొత్తు ఉన్న చోట కలిసి పని చేయాలని, లేని చోట గెలుపే లక్ష్యంగా సాధ్యమైన ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలన్నారు. ఉద్యోగ, కార్మిక, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆర్‌టిసి, సింగరేణి కార్మికుల సమస్యలు, ప్రజా సమస్యలను క్రోడీకరించి లక్షలాది మందితో త్వరలో ఉద్యమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో ప్రవేశ పెట్టిన రాజకీయ , నిర్మాణ నివేదిక పై జరిగిన చర్చకు శుక్రవారం నాడు కూనంనేని సాంబశివరావు సమాధానమిస్తూ శాఖలు లేని గ్రామాలు, మండలాలలో విస్తరించి సిపిఐని మరింత బలోపేతం తరువాయి 2లో

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

# నక్సలిజానికి మద్దతిచ్చారట!

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై అమిత్ షా నిరాధార ఆరోపణలు



**కొచ్చి:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకి నిలిచిన ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా నిరాధార ఆరోపణలు చేశారు. సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఆయన సల్వాజుడుం తీర్పును ప్రకటించకపోతే, దేశంలో తీవ్రవాద వామపక్ష ఉద్యమం 2020కి తరువాయి 2లో




## యాదాద్రి పవర్‌ప్లాంట్

# జనవరిలో జాతికి అంకితం

- ప్లాంట్ పరిసర గ్రామాల్లో ఉచితంగా ప్రపంచస్థాయి విద్య, కార్పొరేట్ వైద్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- భూ నిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను రానున్న జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పరిసరాల్లోని గ్రామాల్లో ప్రపంచ స్థాయి విద్యను, కార్పొరేట్ వైద్యాన్ని సిఎస్‌ఆర్ నిధుల ద్వారా ఉచితంగా అందజేస్తామని భరోసానిచ్చారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో 500 మందికి శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంఎల్‌సి శంకర్ నాయక్, ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డి తదితరులు తరువాయి 2లో

## ఘోష్ నివేదికపై ‘స్టే’కు

# హైకోర్టు నిరాకరణ

- కెసిఆర్, హరీశ్‌లకు లభించని ఊరట
- రాష్ట్ర సర్కార్, కమిషన్‌లకు నోటీసులు శాసనసభలో నివేదిక పెట్టాకే చర్యలు : ప్రభుత్వం
- ఐదు వారాలకు విచారణ వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఏర్పాటు జిఒ, కమిషన్ నివేదిక అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. జిఒ 6, కమిషన్ నివేదికలను రద్దు చేయాలంటూ కెసిఆర్, హరీశ్‌రావు వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలను శుక్రవారం హైకోర్టు మరోసారి విచారించింది. కమిషన్ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సభలో చర్చించాకే ముందుకు వెళతామని ప్రభుత్వం చెప్పింది. ఈలోగా కమిషన్ నివేదికపై ఏవిధమైన చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చింది. వీటిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుని కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు వేసిన అభ్యర్థనను తిరస్కరించింది. రెండు పిటిషన్లను విచారణకు స్వీకరించి ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌లకు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఆ తరువాత తరువాయి 2లో

## యూరియా పక్కదారి పడుతోంది

### కిషన్‌రెడ్డి ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్న యూరియా ఎలా పక్కదారి పడుతోందని?, బ్లాక్ మార్కెట్‌లోకి ఎలా వెళ్తుందో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. యూరియా విషయంలో కేంద్రాన్ని బద్‌నామ్ చేయాలన్న దురుద్దేశాన్ని మానుకొని, రైతులకు యూరియాను సక్రమంగా అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే వహించాలన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇతర దేశాల్లో ఎరువుల ధరలు మూడు రెట్లు పెరిగినప్పటికీ, గత 11 సంవత్సరాలుగా ఎరువుల ధర ఎంత పెరిగినప్పటికీ తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అవినీతి ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె అరెస్ట్

**కొలంబో :** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె (76) రాష్ట్ర నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతో శుక్రవారం క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ (సిఐడి) అరెస్టు చేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సిఐడి ప్రధాన కార్యాలయానికి విక్రమసింఘెను విచారణ కోసం పిలిపించి, ఆ తర్వాత అక్కడే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 2023 సెప్టెంబర్‌లో తన భార్య ప్రొఫెసర్ మైత్రి పట్టాభిషేక కార్యక్రమానికి హాజరయ్యేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)కు వెళ్లినప్పుడు ప్రభుత్వ నిధులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అమెరికా పర్యటన పూర్తయిన అనంతరం అధికారికంగా కాకుండా రాష్ట్ర ఖర్చుతో యుకె వెళ్లారని సమాచారం. ఈ ప్రయాణ ఖర్చులపై ఆయన సిబ్బందిని సిఐడి ఇంతకు ముందే ప్రశ్నించినట్లు తెలిసింది. 2022 ఆర్థిక సంక్షోభ సమయంలో దేశాన్ని దారి మళ్లించిన నాయకుడిగా పేరుగాంచిన విక్రమసింఘె, గోటబయ రాజపక్స రాజీనామా అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి 2024 సెప్టెంబర్ వరకు పదవిలో కొనసాగారు. అంతకు ముందు ఆయన

## పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో
# చైనా విదేశాంగ మంత్రి వాంగ్ భేటీ

ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధంపై దృష్టి



**ఇస్లామాబాద్ :** చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి శుక్రవారం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను కలిసి, ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధంతోపాటు, పరస్పర ప్రయోజనకరమైన అంశాలను చర్చించారు. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న విదేశాంగ మంత్రుల 6వ రౌండ్ 'వ్యూహాత్మక చర్చలు' కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం పాకిస్తాన్‌కు చేరుకున్న వాంగ్, ప్రధాని షాబాజ్ షరీఫ్, అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారిని కూడా కలిశారు. ఈ సందర్భంగా ఆయన, ప్రాంతీయ శాంతి, అభివృద్ధి, స్థిరత్వం కోసం చైనా–పాకిస్థాన్ భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది అని హామీ ఇచ్చారు. పాకిస్థాన్ సార్వభౌమత్వ పరిరక్షణ, అభివృద్ధికి ఎలాంటి షరతులు లేని మద్దతునిస్తామని చైనా స్పష్టం చేసినట్టు సమాచారం. తమ మధ్య ఉన్న మైత్రీ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయని పాకిస్థాన్ ఆర్మీ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. మునీర్–వాంగ్ సమావేశంలో ప్రధానంగా ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధం, ద్వైపాక్షిక సహకార అంశాలు చర్చనీయాంశాలుగా నిలిచినట్లు వెల్లడించారు. ఇరువురూ అన్ని కాలాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై పరస్పర సమన్వయాన్ని పెంచడంలో కట్టుబడి ఉన్నట్టు ధ్రువీకరించారు. ఎల్లప్పుడూ చైనా నుంచి లభిస్తున్న స్థిరమైన మద్దతుకు మునీర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ఇరు దేశాలు కలిసి పనిచేయాలనే అంగీకారంతో ముగిసింది. గత నెల మునీర్ చైనాను సందర్శించినప్పుడు ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, వాంగ్, సైనిక ఉన్నతాధికారులను కలిశారు. అయితే, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో భేటీ కాలేదు. ఇలావుంటే, వాంగ్ – పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్తో కలిసి చైనా–పాక్ ఆర్థిక కారిడార్ 2.0, వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, బహుపాక్షిక సహకారం, ప్రజల మధ్య సంబంధాలు తదితర విషయాలపై గురువారం వ్యూహాత్మక సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశానికి ముందు, వాంగ్ కాబూల్‌లో పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ విదేశాంగ మంత్రులతో త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఇరువురూ కలసి సిపిఇసిని కాబూల్ వరకు విస్తరించేందుకు, అలాగే పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు అంగీకరించారు. మూడు సంవత్సరాల్లో వాంగ్ పాకిస్తాన్‌లో పర్యటించడం ఇది మూడోసారి. తాజాగా జరిగిన ద్వైపాక్షిక సమావేశాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు మరింత మెరుగుపడినట్టు చెప్తున్నారు. ఈ వారం ప్రారంభంలోనే వాంగ్ భారత్‌ను కూడా సందర్శించి, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్లతో సరిహద్దు చర్చల 24వ రౌండ్లో పాల్గొన్న విషయం తెలిసిందే.

## గాజా నగరం ధ్వంసం కావొచ్చు
### ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక



**దీర్ అల్–బాలా :** హమాస్ తన నిబంధనలను అంగీకరించని పక్షంలో గాజా నగరాన్ని పూర్తిగా ధ్వంసం చేసే అవకాశం ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ శుక్రవారం హెచ్చరించారు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సైనిక దాడి చేపట్టేందుకు ఇజ్రాయెల్ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తున్నది. గాజా నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి అతి పెద్ద ఆపరేషన్‌కు అనుమతి ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహు ప్రకటించిన ఒక రోజు తరువాత, రక్షణ మంత్రి కాట్జ్, గాజా నగరం రాఫా బైట్ హనూన్‌లా శిథిలాలుగా మారవచ్చని వ్యాఖ్యానించడం గమనార్హం. ఆ రెండు ప్రాంతాలు యుద్ధంలో ఇప్పటికే అత్యంత దారుణంగా దెబ్బతిన్నాయి. 'హమాస్ హంతకులను విడిచిపెట్టేది లేదు. వారు యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్ విధించిన షరతులకు అంగీకరించే వరకూ దాడులు కొనసాగిస్తాం' సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా కాట్జ్ పేర్కొన్నారు. బందీలు అందరినీ విడుదల చేయడం, హమాస్ పూర్తిగా నిరాయుధీకరణ చెందడం. యుద్ధం ముగించడం వంటి చర్యలకు అంగీకరిస్తేనే తమ నుంచి సానుకూల స్పందన ఉంటుందని కాట్జ్ వ్యాఖ్యానించారు. గాజా నగరం హమాస్ ప్రభుత్వ, సైనిక కేంద్రం మాత్రమే కాక, గణనీయమైన సొరంగ నెట్వర్క్ కేంద్రమని ఇజ్రాయెల్ విశ్వసిస్తోంది. అదే సమయంలో, లక్షలాదిగా పౌరులు ఆశ్రయం పొందుతున్న ఈ నగరంలో కీలక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య వ్యవస్థలు కూడా ఉన్నాయి. వాటిని ధ్వంసం చేయడం ద్వారా పాలస్తీనాను తన అదుపులోకి తెచ్చుకోవడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా కనిపిస్తున్నది. గాజా నగరం పూర్తిగా ధ్వంసం కావచ్చని కాట్జ్ హెచ్చరించడం వెనుక, ఇజ్రాయెల్ ఆలోచన స్పష్టమవుతునే ఉంది. పాలస్తీనాను ప్రపంచ పటం నుంచి చెరిపివేయాలని, కనీసం తన చెప్పుచేతుల్లో ఉంచుకోవాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. ఈ అభిప్రాయాలు బలపడే రీతిలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు రక్షణ మంత్రి కాట్జ్ దాదాపు అలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

## జనవరిలో జాతికి అంకితం
(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడు తూ 2022 అక్టోబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే విధించినప్పటికీ దాదాపు రెండు సంవత్సరాల పాటు నాటి పాలకులు యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన పరిశ్రమ ఒక్కరోజు ఆలస్యమైనా ఆ ఆర్థిక భారం రాష్ట్ర ప్రజలపై తీవ్రంగా పడిందన్నారు. తాము అధికారంలోకి రాగానే వెనువెంటనే 2024 ఫిబ్రవరిలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, పర్యావరణ అనుమతులను వెంటనే తీసుకొచ్చామన్నారు. ఆనాటి నుంచి రోజువారిగా యాదాద్రి పవర్ ప్రాజెక్టు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.

పవర్ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే లైన్, కార్మికులు అధికారులు ఉండేందుకు టౌన్‌షిప్ ఏర్పాటు ఇవన్నీ నిర్దేశిత సమయాన్ని నిర్ణయించుకున్నామని, బిహెచ్ఇఎల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పవర్ ప్లాంట్ పరిసరాలలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని, స్థానిక ప్రజలు ఇబ్బంది పడకుండా, రహదారులు దెబ్బతినకుండా ప్రత్యేకంగా సిసి రోడ్లు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తామన్నారు.

రహదారుల నిర్మాణ క్రమంలో భూ సేకరణకు అవసరమైన నిధులను మంజూరు చేశామన్నారు. భద్రాద్రి పవర్ యూనిట్ రాష్ట్రానికి గుదిబండగా మారిందిగత ప్రభుత్వ పెద్దలు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టిన భద్రాద్రి పవర్ యూనిట్ రాష్ట్రానికి గుదిబండగ మారిందని భట్టి విక్రమార్క అన్నారు. దేశంలోనే అత్యున్నత,అత్యధిక గ్రీన్‌పవర్ ఉత్పత్తికి తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రంగా చేస్తామన్నారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, 51లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం రూ.17వేల కోట్లను ఖర్చు చేసి, ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుందన్నారు. తెలంగాణ జెన్‌కో విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన 159 మంది బాధిత కుటుంబాలకు రెండో సారి మానవీయ కోణంలో ప్రభుత్వం కారుణ్య నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వం హయాంలో మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఒకసారి మాత్రమే కారుణ్య నియామకాలను చేపట్టిందన్నారు.

**ఈ 'ఉద్యోగ ఆర్డర్లు' మీరెందుకు ఇవ్వలేదు..**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగానికి, సంస్థకు పేరు తీసుకురావాలని సూచించారు. రాను రాను కాలుష్యం పెరిగే అవకాశాలు ఉంటాయని, అందుకే కాలుష్య నియంత్రనకు మరింత అధ్యయనం చేయాలన్నారు.

ఉద్యోగ నియామకాలను తామే సిద్ధం చేశామని, కేవలం ఆర్డర్లు మాత్రమే ఇస్తున్నారని ప్రతిపక్ష పార్టీ తమపైన ఆరోపణలు చేస్తున్నారని, ఇదే ఆర్డర్లను వారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని, అప్పుడు ప్రతిపక్షంగా తాము ఏమైనా అడ్డుకున్నమా? అని మంత్రి కోమటిరెడ్డి నిలదీశారు. న్యాయపరమైన సమస్యలపైన తాము ప్రత్యేక శ్రద్ధ కనబర్చి నియామక సమస్యను పరిష్కరించామని వివరించారు.

## పక్కదారి పడుతోంది (మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ప్రభుత్వం రైతులపైన భారం పడకుండా, సబ్సిడీతో రూ. 265లకే బస్తాను అందజేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి సుమారు రూ.80,000 కోట్ల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం భరించిందన్నారు. రూ. 2,650 విలువ గల యూరియా బస్తాను రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.266ల సబ్సిడీ ధరకే అందజేస్తే, ఆ బస్తాను రూ.400లకు కొనుగోలు చేస్తున్నారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నదని, దీని వెనుక అసలు కుట్ర ఎవరిదని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి ప్రత్యేక చర్యలతో వేపపూత పూసిన యూరియాను సరఫరా చేస్తోందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సమస్యలున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి యూరియాను పంపిణీ చేసిందని, కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన సమయంలో, రష్యా,ఇజ్రాయిల్ యుద్ధ సమయంలో కూడా రైతులకు ఎరువుల సరఫరా నిలిపివేయలేదని, సరఫరాను తగ్గించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా విషయంలో కృత్రిమ కొరతను ప్రోత్సహించడం సరికాదని, ఒక్క బస్తా కూడా అధిక ధరలకు అమ్మకుండా చూడాలని, బ్లాక్ మార్కెట్ ను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో,ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా హోల్‌సేల్ గా, ఎవరి కోటా వారికి అన్నట్టుగా అక్రమంగా భూముల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్ డిఎలను తక్షణమే చెల్లిస్తామని హామీనిచ్చినప్పటికీ పెండింగ్ డిఎలను చెల్లించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటానికి బిజెపి రాష్ట్ర శాఖ పూర్తి మద్దతు ప్రకటిస్తోందన్నారు.

హైదరాబాద్‌లోని ప్రధాన విభాగాలైన జిహెచ్‌ఎంసి,మెట్రోవాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్లకు కనీస నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వారు ధర్నాలు చేస్తున్నారని, అభివృద్ధి పనులకు టెండర్లను వేసేందుకు కూడా వారు ముందుకు రావడం లేదన్నారు. గత బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధిపై చేసిన మాటలు కోటలు దాటుతున్నాయని ఎద్దేవా చేశారు.

## ఎదురులేని శక్తిగా సిపిఐ
(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు సన్నద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రంలో కులాలు , మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తున్న బిజెపిని రాజకీయంగా నిలువరించేందుకు సమరశీల పోరాటాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పార్టీ స్వంత కార్యాలయాలను నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజా సంఘాలను బలోపేతం చేసేందుకు నిర్విరామ కృషి చేయాలన్నారు.

**5 లక్షల మందితో సిపిఐ శత వసంతాల ముగింపు సభ**

సిపిఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపును ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నామని కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ఈ సందర్భంగా లక్షమంది రెడ్ షర్ట్ వాలంటీర్లు ఖమ్మంలో కదం తొక్కనున్నారని, 5లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు.

**ఆహ్వాన సంఘానికి ఘన సన్మానం**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలకు అతిథ్యం ఇచ్చిన సిపిఐ మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా సమితిని సిపిఐ మహాసభ ఘనంగా సన్మానించింది. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్, గౌరవాధ్యక్షుడు డి.జి.సాయిలుగౌడ్, ఉపాధ్యక్షులు టి.మల్కయ్య తదితరులతో పాటు మహాసభలకు వాలంటీర్లగా సేవలందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను కూనంనేని సాంబశివరావు సత్కరించారు.

## హైకోర్టు నిరాకరణ (మొదటి పేజీ తరువాయి)

వారం రోజుల్లోగా ఆ కౌంటర్లపై పిటిషనర్లు కెసిఆర్, హరీశ్ తమ అభ్యంతరాలతో కూడిన రిప్లై కౌంటర్‌ను దాఖలు చేయాలంది. తదుపరి విచారణను ఐదు వారాలకు వాయిదా వేసింది. కమిషన్ ఇచ్చిన 650 పేజీల రిపోర్టును ప్రభుత్వం 60 పేజీలకు సంక్షిప్తం చేయించిన కాపీలు వెబ్‌సైట్స్‌లో అప్‌లోడ్ చేయడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. రిపోర్టును వెబ్‌సైట్స్ నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసెంబ్లీలో రిపోర్టు పెట్టేలోగా నివేదికను వెబ్‌సైట్‌లో ఎలా పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నివేదికలోని సమాచారం పిటిషనర్ల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని చెబుతున్నారని గుర్తు చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఎకె సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల ప్రణాళిక, డిజైన్, నిర్మాణంలో ఇతర అంశాలపై జస్టిస్ ఘోష్ నేతృత్వంలో జ్యుడిషి యల్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ఇరిగేషన్ శాఖ 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. కమిషన్ ఈ ఏడాది జులై 31న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ జిఒను రద్దు చేయాలని, కమిషన్ విచారణ చట్ట వ్యతిరేకంగా జరిగినందున నివేదికను కూడా రద్దు చేయాలని, తుది ఉత్తర్వుల జారీలోగా మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కెసిఆర్, హరీశ్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై శుక్రవారం మరోసారి హైకోర్టు విచారణ ప్రారంభించిన వెంటనే అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ఒక నివేదికను ధర్మాసనానికి అందజేశారు. కమిషన్ నివేదికను హైకోర్టులో ప్రవేశపెట్టి చర్చించాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారా లేక కమిషన్ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో ప్రవేశపెడతారా అని గురువారం హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ఎజి ఇచ్చిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టాకే తదుపరి నిర్ణయం ఉంటుందన్న ప్రభుత్వ హామీని పరిగణనలోకి తీసుకుని స్టే ఆదేశాలు అవసరం లేదని వెల్లడించింది.

తొలుత కెసిఆర్, హరీశ్ తరపు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ, కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఆరు మాసాల్లో అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలని, ఈలోగా ప్రభుత్వం నివేదికను ఆధారంగా చేసుకుని ముందుకు వెళ్లకుండా మధ్యంతర స్టే ఆదేశా లను జారీ చేయాలని ఇద్దరు న్యాయవాదులు కోరారు.

ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రతివాదనలు చేస్తూ, ఎలాంటి మధ్యంతర స్టే ఉత్తర్వులను జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టాకే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకోవాలని ఏజీ అన్నారు. పిటిషనర్లకు 8–బి, 8–సి నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కమిషన్ 119 మంది సాక్షుల విచారణలో చిట్టచివరి వ్యక్తులు పిటిషనర్లేనని, అన్నీ తెలుసుకాబట్టి నోటీసుల జారీ అవసరం లేదన్నారు. కమిషన్ నుంచి పిటిషనర్లు సమాచారాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. కిరణ్‌బేడీ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు పిటిషనర్లకు వర్తించవన్నారు.

కెసిఆర్, హరీశ్‌రావు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉన్నారని, కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో నివేదించాక జరిగబోయే చర్చలో వాళ్లు తమ వాదన చెప్పుకునే వీలుంటుందని చెప్పారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఏమీ జరగ దన్నారు. కమిషన్ రిపోర్టు ఇచ్చాక ముగ్గురు ఆఫీసర్లతో కమిటీ వేసి ఆ రిపోర్టులోని ముఖ్యమైన విషయాలతో 60 పేజీల్లో బ్రీఫ్ రిపోర్టు మీడియాకు చేరిందని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఆ నివేదిక లేదని చెప్పారు. పిటిషనర్లు ఇద్దరూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన నోటీసులను సవాలు చేయలేదన్నారు. కమిషన్ వద్ద ఉన్న సమాచారం ఆధానంగానే పిటిషనర్లు ఇద్దరినీ కమిషన్ విచారించిందని తెలిపారు. కమిషన్ నిజ నిర్ధారణ మాత్రమే చేస్తుందని, కమిషన్ నివేదికపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తదుపరి పరిణామాలు ఉంటాయని చెప్పారు. వాదప్రతివాదనల తరువాత ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 5 వారాలకు వాయిదా వేసింది.

## నక్సలిజానికి మద్దతిచ్చారట!
(మొదటి పేజీ తరువాయి)

ముందే ముగిసి ఉండేది అని అన్నారు. మళయాళ మనోరమ గ్రూప్ శుక్రవారం కొచ్చిలో నిర్వహించిన మనోరమ న్యూస్ కాన్క్లేవ్‌ను ప్రారంభించిన తర్వాత అమిత్ షా మాట్లాడారు. ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేయడంతో కేరళలో పార్టీ గెలిచే అవకాశాలు మరింత తగ్గిపోయాయని షా అన్నారు. 'నక్సలిజానికి సహాయం చేసిన వ్యక్తి సుదర్శన్ రెడ్డి. ఆయన సల్వా జుడుం తీర్పు ఇచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోతే, 2020 నాటికి నక్సల్ ఉగ్రవాదం ముగిసి ఉండేది. సల్వా జుడుం తీర్పు ఇచ్చిన భావజాలం నుండి ప్రేరణ పొందిన వ్యక్తి ఆయన' అని షా సమావేశంలో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో సల్వా జుడుంపై 2011 సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ అన్నారు. డిసెంబర్ 2011లో, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మావోయిస్టు తిరుగుబాటుదారులపై పోరాటంలో గిరిజన యువకులను ప్రత్యేక పోలీసు అధికారులుగా ఉపయోగించడం చట్టవిరుద్ధం,రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చారు. వారిని వెంటనే నిరాయుధులను చేయాలని కూడా ఆయన ఆదేశించారు. కేరళ నక్సలిజం భారాన్ని ఎదుర్కొందని షా అన్నారు. వామపక్ష పార్టీల ఒత్తిడితో కాంగ్రెస్ పార్టీ నక్సలిజానికి మద్దతు ఇచ్చిన, సుప్రీంకోర్టు వంటి పవిత్ర వేదికను ఉపయోగించిన అభ్యర్థిని నిలబెట్టిందని అని హోంమంత్రి అన్నారు. పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన మూడు బిల్లుల గురించి అడిగిన ప్రశ్నకు షా సమాధానమిచ్చారు, వీటిని బిజెపి అవినీతి నిరోధక చట్టంగా అభివర్ణిస్తుంది. 'ఈ విషయంపై ఇంకా చర్చించడానికి ఏమీ లేదు. నేను పార్లమెంటులో దేశ ప్రజలను అడిగాను: ప్రధానమంత్రి జైలు నుండి ప్రభుత్వాన్ని నడపాలని వారు కోరుకుంటున్నారా? ఇది ఎలాంటి చర్చ? ఇది నైతికతకు సంబంధించిన ప్రశ్న. ఇప్పుడు వారు దీనిని రాజ్యాంగంలో ఎందుకు చేర్చలేదని అడుగుతున్నారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, జైలుకు వెళ్లిన వ్యక్తులు ఎన్నికైన పదవులను కొనసాగిస్తారని ఊహించలేదు' అని ఆయన అన్నారు. 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో భారత ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితాలో ప్రధాన సవరణ అయిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ అనవసరమైన వివాదాన్ని సృష్టిస్తోందని షా ఆరోపించారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అభ్యంతరాలు తెలిపే అవకాశం కాంగ్రెస్‌కు ఉందని, కానీ ఇప్పటివరకు ఎస్ఐఆర్‌పై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు గురించి, ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. 'దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలనిఇసి నిర్ణయించింది. బిహార్ ఓటర్ల జాబితాలో 22 లక్షల మంది మరణించారు. బోగస్ ఓట్లు వేసే అవకాశం ఉంది. కాబట్టి, వారి పేర్లను తొలగించాలా వద్దా? ఇది సాధారణ జ్ఞానానికి సంబంధించిన విషయం' అని ఆయన అన్నారు.

## కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి అస్తమయం
(మొదటి పేజీ తరువాయి)

వెంటనే సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నరసింహ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి సురవరం భౌతిక కాయానికి నివాళి అర్పించారు. సురవరం మరణ సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ప్రతిపక్షనేత కె. చంద్రశేఖర్ రావు, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ప్రముఖ నేతలు సంతాపం ప్రకటించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు, సినీ నటుడు, నిర్మాత, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి ఒంగోలు నుంచి సంతాపం తెలియజేశారు.

**ఆదివారం అంతిమ యాత్ర**

సురవరం పెద్దకుమారుడు అమెరికా నుంచి రావాల్సి ఉండడంతో ఆయన అంతిమయాత్రను ఆదివారం నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం పదిగంటలకు ప్రజల సందర్శనార్థం సురవరం భౌతికకాయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యాలయమైన మగ్దూంభవన్‌కు ఉదయం 10 గంటలకు తరలించనున్నారు. మధ్యాహ్నం అంతిమ యాత్ర నిర్వహించి సాయంత్రం సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం గాంధీ బోధానాసుపత్రికి అప్పగించనున్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి 1942, మార్చి 25న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావ్‌పల్లిలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట్‌రామ్‌రెడ్డి, తల్లి ఈశ్వరమ్మ. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి స్వయాన సుధాకర్‌రెడ్డికి పెదనాన అవుతారు. వారి కుటుంబం కంచుపాడు గ్రామానికి వలస వెళ్లింది. బాల్యంలో అక్కడే విద్యాభ్యాసం చేసి ఉన్నత పాఠశాల కోసం కర్నూలులోని కోల్స్ హైస్కూల్‌లో చదువుకున్నారు. కర్నూల్‌లోనే ఉస్మానియా డిగ్రీ కాలేజీలో బిఎ చదివారు. అదే సమయంలో ఆయనకు విద్యార్థి ఉద్యమాలతో సంబంధాలు ఏర్పడగా, ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారు. ఆయన హాస్టల్ విద్యార్థుల సమస్యలపై తీవ్ర పోరాటాలు చేసి రాటుదేలారు. అనంతరం పార్టీ ఆదేశాల మేరకు విశాలంధ్ర విలేకరిగా హైదరాబాద్‌కు వచ్చారు. వెంటనే ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్‌ఎల్‌బి అడ్మిషన్ లభించింది. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా, అనంతరం కాలంలో ఎస్‌ఎఫ్, వైఏఫ్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా



ఆస్పత్రిలో 'ప్రజాపక్షం' పేపర్ చదువుతూ..



ఢిల్లీలో ఉంటూ దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాల వ్యాప్తికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన నేతృత్వంలో పనిచేసిన అనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తరువాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారు.

**జీవిత సంగ్రహం:**

ఎఐఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకత్వం స్థానం నుండి అఖిల భారత స్థాయి విద్యార్థి, యువజన సమాఖ్యల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల బాధ్యతల్లో రాణించిన నాయకుడు సురవరం సుధాకరరెడ్డి. ఆయన చక్కని వాగ్ధాటి, విషయ స్పష్టత కలిగిన వక్త. ఒకతరం విద్యార్థి, యువజనులకు ఆయనో ఆకర్షణ. గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్. సిపిఐ 9వ ప్రధాన కార్యదర్శి. 1942, మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా (ప్రసుత్తం గద్వాల జిల్లా) కొండ్రావ్‌పల్లి గ్రామంలో జన్మించారు. కర్నూలులో హైస్కూలు విద్య పూర్తి చేశారు. 1964లో కర్నూలులోని ఉస్మానియా కాలేజీలో చరిత్రలో బి.ఎ. ఉత్తీర్ణులైనారు. హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్శిటీ లా కాలేజి నుండి ఎల్‌ఎల్‌బి పూర్తి చేశారు. కర్నూలు కాలేజీలో విద్యార్థి యూనియన్ అధ్యక్షులుగా, ఉస్మానియా లా కాలేజీలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. విజయవాడలో జరిగిన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలో సి.రాఘవాచారి అధ్యక్షునిగా, సుధాకరరెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై కామ్రేడ్ చంద్రప్పన్, డి.రాజాలతో కలిసి ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుండి అనేక ఉద్యమాల్లో పోరాటాల్లో పాల్గొన్నారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసినప్పుడు కలకత్తా, ఢిల్లీ, లక్నో, తదితర జైళ్లలో శిక్షలనుభవించారు.

రాష్ట్రానికి తిరిగి వచ్చి పార్టీ నిర్మాణంలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేస్తూ కర్నూలు జిల్లా, నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో, మహబూబ్‌నగర్ జిల్లా పెద్దకొత్త పల్లి మండలంలో, మెదక్ జిల్లా సంగారెడ్డిలో పాటియాల రాజా భూముల ఆక్రమణ పోరాటాల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌లో అంబలి కేంద్రం నిర్వహించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కరువు పెన్షన్ ఇవ్వడంలో కీలక పాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆ సమయంలో పోలీసు కాల్పులు జరిగాయి. ముగ్గురు యువకులు మరణించారు. గుర్రాలతో తొక్కించడంతో ఆయన గాయపడ్డారు. హత్యానేరం పేర కామ్రేడ్ సుధాకరరెడ్డితోపాటు ఇంకా అనేకమందిపై తప్పుడు కేసులు పెట్టారు. ప్రాజెక్టుల కోసం పదిరోజులు పాదయాత్ర నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఉన్న సమయంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై డోన్ ఉప ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా బరిలో నిలవడం చర్చనీయాంశంగా మారింది. విశాలాంధ్ర విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకవర్గ సభ్యులుగా, 'యువజన' మాసపత్రిక, 'యూత్ లైఫ్' మాసపత్రిక, 'న్యూ జనరేషన్' వార పత్రికలకు సంపాదకునిగా వ్యవహరించారు. 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' ఎడిటోరియల్ బోర్డ్ సభ్యునిగా పని చేశారు. 1995–97 ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శిగా, 1997–2005 కార్యదర్శిగా పనిచేశారు. నల్లగొండ లోక్ సభ నియోజకవర్గం నుండి 1998–99, తిరిగి 2004–2009 సంవత్సరాల్లో ఎంపిగా పనిచేశారు.

2004 యుపిఎ ప్రభుత్వ హయాంలో కార్మిక శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా అసంఘటిత కార్మికుల సంక్షేమ ముసాయిదా బిల్లును రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అలాగే ఐక్యరాజ్యసభ సాధారణ సమితి సమావేశాల్లో భారత పార్లమెంట్ తరుపున ప్రతినిధిగా వెళ్లారు.

2008 నుండి సిపిఐ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పనిచేసిన తదుపరి 2012లో పాట్నాలో పార్టీ 21వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. పుదుచ్చేరి (2015), కొల్లాం(2018) మహాసభలో తిరిగి ఎన్నుకోబడిన సుధాకరరెడ్డి 2019 జులై 24న పార్టీ జాతీయ సమితి సమావేశంలో ఆరోగ్య కారణాలతో రిలీవ్ అయినారు.

**సిఎం సహా పలువురు సంతాపం**

సిపిఐ అగ్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర రెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సురవరం సుధాకర్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు.

సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, ప్రతిపక్షనేత కెసిఆర్ పార్టీ నేతలు హరీష్‌రావు, కవిత, టిపిసిచీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి సంతాపం తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తివేయాలి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి లేఖ రాసిన చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేనేత రంగంపై జిఎస్‌టి ఎత్తివేయాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అధిక సంఖ్యలో చేనేత రంగంలోనే ఉపాధి పొందుతున్నారని చిన్నారెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.చేనేత రంగంపై జిఎస్‌టి విధించడం వల్ల చేనేతపై ఆధారపడిన కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని చిన్నారెడ్డి వివరించారు. చేనేత రంగంపై జిఎస్‌టిని మినహాయింపు ఇవ్వాలని, వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని, గ్రామీణ చేనేత చేతివృత్తుల కుటుంబాలను ఆదుకోవాలని చిన్నారెడ్డి ఆ లేఖలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు సెంటర్ ఫర్ మానిటరింగ్ రూరల్ ఇండియన్ ఎకానమీ అధ్యక్షులు జై ప్రకాష్ రాపోలు తనను కోరుతూ రాసిన లేఖను జత చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. రానున్న జిఎస్‌టి సమావేశంలో చేనేత రంగానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని చిన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మహిళా సిబ్బంది సమస్యలపై కమిటీ

మహిళా పోలీసు సదస్సు తీర్మాణాలకు మద్దతు తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా పోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది, మూడు రోజుల సదస్సు ద్వారా మహిళా సిబ్బంది సంక్షేమానికి చేసే సిఫారసులను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. పోలీసు అకాడమీలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న మహిళా పోలీసుల సదస్సు ముగింపు సభను ఉద్దేశించి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. నియామక సమయంలో లేని లింగ వివక్ష విధుల్లో చూపడం సరైనది కాదని, మహిళ పోలీసులో మహిళా అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచనని, రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ఈ సిఫారసుతో తాను ఏకీభవిస్తున్నానని డిప్యూటీ సిఎం తెలిపారు. మహిళా సిబ్బంది వ్యక్తిగత అవసరాలు, యూనిఫామ్ అవసరాలు అన్ని అమలు చేయదగినవే అవేమి గొంతెమ్మ కోరికలు కాదని అన్నారు. మహిళా పోలీస్ సిబ్బంది సమస్యలపై త్వరితగతిన కమిటీ వేసి సైంటిఫిక్‌గా రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తే అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే సిబ్బంది అవసరాల గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంటుందని తెలిపారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలి అంటే, పెట్టుబడులు రావాలి అంటే శాంతి భద్రతలు బాగుండాలి, అప్పుడే పెట్టుబడులు వస్తాయని తెలిపారు.

అంకిత భావంతో పనిచేసే పోలీసు సిబ్బంది ఉన్నప్పుడే అది సాకారం అవుతుంది అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు, ఉత్సవాలు జరిగాయి పోలీసులు జీవితాలను పనంగా పెట్టి చిన్న దుర్ఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందన్నారు. పోలీసు సిబ్బంది శ్రమ రాష్ట్ర అభివృద్ధికి మూలం అన్నారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత సమస్యలతో పాటు శాఖపరమైన అవసరాలు కార్యాలయాల భవనాలు, పోలీ స్ స్టేషన్‌లు, సిబ్బంది క్వార్టర్స్ వంటి సమస్యలకు సంబంధించి ప్రతిపాదనలు తీసుకురావాలని పోలీసు అధికారులకు డిప్యూటీ సిఎం సూచించారు. పోలీస్ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు ఒక యంగ్ ఇండియా ఇప్పటికే ప్రారంభించామని అది బాగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం తెలిపారు. డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ... దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని సంపాదించుకున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మహిళా పోలీస్ సిబ్బంది కోసం దేశంలోనే మొదటిసారిగా మూడు రోజుల సదస్సు నిర్వహించిందని అన్నారు. ఈ మహిళా సదస్సులో వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానన్నారు. మహిళల విషయంలో పోలీసు సిబ్బంది సైతం వివక్ష కనబరిస్తే ఉపేక్షించేది లేదని ఇటీవలే తాను క్రమశిక్షణ చర్యలు చేపట్టానని తెలియజేశారు. సదస్సులో జరిగిన చర్చల వివరాలను పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, అడిషనల్ డిజిపి స్వాతి లక్రా, తమిళనాడు రాష్ట్ర పోలీసు అధికారి బాలనాగదేవి, ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, పోలీస్ అకాడమీ అధికారులు, సిబ్బంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటి నుండి జాతీయ క్రీడా ఉత్సవాలు

క్రీడా కార్యక్రమాల్లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలి : క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి నుండి తొమ్మిది రోజులపాటు జరుగనున్న 'జాతీయ క్రీడా ఉత్సవాల'లో క్రీడాకారులు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి క్రీడాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించినంత ఉత్సాహభరితంగా జాతీయ క్రీడ వేడుకలను 9 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి అనుగుణంగా అందరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు . ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానం అంశాలను క్రీడా సమాజానికి చేరువయ్యే విధంగా వివిధ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలు క్రీడాకారులు క్రీడాభిమానులు యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలలో కూడా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆయన కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న అకాడమీలు స్పోర్ట్స్ స్కూల్‌లను బలోపేతం చేయాలని, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానాలలో శిక్షణ పొందుతున్న రెగ్యులర్ ట్రైనిలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. క్రీడారంగం బలోపేతం కావాలి అంటే పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు మరియు కోచుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడా శాఖ విద్యాశాఖ మధ్య సమన్వయంతో గ్రామీణ స్థాయి నుండి అంచలంచలుగా క్రీడాభివృద్ధికి కృషి జరగాలని ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**'సిఎం కప్– 2025'పై నేడు సమీక్ష..**

సీఎం కప్ 2025 ఈసారి, ఏదో మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా పకడ్బందీగా ఉండాలని గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేసే విధంగా మట్టిలో మాణిక్యాల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా కార్యక్రమం రూపకల్పన జరగాలని, ఇందుకోసం అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు శనివారం క్రీడా శాఖ మంత్రి కార్యాలయంలో అన్ని జిల్లాల యువజన క్రీడాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వారితో చర్చించిన తర్వాత సిఎం కప్ 2025 రూపకల్పన చేసి ప్రకటిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శివసేనారెడ్డితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, అనిత, సుజాత, పద్మావతి ఇంజనీర్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్‌కు క్యారెక్టర్ లేదు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరుపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించిన కెటిఆర్‌కు క్యారెక్టర్ లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీపై ఇలా మాట్లాడటం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. 'వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ మీకు థర్డ్ క్లాస్ పార్టీగా, చిల్లర పార్టీగా కనిపిస్తోందా? ఆ పార్టీ నుంచే రాజకీయాలు నేర్చుకున్న మీ నాన్న కెసిఆర్ కూడా థర్డ్ క్లాసే కదా?' అని నిలదీశారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాధ్యమైందని స్వయంగా కెసిఆర్ అసెంబ్లీలో చెప్పిన మాటలను కేటీఆర్ మరిచిపోయారా అని ధ్వజమెత్తారు. తెలంగాణ రాకపోయి ఉంటే కెటిఆర్ కుటుంబం పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు. 'సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు అమెరికాలో జీతం మీద బతికే వారు. మీ కుటుంబం వేల కోట్లు సంపాదించే అవకాశం ఉండేది కాదు' అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత సోనియా గాంధీ ఇంటికి వెళ్ళి కలిసినప్పుడు లేనిది, ఇప్పుడు కాంగ్రెస్ చిల్లర పార్టీగా ఎందుకు కనిపిస్తోందని ఆయన ప్రశ్నించారు. పదేళ్లు మంత్రిగా పనిచేసినా కెటిఆర్‌కు రాజకీయ పరిణతి రాలేదని, బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని జగ్గారెడ్డి అన్నారు. ఆయన తాత, నానమ్మ బతికి ఉంటే ఇలాంటి మాటలకు చెంప మీద కొట్టేవారని వ్యాఖ్యానించారు. కెసిఆర్ చేసిన దీక్ష కూడా నాటకంలో భాగమేనని ఆయన ఆరోపించారు. తాను సచివాలయంలో సమీక్షలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తాను సమీక్షలు చేస్తానని, వాటిని ఆపేది లేదని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్, బిజెపి నేతల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల రైతులకు యూరియా అందించే పనిలోనే ఉన్నారన్నారు. కేంద్రం దగ్గర తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఎన్నిక



**కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ :** సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ శుక్రవారం నాడు రాష్ట్ర నూతన కంట్రోల్ కమిషన్‌ను ఎన్నుకుంది. కమిషన్ చైర్మన్‌గా ఎం.డి.మౌలానా (ఖమ్మం), కార్యదర్శిగా ఎం.వెంకటస్వామి(మంచిర్యాల), సభ్యులుగా పొనగంటి కేదారి (కరీంనగర్), మిర్యాల రంగయ్య (కొత్తగూడెం), హెచ్.ఆనంద్‌జీ (నాగర్ కర్నూల్), పల్లా దేవేందర్‌రెడ్డి(నల్లగొండ), పుస్తకాల నర్సింగ్‌రావు (రంగారెడ్డి), డి.జి.సాయిలుగౌడ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), వి.ప్రకాశ్‌రావు (సంగారెడ్డి) ఎన్నికయ్యారు.

# రాత్రంతా అడవిలోనే...

మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేడు నేచర్ క్యాంప్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో శనివారం నేచర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో సాయంత్రం 5 గంటల నుండి ఆదివారం ఉదయం 10 గంటల వరకు నేచర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెలలో ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుండడంతో నేచర్ క్యాంప్‌ను రద్దు చేశారు. ఇటీవలే ఈ పులిని అటవీ శాఖ అధికారులు బంధించడంతో తిరిగి నేచర్ క్యాంప్‌ను ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లో టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, నోక్టర్నల్ వాక్ (రాత్రి పూట అడవిలో నడక), నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, ఉదయం బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలు ఉంటాయి, వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం మరియు ఉదయం బ్రేక్ ఫాస్ట్ కూడా అందిస్తారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9.30 గంటల వరకు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో 'బర్డ్ వాక్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఈ యొక్క కార్యక్రమానికి పిల్లలు పెద్దలు అందరూ ఆహ్వానితులేనని, పాల్గొనే వారు పక్షుల జాతులను గుర్తించడం, పక్షులు ఏ రకమైన వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలలో గూళ్ళు కడతాయి అనేది తెలుసుకోవచ్చు, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి, పక్షులు ఎలా ఎగురుతాయి, మరియు వాటి సామాజిక ప్రవర్తనలు ఎలా ఉంటాయో మా యొక్క పక్షి నిపుణులు మరియు నేచురలిస్ట్‌లు వచ్చిన వారికి పక్షులను చూపిస్తూ క్షుణ్ణంగా వివరిస్తారని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ తెలిపారు. ఈ యొక్క 'నేచర్ క్యాంప్' 'బర్డ్ వాక్' కార్యక్రమాలలో పాల్గొనాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 73823 07476 లేదా 94935 49399 నెంబర్‌లను సంప్రదించాలని వారు కోరారు.

## కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అలకనంద హస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐడి అదనపు డిజిపి చారుసిన్హా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసులో ఏ24 నిందితుడిగా ఉన్న డాక్టర్ రుత్తల వెంకట రమణ సంతోష్ నాయుడుని ఏపిలోని ఏలూరులో అరెస్ట్ చేసినట్లు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. విశాఖపట్నంలో అనస్థీషియాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ వెంకట రమణ సంతోష్ కిడ్నీ రాకెట్ కేసులో ఉన్న డా.రాజశేఖర్, డా.అవినాష్‌లకు సహకరించే వాడని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లెంటేషన్స్ అలకనంద హస్పిటల్‌తోపాటు, జనని, ఆరుణ హస్పిటల్‌లో జరిగినట్లు తెలిపారు. పేషెంట్స్‌కు మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు నిందితులకు సహక రించే వారని వెల్లడించారు. ఒక్కో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు మత్తు ఇచ్చినందుకు కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న పవన్ కుమార్ నుంచి రూ.2.5 లక్షలు డాక్టర్ వెంకట రమణ తీసుకునే వాడని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. నిందితుడి జ్యూ డిషియల్ రిమాండ్‌కు కొరకు ఎబీ నగర్ కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికి 19మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరారిలో ఉన్న మిగతా నిందితుల కోసం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రపంచానికే ఆదర్శంగా
# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

300 ఎకరాలలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం.. అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచానికే ఆదర్శంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని (కొత్తగూడెం) నిర్మించేలా అద్భుత ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో ప్రముఖ ఆర్కిటెక్ ఉషా రూపొందించిన కొత్తగూడెం మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిర్మాణ ప్లాన్‌ను వైస్ ఛాన్సలర్ యోగితా రాణా, ఇతర అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రపంచానికే తలమానికంగా తెలంగాణ రాష్ట్రంలో మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యాధునీక సాంకేతిక పద్దతులతో అన్ని మౌలిక సదుపాయాలతో యూనివర్సిటీని నిర్మించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడ లోటుపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పకడ్బందీగా ప్లాన్‌ను రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు, లెక్చరర్లకు అసౌకర్యం లేకుండా విశాలమైన తరగతిగదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలను నిర్మించాలన్నారు. ఆర్కిటెక్ తయారు చేసిన డిజైన్లను త్వరలో ముఖ్యమంత్రికి చూపించి ఆయన ఆదేశాలకనుగుణంగా డిజైన్ల ఆమోదం తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి ఇచ్చిన వెంటనే ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌తో మాస్టర్ ప్లాన్ గురించి మంత్రి తుమ్మల మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని, హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మూడేళ్లలో యూనివర్సిటీ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటి యూనివర్సిటీ అన్నారు. ఇది రాష్ట్రానికే కాకుండా దేశానికే తలమానికంగా ఆకర్షణీయమైన డిజైన్లతో దీనిని నిర్మించాలన్నారు. 300 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకోనుందని ఈ యూనివర్సిటీ ద్వారా వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలు కలగనున్నాయన్నారు. మైనింగ్ కళాశాలను విశ్వ విద్యాలయంగా మార్చడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అపారమైంది. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎర్త్‌సైన్స్ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ముఖ్యమంత్రిని ఒప్పించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతకృత్యులయ్యారు. ప్రపంచానికే తలమానికంగా విశ్వ విద్యాలయాన్ని నిలిపేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారు. ఖమ్మం జిల్లా ప్రతిష్టను ప్రపంచానికి చాటిచెప్పేలా విశ్వ విద్యాలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషి పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కూనంనేని సాంబశివరావు

(మొదటి పేజీ తరువాయి)

పాలమాకుల జంగయ్య, ఎస్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమామహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి, షేక్ బాసుమియా

**ఆహ్వానితులు:** గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాంద్ర సదానందం ఎన్నికవ్వగా, రంగారెడ్డి నుంచి ఒకరిని ఎన్నుకోవాల్సి ఉంది.

**సిపిఐ నూతన రాష్ట్ర సమితి**

**రాష్ట్ర సమితి సభ్యులు :**

**రాష్ట్ర కేంద్రం :** కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్, ఎన్.జ్యోతి, వి.సృజన, ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసుఫ్, కలకొండ కాంతయ్య, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, కె.మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, వి.సీతారామయ్య, బొమ్మగాని ప్రభాకర్, బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, ఎన్.మధుకర్, రమావత్ అంజయ్య నాయక్, పల్లె నర్సింహా, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.ధనుంజయనాయుడు, మారపాక అనిల్‌కుమార్.

**జిల్లాల నుంచి:** సుధాకర్(నిజామాబాద్), ఎల్.దశరథ(కామారెడ్డి), టి.ఎం.ఖాలీఖ్ (మెదక్), విజయలక్ష్మీ పండిట్ (వికారాబాద్), చెన్న విశ్వనాథం (జగిత్యాల), టి.నర్సింహా(నారాయణపేట్), బి.ఆంజనేయులు(గద్వాల్), బి.బాలకిషన్ (మహబూబ్‌నగర్), తోట మల్లిఖార్జున్‌రావు (ములుగు), ముడుపు ప్రభాకర్ రెడ్డి (ఆదిలాబాద్), బద్రి సాయికుమార్ (ఆసిఫాబాద్), మంద సుదర్శన్ (సిరిసిల్లా), కె.విజయరాములు (వనపర్తి), సయ్యద్ జలాలుద్దీన్ (సంగారెడ్డి), మేకల రవి, షేక్ బాసుమియా, పంజాల రమేశ్ (వరంగల్), పంజాల శ్రీనివాస్, అందె స్వామి (కరీంనగర్), రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్ (మంచిర్యాల), తాంద్ర సదానందం, గోశిక మోహన్ (పెద్దపల్లి), దండి సురేశ్, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్ర బాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు (ఖమ్మం), ఎస్.కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి (కొత్తగూడెం), ఎస్.ఎం.డి.ఫయాజ్ (నాగర్ కర్నూల్), మందా పవన్, కె.శంకర్ (సిద్ధిపేట్), నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహా రెడ్డి, ఎల్.శ్రవణ్‌కుమార్ (నల్లగొండ), గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు (సూర్యాపేట), గోదా శ్రీరాములు, యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, చేడె చంద్రయ్య (యాదాద్రి భువనగిరి), పాలమాకుల జంగయ్య, పొనుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎం.డి.ఫమీదా, ఓరుగంటి యాదయ్య (రంగారెడ్డి), ఇ.ఉమామహేశ్, జి.దామోదర్‌రెడ్డి (మేడ్చల్), కర్రె భిక్షపతి, అదారి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మందా సదాలక్ష్మి (హన్మకొండ), కొరిమి రాజ్‌కుమార్ (భూపాలపల్లి), సి.హెచ్.రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మ (జనగామ), బి.విజయసారధి, బి.అజయ్ సారధి(మహబూబాబాద్), స్టాలిన్, ఛాయాదేవి (హైదరాబాద్),ఇన్సాఫ్(1), నిర్మల్ జిల్లా(1), మజ్దూర్ ఫ్రంట్ (1), రంగారెడ్డి (2) సభ్యులను ఎన్నుకోవలసి ఉంది.

**క్యాండిడేట్ సభ్యులు :**

ముడుపు నళిని(మహిళా ఫ్రంట్), ఎం.నర్సింహా, బి.వెంకటేశ్ (ట్రేడ్ యూనియన్), అజ్మీరా రామ్మూర్తి(గిరిజన సంఘం), కె.భూమయ్య (ఎఐకెఎస్), కె.వి.ఎల్.(అయిప్సో), జోగుల మల్లయ్య (మంచిర్యాల), సిద్ధినేని కరుణాకర్ (ఖమ్మం), సలిగండి శ్రీనివాస్ (కొత్తగూడెం), బంటు వెంకటేశ్వర్లు(నల్లగొండ), ఉస్తేల నారాయణరెడ్డి(సూర్యాపేట), టి.రామకృష్ణ, బుద్దుల జంగయ్య(రంగారెడ్డి)

**ఆహ్వానితులు :**

కె.సూర్యనారాయణ (ఎఐకెఎస్), కె.శ్రీనివాస్ (ప్రజానాట్య మండలి), టి.వెంకట్రాములు(వృత్తి సంఘాలు), ఎస్.బాబు(ఆర్‌టిసి), జానకిరామ్ (బ్యాంకింగ్), వి.చెన్నకేశవరావు(సి.ఆర్.ఫౌండేషన్), ఉజ్జిని రత్నాకర్‌రావు(తెలంగాణ అమరవీరుల ట్రస్ట్), కట్టెబోయిన శ్రీనివాస్(మహబూబాబాద్), ఇప్పకాయల లింగయ్య, బొల్లం పూర్ణిమ (మంచిర్యాల), ఎం.డి.సలీమ్, బి.జి.క్లెమెంట్(ఖమ్మం), ఎస్.డి.సలీమ్, రావులపల్లి రవికుమార్, చంద్ర నరేంద్ర కుమార్(కొత్తగూడెం), వర్ల వెంకటయ్య, కౌకుంట్ల కేశవులుగౌడ్(నాగర్‌కర్నూల్), ఉజ్జిని యాదగిరిరావు (నల్లగొండ), ఆది సాయన్న (జనగామ), నల్లు సుధాకర్ రెడ్డి(మహబూబాబాద్), కమతం యాదగిరి, జి.చంద్రమోహన్‌గౌడ్ (హైదరాబాద్), తోట భిక్షపతి (హన్మకొండ), గౌతమ్ గోవర్ధన్ (పెద్దపల్లి), కె.ఏసురత్నం (మేడ్చల్ మల్కాజ్‌గిరి), వీరభద్రయ్య (సింగరేణి), సిద్ధిపేట (1), యాదాద్రి భువనగిరి(1), రంగారెడ్డి (1)ల నుంచి ఒక్కొక్కరిని ఎన్నుకోవలసి ఉంది.

## వైద్య విద్యార్థులకు శుభవార్త

1623 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరోగ్యశాఖలో మరోసారి ఉద్యోగాల జాతర మొదలైంది. ఈ మేరకు శుక్రవారం 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టు ల భర్తీకి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్స్‌లో 1616, ఆర్‌టిసి హాస్పిటల్లో 7 పోస్టులు ఉన్నాయి. దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్లోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనుంది. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగు అవనున్నాయి. మరోవైపు పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ కానున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభు త్వం భర్తీ చేసిన విషయం తెలిసిందే. మరో 7 వేల పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
No.E1/DB/MCK/8201/228/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 21.08.2025
ఎంసికె లోని కరీంనగర్ నగర పరిధిలోని వివిధ ప్రదేశాలలో 03 స్పీడ్ బ్రేకర్లు మరియు రంబుల్ స్ట్రిప్పు ఎంజిఎఫ్ కింద - **మొత్తం అంచనా వ్యయం:** రూ.35.00 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 23.08.2025 - 04.00PM, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 02.09.2025 - 04.00PM, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 6892-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం, కూకట్‌పల్లి జోన్.
NIT No. 04/GHMC/KPZ/CTO/2025-26 టెండర్ ప్రకటన తేది: 22.08.2025
**క్ర.సం.1, పని పేరు:** జిహెచ్‌ఎంసి, కూకట్‌పల్లి జోన్‌లో గణేష్ పండుగ-2025 దృష్ట్యా (01) నెల పాటు సిఆర్‌ఎంపి ప్రధాన రహదారి విస్తరణలలో మెకానికల్ స్వీపింగ్ నియామకం. **అంచనా విలువ / ఇసివి:** రూ.25,00,000.00, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 23.08.2025న ఉ.11.00గం.ల నుండి 26.08.2025న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ గోవర్ధన్ గౌడ్, చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, జిహెచ్‌ఎంసి, కూకట్‌పల్లి జోన్. సెల్ నెం. 7337367270. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/ లో చూడవచ్చు.
సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి, కూకట్‌పల్లి జోన్.
DIPR R.O. No. : 6914-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025

తెలంగాణ ప్రభుత్వము
**శ్రీయుత అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నల్లగొండ వారి కార్యాలయము, నల్లగొండ జిల్లా**
టెండరు ప్రకటన
నల్లగొండ జిల్లాలోని (868) గ్రామ పంచాయతీలలో **LED వీధిదీపాలు** సరఫరా చేయుటకు మరియు రిపేరు చేయుటకు రేటు కాంట్రాక్టు కొరకు ఆసక్తి గల వారి నుండి సీల్ టెండర్స్ కోరబడుచున్నవి.
కావున, ఆసక్తి గల వారు, వారి యొక్క ఫర్మ్ లెటర్ పాడ్ (with GST నెం.) తో పాటు దిగువ చూపిన సమాచారంతో కూడిన సీల్డ్ టెండర్లు తేది: 23-08-2025 ఉదయం 11:00 గంటల నుండి తేది: 26-08-2025 మధ్యాహ్నం 04:00 గంటల వరకు శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి వారి కార్యాలయము, నల్లగొండ యందు సమర్పించుటకు కోరనైనది. టెండర్ 26-08-2025 సాయంత్రం 04:00 గంటలకు తెరవబడును. వివరాలకు శ్రీ యన్.వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతి కార్యాలయము, నల్లగొండ గారిని (8074172060) సంప్రదించగలరు.

| Sl.No. | Description / Material | |
|---|---|---|
| 1 | STREET LIGHTS (LED) | |
| 2 | REPAIRS OF STREET LIGHTS | |

సం/- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నల్లగొండ
దీనిప్రతి శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి, నల్లగొండ గారికి తదుపరి చర్య నిమిత్తం.
DIPR R.O. No. : 6903-PP/CL/ADVT/1/2025-26, Date: 22-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఘనంగా ఆక్స్‌ఫర్డ్‌లో 'షార్క్‌ట్యాంక్'

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** విద్యార్థుల సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, వ్యవస్థాపకతను పెంపొందించడానికి హైదరాబాద్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో షార్క్ ట్యాంక్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో మొత్తం 13బృందాల జూనియర్, సీనియర్ క్యాటగిరీల వారీగా రోజువారీ సమస్యల పరిష్కారాల నుంచి సాంకేతిక పురోగతి వరకు వినూత్న ఆలోచలను ప్రదర్శించారు. ఈ యువ మేధావులు చూపిన సృజనాత్మకత, పరిశోధన, కృషి షార్క్‌లను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. విజేతలకు



ప్రత్యేక జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్, డీన్ రమనుజుల, ప్రిన్సిపాల్ సి.హెచ్.రేఖారావు, కోఆర్డినేటర్‌లు, ప్రోగ్రామ్ మేనేజర్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట సభల్లో ప్రాతినిధ్యంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది

సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్**

ప్రస్తుత శాసనసభ, శాసనమండలి ఉభయ సభలలో సిపిఐకి ప్రాతిని ధ్యం ఉండడంతో బడుగు, బలహీన, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని ఎంఎల్‌సి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చెప్పారు. గడిచిన ఏడాది కాలంగా చట్టసభలలో పేద ప్రజల సమస్యలను లేవనెత్తడంతో పాటు, బయట అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదిక (ముసాయిదా)పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించిందని చెప్పారు. దిండి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ 25 రోజుల పాదయాత్ర చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని తీసుకువచ్చిన విషయాన్ని సత్యం గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన మునుగోడు ఉప ఎన్నికతో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందని నెల్లికంటి సత్యం అన్నారు. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిందన్న వారికి ఇదో చెంప పెట్టు అయిందని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై చేపట్టిన దమనకాండను నిరసిస్తూ మొట్ట మొదటగా సిపిఐ ఖండించడంతో పాటు వామపక్ష పార్టీలతో కలిసి నిరసన చేపట్టినట్లు వివరించారు.

# వెల్లువెత్తిన ఉద్యమ స్ఫూర్తి

అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసిన సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు

చర్చలు ఫలప్రదం, పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం



నూతనంగా ఎన్నికైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులతో అభివాదం చేస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా

**ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్**

సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం)లో ఘనంగా జరిగాయి. కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్‌లో ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన మహాసభలు మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఉద్యమ స్ఫూర్తితో ముగిశాయి. 'ఎర్ర జెండా జిందాబాద్, ఉద్యమాలే మా ఊపిరి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం, మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి' అని ప్రతినిధులు నినదిస్తూ పోరాట కార్యాచరణతో తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారు. తొలి రోజు బుధవారం ఉదయం మహాసభలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో రాజకీయ, సామాజిక పరిస్థితులు, సిపిఐ కర్తవ్యం, చేపట్టాల్సిన ప్రజా ఉద్యమాలపై రాజా ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ప్రతినిధుల సభలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సౌహార్ద సందేశాలిచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 727 మంది ప్రతినిధులు మహా సభలో పాల్గొన్నారు. ఈసారి ప్రతినిధులలో మహిళలు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదికపై గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు జరిగిన చర్చలో 58 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చకు కూనంనేని సాంబశివరావు సమాధానం ఇచ్చిన అనంతరం సభ ఆమోదించింది. వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు, వివిధ వర్గాల సమస్యలపై 42 తీర్మానాలను ప్రతినిధులు ప్రవేశపెట్టగా మహాసభ చర్చించి ఆమోదించింది. అనంతరం సిపిఐ రాష్ట్ర నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రజాసమస్యలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై ప్రజానాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

**727 మంది ప్రతినిధులు హాజరు**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభకు మొత్తం 727 ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 619 పురుషులు, మహిళలు 71మంది ఉన్నట్లు మహాసభ అర్హత కమిటీ ప్రకటించింది. ఇందులో వివాహితులు 590 మంది, అవివాహితులు 71 మంది ఉన్నట్లు వెల్లడించింది. 26 నుంచి 30 ఏళ్ల లోపు వారు 25 మంది, 31 నుంచి 35 మధ్య వయస్సు వారు 41మంది, 36 నుంచి 40 మధ్య వయస్సు 69 మంది, 41 నుంచి 50 లోపు వయస్సు వారు 190 మంది, 51 నుంచి 60 ఏళ్ల లోపు వారు 184 మంది 61 నుంచి 70 వయస్సు వారు 147 మంది, 71పైన బడిన వారు 34 మంది మహాసభలో పాల్గొన్నారు.5 వతరగతి లోపు వారు 33 మంది, 10వ తరగతి లోపు 156 మంది, ఇంటర్ 148 మంది, ఐటిఐ, పాలిటెక్నిక్ 18 మంది, డిగ్రీ 169 మంది, పిజి 12 మంది, ఇంజనీరింగ్ 12 మంది, లాయర్ 38 మంది, పిహెచ్‌డి 2, ఆపైన 8మంది ఉన్నారు. ఈ నివేదిక అర్హతకమి కన్వీనర్ తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ప్రవేశపెట్టగా, ప్రతినిధులసభఆమోదించింది.

**ఆడిట్ కమిషన్ నివేదిక ఆమోదం**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగిన సిపిఐ మూడవ మహాసభలు జరిగిన తర్వాత 2022 అక్టోబర్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు గాను జమా ఖర్చులకు సంబంధించిన వై.కృష్ణమూర్తి, వివిఎస్.మూర్తి, వై.జానకిరామ్‌లతో కూడిన అడిట్ కమిషన్ ఇచ్చిన నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు, అడిట్ కమిటీ సభ్యులు వై,కృష్ణమూర్తి (92)ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు.

**నవచేతన పబ్లిషింగ్ హౌజ్ పుస్తక ప్రదర్శనను తిలకించిన రాజా**

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల ప్రాంగణంలో నవచేతన పబ్లిషింగ్ హౌజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సిపిఐ ఐజాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తిలకించారు. ఈ సందర్భంగా రాజా పలు పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. పుస్తకాలకు సంబంధించిన వివరాలను రాజాకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస రెడ్డి వివరించారు.

## 'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధమవ్వండి



పేదల నమ్మకాన్ని కాపాడుకునేలా ఉద్యమ కార్యాచరణ

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శ్రేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో మూడవ రోజు శుక్రవారం చాడ వెంకట రెడ్డి సందేశమిచ్చారు. సభలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, తగిన గుర్తింపు రాలేదని విమర్శలు ఉన్నాయని, అయితే భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చరిత్ర కలిగిన ఎర్ర జెండా వద్దకు, సిపిఐ వద్దకు వెళితేనే తమకు నీడ (నివాస స్థలం) దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజలలో ఉండడం సిపిఐకి గర్వకారణమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. రాష్ట్రంలో ధరణి పోయి భూభారతి వచ్చినప్పటీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని, తెలంగాణ రాష్ట్రంలో పార్టీని విస్తరించడానికి, బలోపేతం చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని, పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్ధులు కావాలన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియతృంత్వ, ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదవాది, ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి గత 11 ఏళ్లుగా ఢిల్లీలో ఎర్ర కోటపై జాతీయ జెండాను ఎగురవేయడం దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో బిజెపిని ఎదుర్కొనేందుకు వామపక్ష పార్టీలు ఆచితూచి అడుగులు వేయాలన్నారు. బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 'బిజెపికి హటావో దేశ్ కో బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహించిందని గుర్తు చేశారు.

## విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

ఎమ్మెల్యే వివేకానంద గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మోడల్ యునైటెడ్ నేషన్స్ (మూన్) సెషన్‌లు విద్యార్థుల విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వం వంటి కీలక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద గౌడ్ పేర్కొన్నారు. మూన్ సెషన్‌లు ఐక్యరాజ్యసమితిని అనుకరించే విద్యా సమావేశాలలో ప్రతి యొక్క విద్యార్థి పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని కోరారు.గుండ్ల పోచంపల్లి డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో శుక్రవారం డిఆర్ఎస్2025 మూన్ సెషన్‌లను స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్, గర్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్, ఐ.వేణుగోపాల్‌లతో కలసి వివేకానంద గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మూన్ సెషన్‌లు విద్యార్థులకు భవిస్యత్తులో ప్రపంచ దేశాలను పరిశోధించడానికి, ప్రపంచ సమస్యలను చర్చించడానికి మరియు అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలను చర్చించడానికి వీలు కల్పిస్తాయన్నారు. విద్యార్థులు ప్రజా ప్రసంగం, పరిశోధన, రచన, దౌత్యంతో కూడిన నిర్మాణాత్మక ఎజెండాను అనుసరించాలన్నారు. ఈ సెషన్‌లలో విద్యార్థులు ఉత్సాహభరితమైన సంభాషణలు, అనర్గళమైన వాక్చాతుర్యం మరియు ప్రపంచ పౌరసత్వం యొక్క నీతి పట్ల అచంచలమైన నిబద్ధత ప్రదర్శించి తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూన్ అధ్యక్షురాలు ఎస్.మేరీ తనూజ, 2025 మూన్ సెషన్‌ల సెక్రటరీ జనరల్ అద్విక్ రెడ్డి, వివిధ స్కూల్‌ల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజునే తండ్రికి పాడి మోయడమా..!

ఈ దుస్థితి ఎవరికీ రాకూడదు

రామంతాపూర్ విద్యుదాఘాత ఘటనపై హైకోర్టు వ్యాఖ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టాల్సిన దారుణ పరిస్థితి ఏర్పడినందుకు మనమంతా సిగ్గుతో తల దించుకోవాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. తల్లిదండ్రుల మధ్య పుట్టినరోజు జరుపుకోవాల్సిన బాలుడి ముందే తండ్రి చనిపోయిన రామాంతపూర్‌లో ఇటీవల జరిగిన విద్యుదాఘాత ఘటనపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. తండ్రిని కోల్పోయిన తొమ్మిదేళ్ల బాలుడు కన్నీళ్లను ఎవరు ఆపగలని అధికారులను ప్రశ్నించింది. ఇందుకుబాధ్యులెవరో చెప్పాలంది. అందరూ బాధ్యులేనని చెప్పింది. వైర్లతో విద్యుత్ స్తంభాల వల్ల పలువురు మామూళ్లతో ఉన్నారని ధ్వజమెత్తింది. కిందకు వేలాడుతున్న వైర్లను కట్ చేయాలని, అనుమతి ఉన్న వాటిని అవీ సక్రమంగా ఉన్న వాటినే అనుమతించాలని అనుమతి లేని కేబుల్‌లను వెంటనే తొలగించాలని రాష్ట్రానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అందరూ సహకరించాలంది. ఇలాంటివి జరగకుండా ఏం చేయాలో ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్ తోపాటు పిటిషనర్ కూడా ప్రతిపాదనలతో రావాలంది. విచారణను సోమవారానికి వాయిదా చేసింది. రామాంతపూర్‌లో శ్రీకృష్ణుడి శోభాయాత్ర సమయంలో విద్యుదాఘాతంతో ఆరుగురు, పాతబస్తీలో మరో నలుగురు మరణించడంతో వైర్లను ప్రభుత్వం కట్ చేసింది. దీనిపై భారతి ఎయిర్ టెల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం మరోసారి విచారించి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు.

## జడ్జికి క్షమాపణలు చెప్పిన లాయర్లు

కక్షిదారుడు కూడా..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల న్యాయమూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కేసులో తీర్పు చెప్పాక తాము సుప్రీం కోర్టులో పిటిషన్ వేశామని, తీర్పు చెప్పవద్దని పిటిషనర్, లాయర్లు కోరడాన్ని ఆమె అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు తీసుకువెళ్లారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లిలోని భూవివాదంలో పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో రేవంత్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయడాన్ని జస్టిస్ భట్టాచార్య గతంలో కొట్టేశారు. తాము సుప్రీం కోర్టును వెళ్లామని తీర్పు చెప్పవద్దన్న పిటిషనర్ల వినతిని తిరస్కరించారు. ఈ కేసును వేరే కోర్టుకు బదిలీ చేయాలని, న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్దిరాజు సుప్రీంకు వెళ్లారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న హైకోర్టు పెద్దిరాజు, అడ్వొకేట్లు రితేష్ పాటిల్, నితిన్ మహేశ్‌లపై సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణించింది. హైకోర్టుకు వెళ్లి జస్టిస్ భట్టాచార్యకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆదేశించడంతో శుక్రవారం వారంతా క్షమాపణలు చెప్పి ఆ మేరకు అఫిడవిట్ కూడా దాఖలు చేశారు.

## ఎసిబి వలలో సబ్ రిజిస్ట్రార్

రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష డిమాండ్

రూ.70వేలు తీసుకుంటూ పట్టపడిన వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేశ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి /ఎల్.బినగర్ :** వనస్థలిపురంలోని సబ్ రిజిస్టర్ ఆఫీసులో అవినీతిపై ఎసిబి అధికారులకు పలు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. స్థల రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎసిబి డిఎస్‌పి ఆనంద్ కుమార్ నేతృత్వంలో వనస్థలిపురం సబ్ రిజిస్టర్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు. వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. తుర్కయంజాల్‌లోని ఒక 200గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్ రాజేశ్ ఒక లక్ష డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇవ్వలేనని రూ.70 వేలు ఇస్తానని వేడుకోవడంతో ఒప్పుకున్నాడు.దీంతో అతను ఎసిబి అధికారులను ఆశ్రహించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు రంగంలోకి దిగి రూ.70వేలు లంచం తీసుకుంటుండగా పథకం ప్రకారం పట్టుకున్నారు.రాజేశ్ తోపాటు టైపిస్ట్‌గా పని చేస్తున్న రమేశ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎసిబిడిఎస్‌పి ఆనంద్ కుమార్ వివరించారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లుల ప్రస్తావనేదీ?

ఇండియా, ఎన్‌డిఎ ఎంపిల తీరుపై మండిపాటు

బిసిలను దగా చేస్తున్న రాజకీయ పార్టీలు

తెలంగాణ దళిత సంఘాల ఐకాస సమావేశంలో జాజుల

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పార్లమెంట్ సమావేశాల్లో ఎన్‌డిఎ, ఇండియా కూటమి ఎంపిలు బిసి బిల్లులపై నోరు మెదకపోవడంపై బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిసి ప్రధానిగా ఉన్న మోదీ, జనాభా ప్రకారం వాటా దక్కాల్సిందే అంటున్న రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మౌనంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. దీంతో బిసి రిజర్వేషన్ల విషయం అందని ద్రాక్షగానే మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలను మోసం, దగా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 42శాతం బిసి రిజర్వేషన్ల సాధనకు మద్దతు ప్రకటిస్తూ తెలంగాణ దళిత సంఘాల ఐకాస సమావేశం బత్తుల చంద్రం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ దళిత సంఘాల ఐకాస బిసి రిజర్వేషన్ల సాధనకు మద్దతు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో, పార్లమెంట్‌లో చట్టం చేసిన బిల్లులను మూడు నెలల కంటే ఎక్కువసమయం పెండింగ్‌లో పెట్టొద్దని ఇటీవల సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చెప్పారని గుర్తుచేశారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను ఆమోదించకుండా కేంద్రం సుప్రీంకోర్టును అగౌరవపరుస్తున్నదన్నారు. రాహుల్‌గాంధీకి బిసి రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే 300 మంది ఇండియా కూటమి ఎంపిలతో మోదీ ఇంటి ముందు ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి బ్రాహ్మణ జనతా పార్టీగా ఉంటదో,, బహుజన జనతా పార్టీగా మారుతదో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. ఆధిపత్య దొరల అహంకార పూరిత పాలనకు చరమగీతం పాడేవరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలంతా కలిసి పోరాడుతామని తెలిపారు. సమావేశంలో ఐకాస నేతలు వనం రమేశ్, సునీల్, కూతాడి రవికుమార్, సదానందం, భాస్కరచారి, బిసి నేత జాజుల లింగం గౌండ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో..
# వీడిన మిస్టరీ


చోరీ ప్లాన్ కాస్తా మర్డర్‌గా మారిన వైనం

క్రికెట్ బ్యాట్ కోసమే బాలిక హత్య..!

పదో తరగతి బాలుడే హంతకుడు







**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 18న ఇంట్లో ఒంటరిగా ఉన్న సహస్ర (11) దారుణ హత్య కేసు మిస్టరీ వీడింది. క్రికెట్ బ్యాట్ దొంగిలించేందుకు వచ్చి..అడ్డుకోవడంతో సహస్రను హత్య చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి పక్కన ఉండే స్నేహితుడే హంతకుడిగా మారిన వైనం స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో నివసిస్తున్న దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సహస్ర (11) సంతానం. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు కుమారుడు స్కూల్‌కు వెళ్లగా, తండ్రి బైక్ మెకానిక్ కావడంతో షాప్‌కు వెళ్లాడు. తల్లి ల్యాబ్ టెక్నిషియన్ కావడంతో ఆమె కూడా డ్యూటీకి వెళ్లింది. ఇంట్లో సహస్ర ఒక్కతే ఉంది. సహస్త తమ్ముడి స్నేహితుడైన ఇంటి పక్కనే నివాసముంటున్న పదో తరగతి విద్యార్థి (15) బ్యాట్ దొంగిలించేందుకు ఇంట్లోకి ప్రవేశించాడు. ఈ విషయం గమనించిన సహస్త అతన్ని అడ్డుకుంది. తన దొంగ తనం బయట పడుతుందనే ఉద్దేశ్యంతో అతని వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో సహస్తను పొడిచాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకుని అతడు అక్కడి నుంచి పారిపోయాడు. స్కూల్‌కి వెళ్లిన కుమారుడికి భోజనం తీసుకువెళ్లేందుకని తండ్రి మధ్యాహ్నం 12.30 గంటలకు బైక్ షాప్ నుంచి ఇంటికి వచ్చి చూసే సరికి బెడ్ రూమ్‌లో సహస్త రక్తంమడుగులో కనిపించింది.ఎట్టిపరిస్థితుల్లోనూ సహస్ర బ్రతికి ఉండకూడదనే విచ్చలవిడిగా కత్తితో పొడిచినట్లు సమాచారం. దొంగతనం కోసం ఇంట్లోకి వెళ్లే ముందే.. ఎవరైనా అడ్డొస్తే ఏం చేయాలన్న దానిపై ఒక పేపర్‌పై రాసుకుని దానినే అమలు చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సహస్ర హత్య వెనుక దొంగతనమే కారణమా లేక మరేదైనా కారణం ఉందా ? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం బాలుడు పోలీసుల అదుపులోనే ఉన్నాడు. కాగా.. బాలుడు దొంగతనానికి వెళ్లే ముందు రాసుకున్న ప్లాన్ పేపర్ వైరల్ అవుతోంది. ముందు సహస్ర ఇంట్లోకి వెళ్లి తనపై గ్యాస్ సిలిండర్ ఉంచాలి. ఆ తర్వాత డబ్బులు దొంగతనం చేయాలి. నెక్స్ట్ గ్యాస్ లీక్ చేసి, డోర్ కి లాక్ పెట్టి వచ్చేయాలి. అని ఆ బాలుడు ప్లాన్ రాసుకున్నాడు. కానీ.. దొంగతనం చేసి వెళ్తుండగా సహస్ర అడ్డుకోవడంతో థెఫ్ట్ ప్లాన్ కాస్తా మర్డర్ గా మారింది. హత్యకు వారం రోజుల ముందు హతుడు బాలిక తమ్ముడిని బ్యాట్ అడిగితే ఇవ్వలేదని కక్ష పెంచుకున్నాడని, తమ్ముడు స్కూల్ కి వెళ్లిన టైమ్ లో ఇంట్లోకి వెళ్ళి బ్యాట్ దొంగతనం చేయాలని ప్లాన్ వేసుకుని ఉంటాడని, అడ్డువస్తే ఎవరినైనా చంపేసేలా ఉన్మాద ప్రణాళిక పెట్టుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.



## పదోన్నతులిచ్చిన సిఎంకి ధన్యవాదాలు : ఎస్‌టిఎఫ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎంతోకాలంగా వేచి చూస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టిఎఫ్) ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం నాడు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ అధ్యక్షులు దేవరకొండ సైదులు, ప్రధానకార్యదర్శి యు.పోచయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీచర్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో ఎన్ని పోరాటాలు చేసినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 22 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్తులు, 47,244 మంది టీచర్లను బదిలీలు చేసి, ప్రభుత్వ విద్య బోలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతుందని అభినందించారు. ఇక, ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విడుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'జోగులాంబ ఆలయ మాస్టర్ ప్లాన్'
# రూ.345 కోట్లతో సిద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జోగులాంబ ఆలయానికి త్వరలోనే పూర్వ వైభవం కల్పించాలని, అందుకు రూ.345 కోట్లతో మాస్టర్ ప్లాన్‌రను సిద్ధం చేస్తూ ఐదవ శక్తి పీఠం జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నాడు జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ధార్మిక సలహాదారు, స్థపతి గోవింద హరి, రోడ్లు, భవనాలు, ఆర్కియాలజీ, దేవాదాయ శాఖ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జోగులాంబ ఆలయ పునరుద్ధరణ పనులను తక్షణమే ప్రారంభించాలని, ఆలయ పునరుద్ధరణ పనులు మూడు దశలలో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చిన్నారెడ్డి వివరించారు.

హైవేలలో షైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని, సౌండ్ అండ్ లైట్ షో, బస్‌స్టాండ్స్ నిర్మాణాలు వెంటనే చేపట్టాలన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాష్ట్రపతితో శుభాన్షు శుక్లా



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో వ్యోమగామి శుభాన్షు శుక్లా కలిశారు. అంతరిక్షంలో తన అనుభవాలను పంచుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు ప్రయాణించిన తొలి భారతీయ వ్యోమగామి శుక్లా. ఆక్సియం మిషన్–4లో భాగంగా 20 రోజుల అంతరిక్ష పర్యటన తర్వాత ఆయన, ఇతర తోటి వ్యోమగాములతో కలిసి గత నెలలో భూమికి తిరిగి వచ్చారు. ఇస్రో చైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్, హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ దినేష్ కుమార్ సింగ్‌తో కలిసి గ్రూప్ కెప్టెన్ శుక్లా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ పుణ్యశ్లోక్ బిస్వాల్ ముర్మును కలిశారని రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపింది. అతను అంతరిక్షంలో తన అనుభవాలను రాష్ట్రపతితో పంచుకున్నాడని అది పేర్కొంది. భవిష్యత్ ప్రయత్నాల కోసం, ముఖ్యంగా గగన్‌యాన్ మిషన్ కోసం మొత్తం బృందానికి రాష్ట్రపతి తన శుభాకాంక్షలు తెలిపినట్లు వెల్లడించింది.

## ఆధార్ సహా, నిర్దేశిత డాక్యుమెంట్‌తో
# దరఖాస్తుకు ‘సుప్రీం’ అనుమతి

బిహార్‌లో తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చుకోవాలని సుప్రీం సూచన

సెప్టెంబర్ 8నాటికి ‘స్టేటస్ రిపోర్టు’ దాఖలు చేయాలని పార్టీలకు సూచన



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా జారీలో తొలగించబడిన ఓటర్లు వారి క్లెయిమ్‌లను భౌతికంగా, ఆన్‌లైన్ మోడ్ ద్వారా సమర్పించడానికి అనుమతించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని (ఈసి)ని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్ మాల్యా బాగ్చి ద్విసభ్య ధర్మాసనం బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై విచారణ చేపట్టింది. ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ మినహాయించిన పేర్ల విషయంలో ఆధార్‌కార్డు లేదా ఎస్ఐఆర్‌లో అంగీకరించిన 11 డాక్యుమెంట్లలో ఏదో ఒకదానిని సమర్పించి, పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ, పేరును తిరిగి చేర్చాలనే దరఖాస్తును ఇవ్వాలని సూచించింది. తొలగించిన 65లక్షల ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలను దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు ముందకు రాకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. వారిని కోర్టు ప్రొసీడింగ్స్‌ల్లో చేర్చాలని బిహార్ ప్రధాన ఎన్నికల అధికారిని సుప్రీంకోర్టు ఆదేశించింది. మినహాయించబడిన ఓటర్లు దాఖలు చేయడానికి వారు సులభతరం చేసిన క్లెయిమ్ ఫారమ్‌పై తదుపరి విచారణ తేదీ నాటికి అన్ని రాజకీయ పార్టీలు వారి స్టేటస్ రిపోర్ట్‌ను దాఖలు చేయాలని సూచిస్తూ ధర్మాసనం కేసు విచారణను సెప్టెంబరు 8కి వాయిదా వేసింది. తొలగించబడిన ఓటర్ల క్లెయిమ్ ఫారాలను భౌతికంగా సమర్పించే రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు అక్నాలెడ్జ్‌మెంట్ రశీదును అందించాలని ధర్మాసనం ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘానికి (ఈసిఐ) ఎలాంటి మినహాయింపులేదని చూపించడానికి ఒక 15రోజుల గడువు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ‘రాజకీయ పార్టీలు పెద్ద యెత్తున గొడవలు చేస్తున్నాయి. పరిస్థితులు ఏమీ బాగాలేవు. మాపై నమ్మకం ఉంచి మాకు మరి కొంత సమయం ఇవ్వండి. ఎటువంటి మినహాయింపులు లేవని మేం మీకు నిరూపిస్తాం’ అని న్యాయవాది రాకేశ్ ద్వివేదీ అన్నారు. బిహార్ రాష్ట్రంలోని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కింద ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 2 లక్షల మంది ఓటర్లు ముందుకు వచ్చారని, ముసాయిదా (డ్రాఫ్ట్)జాబితాలో మినహాయించబడిన దాదాపు 85,000 మంది ఓటర్లు తమ వాదనలు సమర్పించాలని ఎన్నికల సంఘం ధర్మాసనానికి నివేదించింది. ఎన్నికల సమయంలో ‘పారదర్శకత’ను పెంచడానికి బిహార్‌లో డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించబడిన 65లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19నాటికి సమర్పించాలని సుప్రీంకోర్టు ఆగస్టు 14న ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ, ఐడెంటిటీ ప్రూఫ్ కోసం ఆధార్‌ను ఆమోదయోగ్యమైన డాక్యుమెంట్‌గా అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. ‘కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో వాటిని చేర్చకపోవడానికి గల కారణాలను సైతం వివరాలలో చేర్చాలని ఆదేశించింది. ‘పారదర్శకత ఓటరు విశ్వాసాన్ని సృష్టిస్తుంది’ అని హితవు పలికింది.

# టీకాలు వేసిన తరువాతే విడిచిపెట్టండి

వీధికుక్కలపై ఉత్తర్వులు సవరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** వీధి కుక్కల అంశంలో సుప్రీంకోర్టుతన గత తీర్పును సవరించింది. వీధి కుక్కలను స్టెరిలైజ్ చేసి, వాటిని రిలీజ్ చేయాలని శుక్రవారం అత్యున్నత న్యాయ స్థానం తన తాజా తీర్పులో ఆదేశించింది. ఢిల్లీలో ఎక్కడ నుంచి తీసుకెళ్లిన కుక్కలను, స్టెరిలైజ్ చేసిన తర్వాత వాటిని అక్కడే వదిలేయాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. వీధి కుక్కలను ఉంచేందుకు శాశ్వత షెల్టర్ జోన్లను ఏర్పాటు చేయాలని ఇటీవలే ఇచ్చిన ఆదేశాల్లో ఈమేరకు సుప్రీంకోర్టు కీలక మార్పులు చేసింది. అయితే ప్రజలను కరిచే స్వభా వం కలిగిన, రేబిస్ వ్యాధిగ్రస్థ కుక్కలకు వ్యాక్సినేషన్ చేసి, షెల్టర్ జోన్లలోనే ఉంచాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాలను సమీక్షించి ఈమేరకు కొత్త ఆర్డర్స్‌ను జారీ చేసింది. ‘వీధి కుక్కలను షెల్టర్ జోన్ల నుంచి విడుదల చేసే ముందు వాటికి బర్త్ కంట్రోల్ ఆపరేషన్‌తో పాటు వ్యాక్సినేషన్ చేయించాలి. నులి పురుగుల నివారణ మందులు వేయాలి. ఆ తర్వాత వాటిని ఎక్కడైతే పట్టారో, అదే ఏరియాకు తీసుకెళ్లి వదిలేయాలి. ఈ అంశాలను మున్సిపల్ అధికార వర్గాలు తప్పక పాటించాలి’ అని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ ఆదేశించారు. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో వీధి కుక్కలకు రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ ప్రజలు ఆహారాన్ని అందించడానికి అస్సలు అనుమతించేది లేదన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలకు ఆహారాన్ని అందించేందుకు మున్సిపల్ వార్డుల పరిధిలో ఎక్కడికక్కడ ప్రత్యేక ఫీడింగ్ ఏరియాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. వార్డుల పరిధిలో ఉండే వీధి కుక్కల సంఖ్య ఆధారంగా ఎన్ని ఫీడింగ్ ఏరియాలను ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయాన్ని తీసుకోవాలని సూచించింది. ‘ఇక్కడ మాత్రమే వీధి కుక్కలకు ఆహారాన్ని అందించాలి’ అనే సందేశంతో ఆయా ఫీడింగ్ ఏరియాల్లో నోటీసు బోర్డులను ఏర్పాటు చేయించాలని నిర్దేశించింది. ఈ అంశంపై స్పష్టమైన జాతీయ విధానానికి దిశా నిర్దేశం చేసేందుకుగానూ దేశవ్యాప్తంగా వీధి కుక్కలకు సంబంధించి నమోదైన పిటిషన్లన్నీ సుప్రీంకోర్టుకే బదిలీ చేయాలని ధర్మాసనం కోరింది.

**ఆగస్టు 11 ఆదేశాలను ‘సుప్రీం’ ఎందుకు మార్చింది ?**

వీధి కుక్కలు దడ పుట్టిస్తున్నాయి. 2024 సంవత్సరంలో ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో ఏకంగా 37 లక్షల కుక్కకాటు ఘటనలు చోటుచేసుకున్నాయి. 54 మంది రేబిస్‌తో చనిపోవడానికి కుక్కలు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలోని నగరాలు, పట్టణాల్లో వీధి కుక్కల కోసం 5వేలు చొప్పున శాశ్వత షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఆగస్టు 11న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. 8 వారాల్లోగా వీధి కుక్కలను ఆయా షెల్టర్లలోకి తరలించాలని నిర్దేశించింది. ఈ ఆదేశాలిచ్చిన ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ జెబి పర్దీవాలా, ఆర్ మహదేవన్ ఉన్నారు. అయితే ఈ ఆర్డర్స్‌పై జంతు ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రముఖ సామాజిక కార్యకర్తలు, సెలబ్రిటీలు కూడా ఈ ఆదేశాలను బహిరంగంగా విమర్శించారు. వీధి కుక్కలను షెల్టర్లలో బంధించి ఉంచడం సరికాదన్నారు. మరోవైపు ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలోని స్థానిక సంస్థల ఉన్నతాధికారులు కూడా ఈనెల 11 ఆదేశాలతో షాక్‌కు గురయ్యాయి. షెల్టర్ జోన్‌ల ఏర్పాటు కానీ, వాటిలో లక్షలాది వీధి కుక్కలను పోషించేందుకు కానీ తమ వద్ద తగినన్ని నిధులు లేవని చెప్పసాగారు. ఈనేపథ్యంలో స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బిఆర్ గవాయ్ ఈనెల 11న జారీ అయిన ఆదేశాలను సమీక్షించమని మరో ధర్మాసనానికి సూచించారు. ఈ ధర్మాసనంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వి అంజారియా ఉన్నారు. వీరు ఈ వారం ఆరంభంలోనే 11 ఆదేశాల అమలును నిలిపివేశారు. నాటి ఆదేశాల్లో కీలక మార్పులు చేసి, తాజాగా శుక్రవారం రోజు ఆర్డర్స్‌ను జారీ చేశారు.

## బిహార్ ఎస్ఐఆర్ విషయంలో ‘సుప్రీం’ ఆదేశాన్ని.. ‘స్వాగతించిన’ కాంగ్రెస్

ఇసి క్రూరదాడి నుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని జైరామ్ రమేష్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** బిహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) విషయమై సుప్రీంకోర్టు ఆదేశాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. భారత ఎన్నికల సంఘం క్రూరమైన దాడి నుండి ప్రజాస్వామ్యం బయటపడిందని కాంగ్రెస్ సంతృప్తిని వ్యక్తంచేసింది. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిజస్వరూపం ‘బహిర్గతమైందని’, ‘పూర్తిగా అపఖ్యాతి పాలైంది’ అని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలను చేర్చడం ద్వారా సవరణను మరింత కలుపుకుని పోయేలా చేయడానికి సుప్రీంకోర్టు రక్షణ కల్పించిందని, భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) విధానం ఓటర్ల ప్రయోజనాలకు ఆటంకం కలిగించేదిగా, విరుద్ధంగా ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది.ఎన్నికలు జరుగనున్న బిహార్ ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ కసరత్తులో తొలగించబడిన ఓటర్లు భౌతిక సమర్పణలు చేయడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా క్లెయిమ్‌లు సమర్పించేందుకు సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది.న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బిహార్‌లో తొలగించబడిన ఓటర్లు తిరిగి వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని అభ్యర్థిస్తూ ఆధార్ కార్డుతో, సూచించిన 11డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పిస్తూ అభ్యర్థన దరఖాస్తు చేసేందుకు అనుమతించింది. ఈమేరకు శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. 65లక్షల ఓటర్లను తొలగించడానికి సంబంధించి అభ్యంతరాలను దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రాకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కోర్టు ప్రొసీడింగ్స్‌లలో వారిని చేర్చాలని బిహార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ బిహార్ ఎస్ఐఆర్ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాన్ని స్వాగతిస్తూ ‘ఎక్స్’ లో పోస్టింగ్ పెట్టారు. భారత ఎన్నిక ల సంఘం క్రూరమైన దాడినుంచి ప్రజాస్వామ్యం బయటపడిందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో ఓటర్ల పేర్లు తొలగింపులకు గల కారణాలను వివరిస్తూ తొలగించబడిన వారి జాబితాను ప్రచురించాలని సుప్రీంకోర్టు మార్గనిర్దేశకం చేయడాన్ని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

## రాధాకృష్ణకు మద్దతు ఇవ్వలేం

‘మహా’ సిఎం ఫడ్నవీస్‌కు తేల్చి చెప్పిన శరద్ పవార్

**ముంబయి :** ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కు మద్దతు కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనకు ఫోన్ చేశారని ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ చెప్పారు. అయితే తాను అసమర్థతను వ్యక్తం చేశానన్నారు. శుక్రవారం పవార్ ముంబయిలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారని, ఎన్‌డిఎ కంటే తమకు తక్కువ బలం ఉన్నప్పటికీ తామేమీ ఆందోళన చెందడం లేదన్నారు. ప్రతిపక్షాలు సుదర్శన్‌రెడ్డిని తమ అభ్యర్థిగా నిలబెట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించాయని పవార్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఓట్లన్నీ సుదర్శన్‌రెడ్డికే వెళ్తాయన్నారు. తమకు తమ బలం తెలుసునని, అందువల్ల ఎటువంటి ఆశ్చర్యాలను ఆశించడం లేదని స్పష్టం చేశారు.

# జైలులో ఉండి పరిపాలనా?

30 రోజులు జైలులో ఉంచితే వారిని తొలగించే చట్టాన్ని తీసుకువస్తున్నాం : ప్రధాని మోదీ



**గయాజీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఇండియా కూటమి నేతలు ఉన్నత స్థాయిలలో అవినీతిని నిర్మూలించడానికి, చొరబాటుదారుల నుండి దేశ జనాభాకు ఎదురయ్యే ముప్పును పరిష్కరించడానికి తీసుకున్న చర్యలను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, 2025, ప్రస్తుతం బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాలను గయాజీలో శుక్రవారం జరిగిన ర్యాలీలో ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. అధికారంలో ఉన్న వ్యక్తులు జైలు నుండి ప్రభుత్వాలను నడుపుతుండడం, కటకటాల వెనుక నుండి ఫైళ్లపై సంతకం చేస్తుండడం వంటి రాజ్యాంగ మర్యాదలను దెబ్బతీసే విచారకరమైన పరిస్థితిని చూశామని పరోక్షంగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. తన 11 ఏళ్ల ప్రభుత్వంలో అవినీతి మరకలు లేవని గర్వంగా చెప్పుకుంటున్నాన్నారు. గత కాంగ్రెస్ పాలనలలో అనేక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయని, బిహార్‌లో అధికారంలో ఉన్నప్పుడు అవినీతి ఏ మేరకు జరిగిందో వీధిలో ఉన్న వ్యక్తికి కూడా తెలుసునని ఆర్‌జెడిని విమర్శించారు. అందువల్ల అవినీతిపరుడైన ముఖ్యమంత్రిని లేదా ప్రధానమంత్రిని 30 రోజులు జైలులో ఉంచితే వారిని తొలగించే చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. తక్కువ కాలం జైలు శిక్ష అనుభవిస్తేనే గుమస్తా స్థాయి వ్యక్తిని కూడా సస్పెండ్ చేస్తారన్నారు. అయితే తాము కఠినమైన చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు, ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయని, వారు చేసిన పాపాలకు శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడుతున్నారని మోదీ ఆరోపించారు. కాగా, దేశం మరో ముప్పును ఎదుర్కొంటోందన్నారు. చొరబాటుదారుల వల్ల దేశానికి తీవ్ర ముప్పు ఉందని, ఈ విషయాన్ని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా ప్రస్తావించానన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడిలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ చొరబాటుదారులను రక్షించాలని కోరుకుంటున్నాయని మోదీ ఆరోపించారు. బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ నుండి అక్రమ వలసదారులను ఓటర్ల జాబితా నుండి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని మోదీ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారత రక్షణ విధానంలో కొత్త రేఖను గీసిందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ ఏ ప్రత్యర్థిని శిక్షించకుండా వదిలిపెట్టబోదని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని విడిచిపెట్టబోదని బలమైన సందేశాన్ని పంపిందన్నారు. పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినా, భారత్ ఎటువంటి హాని చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. ‘డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గయాజీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోంది. ఒకేరోజులో రూ.13,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించాం. వీటిలో ఎనర్జీ, అభివృద్ధి, ఆరోగ్యానికి సంబంధించిన అనేక ప్రధాన ప్రాజెక్టులు ఉన్నాయి. ఇది బిహార్ పరిశ్రమలకు ఊతమిస్తుంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. బిహార్ లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల కోసం ఒక ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం ప్రారంభించాం. ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు క్యాన్సర్ చికిత్స కోసం మరో సౌకర్యం లభించింది’ అని మోదీ స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌లో భద్రత ఉల్లంఘన

గోడ దూకిన వ్యక్తి.. పట్టుకున్న భద్రతా సిబ్బంది

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘన ఘటన జరిగింది. 20 ఏళ్ల వ్యక్తి పార్లమెంటు గోడను దూకడానికి ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని భదోహికి చెందిన రామ్ కుమార్ బింద్ అనే వ్యక్తి గుజరాత్‌లోని సూరత్‌లోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని, అతని మానసిక స్థితి సరిగా లేనట్లు ఉన్నదని పోలీసులు తెలిపారు. ‘శుక్రవారం ఉదయం 5.50 గంటల ప్రాంతంలో, ఒక గుర్తు తెలియని వ్యక్తి పార్లమెంట్ భవన సముదాయం వద్దకు చేరుకుని లోపలికి దూకాలనే ఉద్దేశ్యంతో ప్రహరీ గోడను ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే, సిఐఎస్ఎఫ్, ఢిల్లీ పోలీసు సిబ్బంది అప్రమత్తత కారణంగా అతన్ని పట్టుకుని తదుపరి విచారణ కోసం స్థానిక పోలీసులకు అప్పగించారు’ అని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా సరిగా లేనట్లుగా కనిపిస్తున్నాడని, మరింత విచారణ, ధృవీకరణ పురోగతిలో ఉందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (న్యూఢిల్లీ) దేవేష్ మహ్లా తెలిపారు. ఆ వ్యక్తి సరిహద్దు గోడకు ఆనుకుని ఉన్న చెట్టు ఎక్కడం ద్వారా అతను పార్లమెంటులోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడని వర్గాలు తెలిపాయి. ఇంటెలిజెన్స్‌బ్యూరో (ఐబి), ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగంతో సహా అనేక కేంద్ర సంస్థలు ఆ వ్యక్తిని ప్రశ్నిస్తున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఘటన డిసెంబర్ 13, 2023న జరిగిన సంఘటనను గుర్తుకు తెస్తుంది. ఇద్దరు వ్యక్తులు సందర్శకుల గ్యాలరీ నుండి లోక్‌సభ గదిలోకి ఎక్కి పసుపు రంగు పొగ డబ్బాలను విడిచిపెట్టగా, మరో ఇద్దరు బయట ఇలాంటి చర్యకు పాల్పడ్డారు. 2001లో పార్లమెంటుపై జరిగిన ఉగ్రవాద దాడి వార్షికోత్సవంతో ఇది సమానంగా జరిగింది. తీవ్రమైన భద్రతా ప్రశ్నలను లేవనెత్తింది.

## అక్రమ బెట్టింగ్ కేసులో కర్నాటక ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఇడి సోదాలు

**బెంగళూరు :** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.సి. వీరేంద్ర ‘పప్పీ’, ఆయన సోదరుడు, మరికొందరిపై అక్రమ బెట్టింగ్‌తో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం పలు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. 50 ఏళ్ల వీరేంద్ర చిత్రదుర్గ అసెంబ్లీ స్థానానికి చెందిన శాసనసభ్యుడు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల చివరి రోజున జరిగిన ఇడి చర్యపై ఎమ్మెల్యే ఇంకా స్పందించలేదు. చిత్రదుర్గ జిల్లా, బెంగళూరు, కర్ణాటకలోని హుబ్బళ్లి, జోధ్‌పూర్ (రాజస్థాన్), ముంబయి, గోవాలోని కనీసం 30 ప్రదేశాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) నిబంధనల పరిధిలోకి వచ్చాయని వర్గాలు తెలిపాయి. గోవాలోని పప్పీస్ క్యాసినో గోల్డ్, ఓషన్ రివర్స్ క్యాసినో, పప్పీస్ క్యాసినో ప్రైడ్, ఓషన్ 7 క్యాసినో, బిగ్ డాడీ క్యాసినో అనే పేర్లతో కూడిన ఐదు క్యాసినోలపై కూడా దాడులు జరిగాయని వారు తెలిపారు. అక్రమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన కేసులో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఇడి వర్గాలు తెలిపాయి. వీరేంద్రపై కింగ్ 567, రాజా 567, పప్పీస్ 003, రత్నా గేమింగ్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్‌లను నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, అతని సోదరుడు కెసి తిప్పేస్వామిపై డైమాండ్ సాఫ్‌టెక్, టిఆర్ఎస్ టెక్నాలజీస్, ప్రైమ్ 9 టెక్నాలజీస్ అనే మూడు వ్యాపార సంస్థలు దుబాయ్ నుండి నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ సంస్థలు కాల్ సెంటర్ సేవలు, వీరేంద్ర గేమింగ్ వ్యాపారానికి సంబంధితమైనవన్నారు. బెంగళూరులోని కుసుమ సోదరుడు (కాంగ్రెస్ టికెట్‌పై రాజరాజేశ్వరినగర్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి విఫలమైన) అనిల్ గౌడ అనే వ్యక్తి ప్రాంగణంలో కూడా సోదాలు చేసినట్లు ఏజెన్సీ వర్గాలు తెలిపాయి.

# బిజెపి పాలిత రాష్ట్రాల్లో పదేళ్లలో 20 తొక్కిసలాటలు..

అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఫైర్

**బెంగళూరు :** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సిబి విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది. కర్ణాటక సర్కారు వైఫల్యంవల్లే తొక్కిసలాట జరిగిందని నాటి నుంచి ఈ ఘటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విమర్శలపై సిఎం సిద్ధరామయ్య శుక్రవారం అసెంబ్లీ వేదికగా స్పందించారు. గత పదేళ్లలో బిజెపి పాలిత రాష్ట్రాల్లో 20 తొక్కిసలాట ఘటనలు జరిగాయని, వాటిపై ఆ పార్టీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2008లో హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో తొక్కిసలాట, అదే ఏడాది జోధ్‌పూర్ తొక్కిసలాట, 2021లో హరిద్వార్ తొక్కిసలాట, 2013లో రతన్‌గఢ్ తొక్కిసలాట, 2023లో మధ్యప్రదేశ్‌లో తొక్కిసలాట, 2024 హాత్రాస్‌లో తొక్కిసలాట ఘటనలు జరిగాయని, ఆ ఘటనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు బిజెపి నేతలు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 39 మంది ప్రాణాలు కోల్పోతే ఆ రాష్ట్ర ప్రభుత్వం మృతుల వివరాలు కూడా వెల్లడించలేదని సిద్ధరామయ్య ఆరోపించారు. 2022లో గుజరాత్ మోర్బి వంతెన కూలి 135 మంది మరణించిన ఘటన గురించి కూడా సిఎం మాట్లాడారు. ‘ఆర్‌సిబి తొలిసారి ఐపిఎల్ టైటిల్ గెలువడంతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాలకు అభిమానులు భారీ సంఖ్యలో హాజరుకావడంతో తొక్కిసలాట జరిగింది. తన 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని, తొక్కిసలాటలో 11 మంది చనిపోవడం ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ ఘటనపై తనకు తీవ్ర కలిగిందని, ఘటన రోజే తన బాధను వ్యక్తం చేశానని చెప్పారు. ఒక్కోసారి ప్రజల అభీష్టానికి తలవంచాల్సి వస్తుంది. అదే ప్రజాస్వామ్యానికి సంకేతమని’ సిద్ధరామయ్య అన్నారు. ఆర్‌సిబి విజయోత్సవ వేడుకకు హాజరు కావాల్సి వచ్చిందని ఆయన అన్నారు. కాగా ఈ ఏడాది జూన్‌లో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఘటనపై దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం జ్యూడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆర్‌సిబి విజయోత్సవ ఈవెంట్‌లో తీవ్ర భద్రతా వైఫల్యం ఉన్నట్లు గుర్తించింది. స్టేడియం లోపల కేవలం 79 మంది పోలీసులను మాత్రమే మోహరించారని, ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు లేవని తెలిపింది. పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని నివేదికలో కమిషన్ పేర్కొంది.

## అసోం పోలీసుల అరెస్ట్ నుంచి... జర్నలిస్టులు సిద్దార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు ‘రక్షణ’

‘సుప్రీం’ ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ :** తమకు వ్యతిరేకంగా ‘వార్తా కథనం’ రూపొందించారన్న అభియోగంపై అసోం పోలీసులచే ఎఫ్ఐఆర్ నమోదు చేయబడ్డ ‘ది వైర్’ వ్యవస్థాపక ఎడిటర్ సిద్దార్థ్ వరదరాజన్, కన్సల్టింగ్ ఎడిటర్ కరణ్ థాపర్‌ల అరెస్ట్ నుంచి శుక్రవారం సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ది వైర్ యాజమాన్యం వరదరాజన్‌తో పాటు ‘ది ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం’ (ఎఫ్ఐజె) దాఖలు చేసిన పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. బాధిత జర్నలిస్టుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిత్యా రామక్రిష్ణన్ తన వాదనలు వినిపిస్తూ అసోం పోలీసులు కోర్టు జారీచేసిన ఆదేశాలను కూడా దాటవేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. మోరీగాం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ నుంచి మధ్యంతర రక్షణను మంజూరు చేసినప్పటికీ దానిని ఏ మాత్రం ఖాతరు చేయని పోలీసులు గుహతి క్రైమ్ బ్రాంచ్ తరపున మరొక కేసును బనాయించి సమన్లు జారీచేశారని ఆమె వాదించారు. మే నెలలో నమోదు చేసిన పాత ఎఫ్ఐఆర్‌లో వాంగ్మూలాలను రికార్డు చేయడానికి శుక్రవారం వారిని పోలీసులు అరెస్ట్ చేయవచ్చని వారు ముందస్తుగానే భావించారని నిత్యా రామక్రిష్ణన్ బెంచ్‌కు నివేదించారు. మరిన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు కావచ్చని,అరెస్ట్ చేస్తామని వారిని బెదిరించవచ్చని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకురాగా, ‘మేం గమనిస్తున్నాం’ అని చెప్పిన ద్విసభ్య ధర్మాసనం ఆమె భయాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. ఈ సందర్భంగా ధర్మాసనం జర్నలిస్టులను రక్షిస్తూనే, అదే సమయంలో ప్రతీ ఒక్కరూ చట్టాన్ని పాటించాలనే భావనను కలిగి ఉండాలని హితవు చెప్పింది. తదుపరి విచారణ తేదీన దర్యాప్తులో చేరి ఒక స్టేటస్ రిపోర్టును దాఖలు చేయాలని బెంచ్ జర్నలిస్టులను కోరింది. ఆపరేషన్ సిందూర్‌పై వచ్చిన కథనంపై అతనిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన ధర్మాసనం ఆగస్టు 12న వరదరాజన్‌పై అసోం పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. మే 9న గువహతి క్రైమ్ బ్రాంచ్ వరదరాజన్, కరణ్‌థాపర్‌లపై భారత న్యాయ సంహిత లోని 152 సెక్షన్ కింద (భారతదేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమాధికారాన్ని ప్రమాదంలో పడేసే చర్యలకు పాల్పడ్డారని) అభియోగం మోపుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. భారతదేశం సార్వభౌమాధికారం, సమగ్రతకు వ్యతిరేకంగా 14ఇంటర్వ్యూలను, కథనాలను ప్రస్తావిస్తూ పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఆగస్టు 12 వరకూ ఈ ఎఫ్ఐఆర్‌పై ఎలాంటి తదుపరి చర్యా తీసుకోలేదు. ‘ది వైర్’, ఇతరులపై జులై 11న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ద్వారా పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా అత్యున్నత న్యాయస్థానం బాధిత జర్నలిస్టులకు రక్షణ కల్పించింది. ఆ తర్వాత మే 9న దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి జర్నలిస్టులను క్రైమ్ బ్రాంచ్ సమన్లు జారీచేసింది. ఈ కేసులో శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం జర్నలిస్టులకు, ఒక న్యూస్ పోర్టల్‌కు కూడా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL**

**A.R.B. No. 161 OF 2025**

Between:

**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-2 Branch.**

......**Disputant**

AND

**Sri. Nadigoti Nagaraju and Others.**

........**Opponents**

To,

**OP No. 3:** Sri Shika Venkanna, S/o Rajaiah, Age: 50 Years, Occ: Polioce Constable, Karimnagar, R/o H.No. 5-6, Kothapalle, Mdl: Bheemadevarapalli, Dist: Hanumakonda. 505497. Present R/o. H.No. 6-6-639/A1, Ambedkarnagar, Karimnagar, Dist: Karimnagar. 505002.

**OP.No. 4:** Sri Singireddy Jagan Mohan Reddy, S/o Raji Reddy, Age: 35 Years, Occ: Veterinary Asst. in Area Veterinary Hospital Mulkanoor, Mdl: Bheemadevarapalli, R/o. H.No. 10-22, Vill: Lasmakkapalli, Mdl: Veenavanka, Dist: Karimnagar. 505502.

**OP.No. 5:** Smt Kodurupaka Sujatha, D/o Mallesh (W/o Sadhan), Age: 41 Years, Occ: Junior Asst. in ERO Bheemadevarapalli, R/o H.No. 8-80, Gollawada Temple Street, Mulkanoor, Mdl; Bheemadevarapalli, Dist: Hanumakonda. 505471.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **12-09-2025** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR – WARANGAL.**



**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL**

**A.R.B. No. 180 OF 2025**

Between:

**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-1 Branch.**

......**Disputant**

AND

**Sri. Moku Ananad Reddy and Others.**

........**Opponents**

To,

**OP No. 1:** Sri Moku Anand Reddy, S/o Madhusudhan Reddy, Age: 45 Years, Occ: Asst. Labour Officer, Khammam-II Circle, R/o H.No. ---, Obul Keshawapur, Dist: Warangal. Permanent H.No. 9-1-109, Medical colony, Bhadrachalam, Dist: Bhadradri Kothagudem. 507111.

**OP No. 2:** Sri Pingili Ravinder Reddy, S/o SomaReddy, Age: 45 Years, Occ: Asst. Labour Officer, Kukatpally. R/o. H.No. 1-3-183/40/46/9, Sai Nagar, Kawadiguda, Hyderabad. Present R/o H.No. 2-4-617/2/A, Ramnagar, Opp: Montissory School, Hanamkonda, Dist: Hanumakonda. 506001

**OP No. 3:** Sri Jaruplavath Devender, S/o Devoji, Age: 42 Years, Occ: Asst. Section Officer , R/o H.No. 1-52, Redya Thanda, Mondal: Urkondapeta, Dist: Mahabubnagar, Present H.No. 2-2-185/90/3, Flot No. 201, Sai Krupa Apartment, R.K.Nagar, Bagh Ambarpet, Hyderabad. 500013

**OP No. 4:** Sri Kommu Kutumba Rao, S/o Venkaiah, Age: 55 Years, Occ: Asst. Labour Officer, Manuguru. R/o. H.No. 9-1-109, Medical Colony, Bhadrachalam, Dist: Bhadhradri Kothagudem. 507111

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **12-09-2025** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR – WARANGAL.**

ప్రజాపక్షం
శనివారం, 23 ఆగస్టు

# రష్యా–చైనా–భారత్ చేదోడువాదోడు

ఈ వారంలో దౌత్యాధికారుల రెండు పర్యటనలు భారత విదేశాంగ విధానంలో మార్పులకు అత్యంత ప్రాముఖ్యత గలవి. అవి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ పర్యటన, ఆ వెనువెంటనే భారత్ విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ మాస్కో పర్యటన. సుమారు 280 కోట్ల జనాభాకు ప్రతినిధులుగా ఉన్న ఆసియా ఖండంలో రెండు అతిపెద్ద దేశాలైన చైనా, భారత్ మధ్య సంబంధాల అభివృద్ధి ఆసియాకే కాదు ప్రపంచ సుస్థిరాభివృద్ధికి కూడా ప్రధానం. అయితే 2020 లో గాల్వాన్‌లో ఇరుదేశాల సైనికుల మధ్య కుమ్ములాటలో 20మంది భారత సైనికులు చనిపోయిన దుర్ఘటన సంబంధాల వృద్ధి దిశకు గండికొట్టింది. గత ఏడాది కజాన్‌లో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ముఖాముఖీ సంభాషణల తదుపరి వివాదాస్పద ప్రాంతాల నుంచి సైన్యాల ఉపసంహరణ క్రమం ఆరంభమైంది. కాబట్టి ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్య పరిష్కారం అన్నిటికన్నా ముఖ్యం. భారత్ వ్యూహాత్మక స్వతంత్రత అంటూనే అమెరికావైపు అతిగా మొగ్గటం, చైనాకు వ్యతిరేకంగా భారత్ ను తమ శిబిరంలో నిలబెట్టుకునేందుకు అమెరికా మిలటరీ వ్యూహాలకు భారత్ అవకాశమివ్వటం (ఉదా: క్వాడ్) ఇరుదేశాల మధ్య వైమనస్యం పెరుగుదలకు మరో ముఖ్యకారణం. భారత్ బహుళపక్ష వేదికలైన బ్రిక్స్‌లో, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ)లో రష్యా, చైనాలతో సహసభ్యురాలు. జి 20లో కూడా భాగస్వాములు. ఈ మూడు ప్రధాన దేశాల మధ్య మైత్రి, సహకారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏకధ్రువ ప్రపంచంకోసం అనగా ప్రపంచదేశాలపై తమ ఆధిపత్యంకోసం అమెరికా పేరాశలకు వ్యతిరేకంగా బహుళపక్ష అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టటానికీ, భూగోళ దక్షిణ ప్రాంతానికి అనగా పేద, వర్ధమాన దేశాల వాణిగా అంతర్జాతీయ వేదికలపై ఏకస్వరంతో ప్రభావవంతమైన పాత్ర పోషించటానికీ ఈ మూడు దేశాల మైత్రి కీలకం.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య సుంకాల బ్లాక్ మెయిల్ జమానా మాస్కో, బీజింగ్, న్యూఢిల్లీలను చేరువచేయటం గమనించదగ్గ విషయం. భారత్–పాకిస్థాన్ నాల్గురోజుల యుద్ధాన్ని తానే ఆపుచేశానని ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలు (భారత్ ఆలస్యంగానైనా నిరాకరించింది), పాకిస్థాన్ సైన్యాధిపతి ఆశిం మునీర్‌కు ఓవల్ ఆఫీసులో విందుఇవ్వటం, అతడు అమెరికానుంచే భారత్‌కు అణుబాంబు హెచ్చరిక చేయటం ట్రంప్–మోదీ వ్యక్తిగత మైత్రిని భగ్నం చేసింది. భారత్ నుంచి దిగుమతులపై 25 శాతం సుంకం విధించటం, అంతేగాక, రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకునే ఆయిలుపై మరో 25శాతం (ఈనెల 27నుంచి) సుంకం విధించటం భారత్ స్వాభిమానాన్ని దెబ్బతీసింది.

ఉక్రేన్–రష్యా యుద్ధం విషయంలో ఉక్రేన్‌కు యూరప్, అమెరికాల తోడ్పాటుకు వ్యతిరేకంగా రష్యా, చైనా మైత్రి పటిష్టమైంది. యూరప్ రష్యా ఆయిలుపై ఆంక్షలు విధించినప్పటికీ అది ఇస్తున్న డిస్కౌంట్ రేటుకు భారత్ పెద్ద ఎత్తున కొంటున్నది. ఇది సహించని ట్రంప్ భారత్‌పై కన్నెర్రజేసి బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. భారత్ బనానా రిపబ్లిక్ కాదు, అమెరికా బెదిరింపులకు లొంగటానికి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ ఢిల్లీలో మూడు రోజుల సంభాషణలు ప్రాధాన్యత వహించాయి. జైశంకర్, అజిత్ దోవల్, చివరగా ప్రధాని నరేంద్రమోదీతో సంభాషణలు జరిపారు. సరిహద్దు వెంట ప్రశాంతతను కాపాడుకోవటం, సరిహద్దు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని వేగవంతం చేయటం, వాణిజ్యం, పెట్టుబడుల అభివృద్ధి, ట్రంప్ బెదిరింపులు చర్చించారు. సానుకూల నిర్ణయాలకు వచ్చారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో చైనాలోని తియాన్‌జిన్‌లో జరిగే ఎస్‌సిఒ శిఖరాగ్ర సభకు ప్రధాని మోదీకి జిన్‌పింగ్ ఆహ్వానం అందజేశారు. ప్రధాని ఈ సమావేశానికి వెళుతున్నారు. భారత్‌కు ఎరువులు, అరుదైన భూగర్భ ఖనిజాలు, టన్నెల్ బోరింగ్ యంత్రాలు ఎగుమతి చేయటానికి చైనా అంగీకరించింది. చైనా నుంచి పెట్టుబడులను కూడా భారత్ అనుమతించనుంది. ట్రంప్ బేసబబు వాణిజ్య పద్ధతులకు వ్యతిరేకంగా చైనా భారత్ వెనుక దృఢంగా నిలబడుతుందని దిల్లీలోని చైనా రాయబారి క్సు ఫీహోంగ్ గురువారం అసాధారణ సంఘీభావ ప్రకటన చేయటం మరో భరోసా.

ఇదిలాఉండగా, విదేశీ వ్యవహారాలమంత్రి జై శంకర్ గురువారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమై రష్యాతో భారత్ వ్యూహాత్మక సంబంధాల పటిష్టతపై చర్చించారు. ఈ సంవత్సరాంతంలో పుతిన్ భారత్ పర్యటన ఏర్పాట్ల గూర్చి రష్యా మంత్రి సెర్గి లెవరోవ్‌తో చర్చించారు. తమపై ట్రంప్ సుంకాలను ప్రశ్నిస్తూ జైశంకర్ ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు: ''రష్యన్ ఆయిలు అతిపెద్ద కొనుగోలుదారు చైనా తప్ప భారత్ కాదు; ఎల్ఎన్‌జి అతిపెద్ద కొనుగోలుదారు ఇయు తప్ప మేము కాదు; 2022 తర్వాత రష్యాతో హెచ్చుగా వాణిజ్యం పెంచుకున్నది మేము కాదు. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరంగా ఉంచటానికి గతంలో మమ్మల్ని కోరిన ప్రతిదీ – రష్యా నుంచి ఆయిలు కొనుగోలు సహా చేశాం. అమెరికా నుంచి కూడా పెద్దమొత్తంలో ఆయిలు కొన్నాం.'' రష్యాతో వాణిజ్య సంబంధాలను గతంలోలాగా గణనీయమైన స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జై శంకర్ మాటల్లో వ్యక్తమైంది.

ప్రపంచంలో నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన, మూడవ స్థానానికి చేరువవుతున్న భారత్‌ను ట్రంప్ బెదిరింపులు ఏమీ చేయలేవు. అమెరికాతోపాటు ప్రధానమైన దేశాలతో సంబంధాలు వృద్ధి చేసుకునే వ్యూహాత్మక విధానం మంచిదే. అయితే గత దశాబ్దంలో అమెరికాపై ఆశలు పెంచుకుని అతిగా అటుమొగ్గిన విధానాన్ని సరిదిద్దుకోవటానికి ఇదే సరైన సమయం.

# ఏ మనిషీ మరో మనిషికి వాడుకునే జంతువు కాదు


ప్రతి సంవత్సరం ఆగస్టు 23న అంతర్జాతీయ బానిస వాణిజ్య నిర్మూలన దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటాము. ఈ దినోత్సవాన్ని యునెస్కో 1998లో ప్రారంభించింది.

ఆనాడు బానిస వాణిజ్యంలో నల్ల జాతి ప్రజలను గొలుసులతో కట్టేసి, సముద్రాలు దాటించి, జంతువుల్లా కొనుగోలు చేసి అమ్మిన కాలం. మనిషి మనిషిని అమ్ముకున్న ఆ అంధకార గతం అంతమైంది. 1791లో దాస్యానికి వ్యతిరేకంగా మొదలైన తిరుగుబాటు క్రమంగా హైతీ విప్లవంగా రూపాంతరం చెంది ప్రపంచవ్యాప్తంగా బానిసత్వ నిర్మూలనకు దారితీసింది. దానికి గుర్తుగా ఆగస్టు 23న అంతర్జాతీయ బానిస వాణిజ్య నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకుంటాము. కానీ బానిసత్వం పూర్తిగా రద్దయినప్పటికీ, నిజంగా అది అంతరించిపోయిందా? అని ఎవరిని అడిగిన సమాధానం కాదనే చెప్పాలి. నేటి సమాజంలో బానిసత్వం కొత్త రూపాల్లో ఇంకా కొనసాగుతూనే ఉంది. గల్ఫ్ దేశాల్లో మన భారతీయ వలస కూలీల పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకొని బలవంతంగా, అయిష్టంగా వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నారు. మానవ అక్రమ రవాణా ద్వారా మహిళలు, బాలికలు లైంగిక దోపిడీకి గురవుతున్నారు.

**భారతదేశంలో ఆధునిక బానిసత్వం:** భారత దేశ రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ హక్కులను కల్పించినప్పటికీ అనేక రూపాల్లో బానిసత్వం యజమానుల మనస్సులో నుండి తొలిగిపోక ఇంకా కొనసాగుతున్నది. పేదరికంలో చిక్కుకున్న బాల కార్మికులు ఇటుకల బట్టీలు, చాయ్ గ్లాసులు కడుగుతూ హోటళ్లలో కర్మాగారాలలో, చదువు మానుకొని పనిమనుషుల్లా కష్టపడుతున్నారు. బాలికలు ఉద్యోగం లేదా పెళ్లి పేరిట మోసపోయి లైంగిక దాస్యానికి గురౌతున్నారు. పట్టణాల్లో పనిచేసే గృహ సహాయకులు తక్కువ జీతాలు, ఎక్కువ గంటలు, గౌరవం లేకుండా పనిచేయడం బానిసత్వ యొక్క ఆధునిక రూపమే.

**తీసుకోవలసిన చర్యలు :** మన దేశ ప్రభుత్వానికి స్వేచ్ఛ, సమానత్వం బోధిస్తున్నా, మన ఇళ్ల చుట్టూ, మన పొలాల్లో, మన నగరాల్లోనే బానిసత్వం ఇంకా వేర్లు పాతుకుపోయి ఉంది. బానిసత్వాన్ని పెంచేది పేదరికం. మన సమాజపు మౌనం, నిర్లక్ష్యం మన వ్యవస్థ దానిని కాపాడుతుంటుంది. కావున ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. మానవ అక్రమ రవాణాపై కఠిన శిక్షలు అమలు చేయాలి. ప్రతి పల్లెవాడకి విద్య హక్కు కల్పించి బాల కార్మికత్వాన్ని నిర్మూలింపచేయాలి. సమాజంలో అందరూ సమానమే'మనిషి మరొక మనిషి కోసం సహాయం చేయొచ్చు, కానీ ఎవ్వరూ ఎవరికి బానిసలు కాదు, కావలసిన అవసరం లేదు అనే స్ఫూర్తిని పెంచాలి.

# సాఫ్ట్‌వేర్ లో ముగిసిన స్వర్ణయుగం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలు కూడా ఎండమావుల్లా తయారవడంతో చదువుకున్న వారి పరిస్థితి 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' చందంగా మారింది. ఉద్యోగాలంటే సాఫ్ట్‌వేర్ రంగమే స్ఫురణకు రావడం సహజం. అయితే అదే సాఫ్ట్‌వేర్ రంగం అనిశ్చిత పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. టెక్ కంపెనీలు ఉద్యోగులకు లే ఆఫ్ లు, పింక్‌స్లిప్ లతో వీడ్కోలు సందేశాలు పంపడమే ఇందుకు కారణం. అన్ని టెక్ కంపెనీలు ఇదే బాటలో పయనిస్తున్న కారణంగా ఒక కంపెనీలో ఉద్యోగం తొలగిస్తే, వేరే కంపెనీల్లో ఉద్యోగం లభిస్తుందన్న గ్యారంటీ లేదు. టెక్ హబ్‌గా పేరొందిన హైదరాబాద్‌లో కూడా అనేక కంపెనీలు ఉద్యోగులకు శ్రీముఖాలు పంపిస్తూ, సెలవంటూ చల్లగా జారుకుంటున్నాయి. ఒక ఏడాదిలోనే అమెజాన్ నాలుగు పర్యాయాలు ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ 9వేల మందికి ఉద్వాసన చెప్పాలని నిర్ణయించుకుంది. సుమారు 12వేల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు టి.సి.ఎస్ నోటీసులు పంపింది. గూగూల్, ఇంటెల్ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు సిద్ధం చేసింది. దాదాపు 20 నుండి 25 లక్షల మందికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉపాధి కల్పిస్తున్న హైదరాబాద్ టెక్ హబ్ ఉద్యోగులను యుద్ధ ప్రాతిపదికన తొలగించడానికి సంసిద్ధంగా ఉంది. ఎఐ సృష్టించిన పెను ప్రకంపనల్లో సాఫ్ట్‌వేర్ రంగం కకావికలమైపోతున్నది. ఇంకా చదువుకుంటున్న మన యువత అవగాహన లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కలలు కనడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ కల నెరవేరాలంటే అహరహం శ్రమించాలి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పట్ల శ్రద్ధ చూపాలి. గతంలో మాదిరిగా ప్రతిభ లేకున్నా ఫేక్ సర్టిఫికెట్లతో, ఫేక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఉద్యోగాలు పొందాలనుకోవడం ఇక జరగని పని. పలు దేశాల్లో ఉద్యోగుల కంటే స్వయం ఉపాధి ద్వారా అధిక సంపాదన చేస్తున్న వారెంతో మంది ఉన్నారు. మన దేశ యువత కూడా మూస ధోరణిలో పయనించకుండా, సంపాదనకున్న ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.

విద్యార్థి దశలోనే నైపుణ్యతకు సానబెట్టాలి. అత్యంత క్రమశిక్షణతో, నైపుణ్యతతో సాగిన ఒకప్పటి మన విద్యావ్యవస్థలోని అంకిత భావం వర్తమానంలో అగుపించడం లేదనే విమర్శల్లో నిజం లేకపోలేదు. ఉద్యోగాల వేటలో పడిన యువత నైపుణ్యాన్ని అలవరచుకోకుండా ఇంకా డిగ్రీలను, బట్టీ చదువులను నమ్ముకోవడం వలన ఎలాంటి ప్రయోజనం చేకూరదు. విద్యావంతుల శాతం పెరుగుతున్నది. ప్రభుత్వ ఉద్యోగాలు గగనకుసుమంలా మారిపోయాయి. ప్రైవేటు సంస్థలు కూడా అందరికీ ఉద్యోగాలిచ్చే పరిస్థితుల్లో లేవు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మరింత సన్నగిల్లే అవకాశాలు కనిపించడమే కాకుండా ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకం కావచ్చు. ఒకప్పుడు భారత్‌తో సహా అనేక ప్రపంచ దేశాలు నిరుద్యోగ సమస్యతో సతమతమైన విషయాన్ని మరువలేం. పెరిగిన అవసరాలు మానవ జీవితాలను దుర్భరం చేస్తున్న దశలో అనేకమంది మేధావులు, ఆర్థిక శాస్త్రవేత్త నిపుణులు ప్రపంచ వాణిజ్యాన్ని సరళతరం చేసారు. సరళీకృత ఆర్థిక విధానాలకు అంకురార్పణ గావించారు. గ్లోబలైజేషన్ వలన వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగైనాయి. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచమంతా విస్తరించింది. ప్రపంచం ఒక కుగ్రామంగా మారింది. అనేక రంగాలు ప్రపంచంతో అనుసంధానించబడ్డాయి. వ్యవసాయ ఆధారిత దేశాలు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందాయి. వ్యవసాయమే ప్రధాన ఉపాధిగా జీవించే యువతకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. నిరుద్యోగ సమస్య తీవ్రత తగ్గింది. అవకాశాలు ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరడంతో ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరడానికి యువతకు మార్గం సుగమం కాబడింది.

విద్య, ఉద్యోగ రంగాల్లో పోటీతత్వం పెరిగిన కారణంగా ఉద్యోగాల్లో ప్రతిభ కీలకంగా మారింది. నైపుణ్యానికే అగ్రతాంబూల మిచ్చే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ప్రతిభకు అర్థం మారింది. తాము చదివిన చదువుల్లో, చేస్తున్న ఉద్యోగాల్లో నైపుణ్యత అవసరం. మారుతున్న పరిస్థితులకు, సాంకేతిక ప్రపంచంలో వెల్లువెత్తుతున్న నూతన పరిజ్ఞానానికి అనుగుణంగా యువత తమను తాము ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. కృత్రిమ మేథ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కృత్రిమ మేథ వలన ప్రస్తుతమున్న ఉపాధి అవకాశాలకు గండిపడే అవకాశాలున్నాయి. వందల సంఖ్యలో చేసే ఉద్యోగాలను కేవలం పదుల సంఖ్యలో పూర్తిచేసే సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఇక నుంచి ఉపాధి అవకాశాలు అందుకోవడం అంత సులభం కాదు. స్కిల్ డెవలప్‌మెంట్ వలనే ఉద్యోగాలు లభిస్తాయి. నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు దరికి చేరతాయి. ప్రభుత్వ ఉద్యోగాలు దొరకని నేపథ్యంలో కష్టమైనా ఇష్టంగా మలచుకుని సాఫ్ట్‌వేర్ ఆఫీసుల్లోనే పని చేయాలనే తత్వం నేటి యువతలో ప్రబలింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం అనేక ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నది. కేవలం 10–15 వేల రూపాయల నెలసరి వేతనానికైనా పనిచేయడానికి చాలామంది ఇంజనీరింగ్ యువత సంసిద్ధంగా ఉండడం గమనార్హం.






వ్యవసాయం చేసే యువత కరువైనది. చదువుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో మాదిరిగా కుటుంబంలో ఒక్కరు పనిచేస్తే, అందరూ హాయిగా జీవించే రోజులు పోయాయి. వేడి నీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్టుగా కుటుంబ సభ్యులంతా ఉపాధి అవకాశాలను అన్వేషించి, కష్టించి పనిచేస్తేనే కుటుంబాలకు, వ్యక్తులకు ఆర్థిక భద్రత చేకూరుతుంది. చదువుకున్న యువత నైపుణ్యత సంపాదిస్తేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. కాబట్టి నైపుణ్యాల దిశగా యువతను నడిపించాలి. ప్రపంచవ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, పేదరికాన్ని నిర్మూలించి, లింగబేధం లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు కల్పించాలి. చదువుకున్న యువతలో ముఖ్యంగా 24 సంవత్సరాల లోపు వయస్సున్న యువతలో నిరుద్యోగం ప్రబలంగా ఉంది. వచ్చే దశాబ్దకాలంలో ఈ నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న జనాభాకు అదే నిష్పత్తిలో ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ప్రభుత్వాలు లేవు. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. దీనిని అధిగమించడానికి ప్రభుత్వాలు ప్రణాళికలను రూపొందించుకోవాలి. 2030వ సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని, నేటియువతలో సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు పెంపొందించాలి. నైపుణ్యత సరిగా లేకపోవడంతో ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్న మాట వాస్తవం. అందరినీ 'విద్య' వైపు మళ్ళించడం హర్షించదగ్గ విషయమే. కాని విద్యలో నాణ్యత కొరవడడం, కళాశాల స్థాయి దాటిన తర్వాత కూడా యువతలో సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు మందగించడం వలన ఉద్యోగాలు దొరకడం కష్టసాధ్యంగా మారింది. యువత ఉపాధికి దూరమైతే ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇప్పటికే అలాంటి సూచనలు స్పష్టంగా కానవస్తున్నాయి. ఏ దేశమైనా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ప్రతీ ఒక్కరూ చదువుకోవాలి. ఆ చదువుద్వారా నైపుణ్యాన్ని అలవరచుకోవాలి. ప్రపంచమంతా యాంత్రీకరణ దిశగా, కృత్రిమ మేథ వైపు పయనిస్తుంటే ఇంకా చాలా దేశాలలో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. అరకొర సదుపాయాలతో, విద్యాప్రమాణాల లేమితో చదువుకున్నా, చదువుకొన్నా శూన్య ఫలితాలే వస్తున్నాయి. ఐ.రా.స ఆశించిన ఫలితాలు రావాలంటే నాణ్యమైన విద్యతో పాటు, సాంకేతిక నైపుణ్యం యువతకు అందేటట్టు చూడాలి. గ్రామీణ ప్రాంత యువతలో ప్రస్తుత పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఆర్థిక అసమానత్వం వలనే యువతకు సరైన విద్య దొరకడం లేదు. ఆర్థిక స్థోమత కలవారు పట్టణాలకో, నగరాలకో వలసపోయి వృత్తిపరమైన, సాంకేతిక పరమైన నైపుణ్యాలను అలవరచుకుని ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారంతా నైపుణ్యాలకు దూరమై, చదువుకున్నా, నిరక్షరాస్యులుగానే పరిగణింపబడుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. సమాజంలో అందరికీ సరైన విద్య అందాలి. ప్రతిభ గల అందరికీ సమాన అవకాశాలు కలగాలి. ప్రతీ ఒక్కరికీ అన్ని స్థాయిల్లో ఉచితమైన, నాణ్యమైన విద్య అందాలి. బ్యాంకుల జాతీయీకరణ మాదిరిగానే విద్యను కూడా ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు జాతీయీకరణ చేయాలి. కుల,మత,లింగబేధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కలుగచేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను ఎప్పటికప్పుడు ఆధునీకరించాలి. యువతలో సాంకేతిక, విద్యా నైపుణ్యాలను సానబట్టాలి. నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వాలు కృషి చేయాలి.

యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అత్యంత బలమైన విద్యావ్యవస్థలను కలిగి ఉన్నాయి. జపాన్, స్వీడన్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ అత్యుత్తమ విద్యావ్యవస్థలతో అగ్రపథంలో కొనసాగుతున్నాయి. జపాన్ అన్ని స్థాయిల్లో అత్యుత్తమ విద్యాశ్రేణితో కొనసాగుతున్నది. లక్సెంబర్గ్ విద్యపై అధిక శాతం ఖర్చుచేసే దేశంగా తాజా నివేదికలు సూచిస్తున్నాయి. చిలీతో పాటుగా నార్వే, ఆస్ట్రేలియా, యు.కె, క్యూబా, మార్షల్స్ దీవులు, కిరిబాటి, ఇజ్రాయిల్, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్ లాండ్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఉన్నత విద్యకోసం అత్యధిక నిధులను వెచ్చిస్తున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బాల్యం నుండే విద్యార్థులకు చదువుల్లో బలమైన పునాది పడాలి. సృజనాత్మకత, సునిశిత పరిశీలన, శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక పరమైన అంశాల్లో తగిన శిక్షణ నివ్వాలి. ఉన్నత విద్యలో నైపుణ్యత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

# భారత ఆర్థిక వెలుగు : నిజాలు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496

2025 ఆగస్టు 14న స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్ అండ్ పి) గ్లోబల్ రేటింగ్స్ భారత సార్వభౌమ క్రెడిట్ రేటింగ్‌ను (బెటర్ బిజినెస్ బ్యూరో) 'బిబిబి మైనస్' నుంచి 'బిబిబి'కి పెంచింది. 18 ఏండ్ల తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్‌లో అత్యల్ప స్థాయికి చేరిన ఈ మార్పు, భారత ఆర్థిక వ్యవస్థకు ఒక మైలురాయిగా నిలిచింది. ఈ అప్‌గ్రేడ్ గ్లోబల్ ఇన్వెస్టర్లకు భారత్‌పై విశ్వాసాన్ని పెంచుతుందని, రుణ ఖర్చులను తగ్గిస్తుందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని అధికారపక్షం బిజెపి ఆనందం ప్రకటిస్తోంది. అయితే, ఈ వెలుగులోని నీడలను పరిశీలిస్తే, ఆర్థిక వాస్తవాలు అంత సరళంగా లేవని స్పష్టమవుతుంది. డేటా సమగ్రతపై ప్రశ్నలు, నెరవేరని వాగ్దానాలు, సామాజికఆర్థిక సవాళ్లు ఈ రేటింగ్ అప్‌గ్రేడ్‌ను ఆచితూచి అంచనా వేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

ఈ రేటింగ్ మెరుగుదల భారత్‌కు గ్లోబల్ మార్కెట్లలో చౌకైన నిధులను సమకూర్చడం, రూపాయి స్థిరత్వాన్ని పెంచడం, సావరిన్ బాండ్లపై విశ్వాసాన్ని బలోపేతం చేయడం వంటి ప్రయోజనాలను తెస్తుంది. ఎస్ అండ్ పి ప్రకారం, భారత రుణ జిడిపి నిష్పత్తి 2029 నాటికి 83 శాతం నుంచి 78 శాతానికి తగ్గుతుందని, ఆర్థిక లోటు 2020–21లో 9.3 శాతం నుంచి 2025–26 నాటికి 4.4 శాతానికి తగ్గుతుందని అంచనా. ఈ గణాంకాలు బలమైన స్థూల ఆర్థిక విధానాలు, ద్రవ్య స్థిరత్వం, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులను సూచిస్తాయి. మూలధన వ్యయం 2014–15లో 1.6 శాతం నుంచి 2025–26 నాటికి 3 శాతానికి పైగా పెరిగింది, ఇది ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా మన ప్రభుత్వం చెప్పుకొంటుంది. అయితే, ఈ గణాంకాల వెనుక దాగిన సంక్లిష్టతలను విస్మరించలేము.

గత దశాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ, డేటా విశ్వసనీయతపై విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ 2012 తర్వాత జిడిపి అంచనాలు 22.5 శాతం అధికంగా చూపించారని వాదించారు. అధికారికం గా 7 శాతం సగటు జిడిపి వృద్ధి ప్రకటించబడినప్పటికీ, స్వతంత్ర అంచనాలు దానిని 5 శాతానికి దగ్గరగా ఉంటుందని సూచిస్తున్నాయి. ఈ వ్యత్యాసం ఆర్థిక విధానాలు, రాజకీయ నిర్ణయాలపై సందేహాలను రేకెత్తిస్తుంది. ఉదాహరణకు, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం తయారీరంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 2014 లో జిడిపిలో 15శాతం ఉన్న తయారీ వాటా 2022 నాటికి 13 శాతానికి పడిపోయింది. దీర్ఘకాల ఉద్యోగ సృష్టి, ఎగుమతి వృద్ధిలో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదు. బదులుగా, సేవల రంగం, అనధికారిక ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇవి ఆర్థిక సంక్షోభ సమయంలో బలహీనతలను బహిర్గతం చేశాయి.




ఉద్యోగ సృష్టి విషయంలోనూ ఆశాజనక చిత్రం కనిపించడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, 2017–18 ఎన్ఎస్ఎస్ఒ నివేదిక ప్రకారం నిరుద్యోగ రేటు 6.1 శాతానికి చేరింది, ఇది 45 ఏండ్లలో అత్యధికం. 2011–12 నుంచి 2018 మధ్య 1.5 కోట్ల ఉద్యోగాలు కోల్పోయాయి. (2018 తర్వాత నెట్‌లో డేటా అప్‌డేట్ చేయలేదు) పిఎల్ఎఫ్ఎస్ నివేదికలు నిరుద్యోగ సమస్యను తక్కువగా చూపించే ప్రయత్నం చేసినప్పటికీ, అర్బన్ యువతలో నిరుద్యోగం ఆందోళనకరంగా ఉంది. ఈ సందర్భంలో, అధిక జనాభా ఉన్న భారత్‌లో ఉద్యోగ సృష్టి అత్యంత కీలకం, కానీ ఈ రంగంలో విజయం సాధించడం కష్టసాధ్యంగా కనిపిస్తోంది.

సామాజిక అసమానతలు మరో పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. నీతి ఆయోగ్ పేదరికం 5 శాతానికి తగ్గిందని చెప్పినప్పటికీ, వరల్డ్ బ్యాంక్, ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు దీనిని 12–15 శాతానికి దగ్గరగా అంచనా వేస్తున్నాయి. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, భారత్‌లోని 1 శాతం ధనవంతుల వద్ద 40 శాతం జాతీయ సంపద కేంద్రీకృతమైంది, ఇది 2014లో 22 శాతం నుంచి గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. ఈ అసమానతలు సంపద పంపిణీలో పెరుగుతున్న అంతరాన్ని, సామాన్యులకు ఆర్థిక పురోగతి ఫలితాలు అందకపోవడాన్ని చూపిస్తున్నాయి. ఈ సందర్భంలో, (ఎస్ అండ్ పి) రేటింగ్ అప్‌గ్రేడ్ ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తున్నప్పటికీ, సామాజిక – ఆర్థిక సమస్యలను పరిష్కరించకపోతే ఈ విజయం అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.

జిఎస్‌టి ఆదాయం 2024–25లో 9.4 శాతం పెరిగినప్పటికీ, లక్ష్యాలను చేరుకోలేకపోవడం, బడ్జెట్ వెలుపలి రుణాలు, సబ్సిడీలు వంటివి ఆర్థిక లోటు గణాంకాలను మరుగున పరుస్తున్నాయని విమర్శకులు చెబుతున్నారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు భారత ఎగుమతులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు మరో సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో, రేటింగ్ అప్‌గ్రేడ్ ఒక సానుకూల సంకేతం అయినప్పటికీ, దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వం కోసం డేటా పారదర్శకత, ఉద్యోగ సృష్టి, సామాజిక సమానత్వంపై దృష్టి సారించాలి. చివరగా, భారత ఆర్థిక వృద్ధి కథ రెండు ముఖాలను కలిగి ఉంది. ఒకవైపు గ్లోబల్ ప్రభావాలు, ముఖ్యంగా అమెరికా టారిఫ్‌ల ప్రభావం, మరోవైపు దేశీయ సవాళ్లు. (ఎస్ అండ్ పి) రేటింగ్ అప్‌గ్రేడ్ ఒక అవకాశంగా భావించాలి, కానీ దాని ని సామాన్యుల జీవనోపాధికి, సమగ్రమైన వృద్ధికి అనుసంధానం చేయకపోతే, ఈ వెలుగు కేవలం గణాంకాల గారడీగానే మిగిలిపోతుంది.

# అంతరిక్ష పరిశోధనలో నవ శకం



సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారత్ నవ నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతుంది. ఈ క్రమంలో నేడు రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటోంది.

ఆగస్టు 23, 2023 రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్3 లోని విక్రమ్ ల్యాండర్ 'శివశక్తి' అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ మిషన్ విజయం అంతరిక్షరంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయి. భారతదేశం చంద్రునిపై విజయవంతంగా అడుగుపెట్టిన నాల్గవ దేశంగా, దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరుకున్న మొదటి దేశంగా అవతరించింది. ఈ దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన, విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదిక కానుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (STEM)లో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనుంది. ఈ యేడు ఆర్యభట్ట నుండి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకొంటున్నాం. ఇది ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట కాలం అనంతరం మిగిలిపోయిన ఖగోళ విజ్ఞాన అన్వేషణతో భవిష్యత్తు అంతరిక్ష కార్యక్రమాలలో దూసుకుపోవాలని నొక్కి చెబుతుంది.

**చంద్రునిపై భారత ప్రణాళికలు**

భారతదేశం అంతరిక్ష రంగంలో నవ శకానికి నాంది పలకడానికి సిద్ధమైంది. 2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్ యాన్ మిషన్ కీలకం కానుంది. ఇందులో భూమికి దగ్గరగా 400 కిలోమీటర్ల దూరంలో భూకక్ష్యలోకి పంపి, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం ఈ మిషన్ తొలి లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2026 నాటికి వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. అనంతరం 2027 లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్ మిషన్ చేపట్టనున్నారు. మరోవైపు మానవ సహిత చంద్రుడియాత్రకు ముందు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అనంతరం మానవ సహిత చంద్రుడియాత్రకు సిద్ధం కానుంది. చంద్రయాన్ 4 లో చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఎల్విఎం అనే పెద్ద రాకెట్లతో డాకింగ్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ సాంకేతికత భవిష్యత్తులో మానవ సహిత యాత్రలకు, అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి చాలా అవసరం. ఇటీవల భారత వాయుసేన పైలట్, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా యాక్సియం4 మిషన్‌లో ముగ్గురు వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించి తిరిగి వచ్చాడు. భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసిలో విహరించిన నాలుగు దశాబ్దాల తర్వాత మరో భారతీయుడు అంతరిక్షంలోకి దూసుకెళ్లాడు. ఇదీ భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే మానవసహిత యాత్రలకు నాంది అని పలువురు అభివర్ణించారు. చంద్రయాన్3 విజయవంతం అయిన తర్వాత, జపాన్ స్వయంగా భారత్ సహకారం కోరింది. దీనితో ఇస్రో, జపాన్ అంతరిక్ష సంస్థ జాక్స(JAXA) కలిసి చంద్రయాన్5/LUPEX మిషన్ కోసం పని చేయాలని నిర్ణయించారు.




**అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం**

భారత అంతరిక్ష కార్యక్రమాలు ఆధునికంగా ముందుకెళ్లడానికి, ప్రజల దైనందిన జీవితాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతున్నాయి. అంతరిక్ష ప్రయోగాలకు కేంద్రమైన ఇస్రో సౌండింగ్ రాకెట్ తో మొదలు పెట్టి నేడు పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి, ఎల్విఎం లాంటి రాకెట్లతో బారి ఉపగ్రహాలను ప్రయోగిస్తుంది. అత్యంత ఖచ్చితత్వంతో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలు ప్రయోగిస్తున్నది. మరోవైపు వాణిజ్య ఉపగ్రహాలతో విదేశీ మారకద్రవ్యాన్ని అర్జిస్తుంది. ఇస్రో ప్రయోగించే ఉపగ్రహాలతో వాతావరణ సూచన, సమాచార మార్పిడి (టీవీ, ఇంటర్నెట్), నావిగేషన్ (GPS), భూమి పరిశీలన (పర్యావరణ మార్పులు, విపత్తులు), శాస్త్రీయ పరిశోధన,రక్షణ వంటి అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. మరోవైపు ఇస్రో పునర్వినియోగ రాకెట్ల(పుష్పక్) తయారీ, చిన్న రాకెట్ల ప్రయోగ వేదికను సిద్ధం చేస్తుంది. వీటితో తక్కువ ఖర్చుతో ఉపగ్రహాల ప్రయోగం మరియు చిన్న ఉపగ్రహాల సత్వర ప్రయోగానికి బీజం పడనుంది. భారత ప్రభుత్వం భారత అంతరిక్ష విధానం–2023ను తీసుకువచ్చింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం. ఈ విధానం ద్వారా అంతరిక్ష సంబంధిత కార్యకలాపాల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం, పరిశోధన, అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**పరిశోధనకు బడ్జెట్ కేటాయించాలి :** అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష ప్రయోగాలు కొనసాగుతున్నప్పటికీ...భారతదేశం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2 శాతం మాత్రమే కలిగి ఉంది. దీన్ని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తిని పెంచాలి. వీటిపై మక్కువ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఇస్రో యువిక (యంగ్ సైంటిస్ట్) 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నది. ఉన్నత విద్య, పరిశోధనలో యువ భాగస్వామ్యాన్ని పెంచాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే మన విద్య వ్యవస్థలో నాణ్యత చాలా తక్కువ. మంచి విద్య, ఉద్యోగాల కోసం అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలకు మన మేథో వలసలు జరుగుతున్నాయి. మరోవైపు, భారత్లో ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య 28 శాతమే. దీన్ని 2035 కల్లా 50 శాతానికి పెంచాలనీ, మన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలని 2020 నూతన విద్య విధానం లక్షిస్తోంది. దీనికి అనుగుణంగానే విదేశీ వర్సిటీలకు భారత్ స్వాగతం పలికారు.

## నూతన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ



ప్రజా పక్షం/తిరుమలగిరి సాగర్: మండలంలోని నెల్లికల్ లో నూతన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ఏర్పడి రేండేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నెల్లికల్ లిఫ్ట్ పనులు గానీ, నెల్లికల్ లిఫ్ట్ క్రింద రైతులకు భూమి కోల్పోయిన వారికి ఎక్కడ లేని విధంగా 1ఎకరానికి సుమారు 24లక్షల రూపాయలు ఇచ్చామన్నారు.

## చంద్రమౌళి ఆసుపత్రి సీజ్ డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/మునగాల: మండల కేంద్రంలో 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఆర్‌ఎంపి చంద్రమౌళి ఆసుపత్రిని శుక్రవారం డిఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈనెల 5వ తేదీన మండలంలో బరాఖత్ గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి చంద్రమౌళి చేసిన వైద్యం వికటించి మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై మునగాల పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొన్నిరోజుల కిందట డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి ఆధ్వర్యంలో చంద్రమౌళిక ఆసుపత్రితో పాటు అనుబంధంగా ఉన్న అమ్మ రక్త పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరిమితికి మించి వైద్యం చేయవద్దని, అనవసరంగా యాంటిబయోటిక్ మందులు వినియోగించవద్దని హెచ్చరించారు. చంద్రమౌళి ఆసుపత్రిని మరల తెరిచి వైద్యం చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి తన సిబ్బందితో సహా ఆసుపత్రికి వద్దకు చేరుకుని సెంటర్‌ను సీజ్ చేశారు. ఆయన వెంట డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి, స్థానిక వైద్యాధికారి రవీందర్ పాల్గొన్నారు.




## ప్రజల భాగస్వామ్యంతో పటిష్ఠంగా పనిచేయాలి : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట: నేరాలు జరగకుండా సాంకేతిక వినియోగం చేసుకుని ప్రజల భాగస్వామ్యంతో పటిష్టంగా పనిచేయాలని జిల్లా ఎస్‌పి కె. నర్సింహా పోలీసులకు అదేశించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ రవాణ నిరోదనలో క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని, ప్రతి అంశాన్ని రికార్డులో నమోదు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు, కోర్టు పెండింగ్ కేసులు, వాహనాల తనిఖీలు, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్టిక్ నైట్ అలార్టింగ్ అధికారి విధులు, హైవై పెట్రోలింగ్, కార్డన్ సెర్చ్, దొంగతనాల కేసుల్లో నగదు స్వాధీనంపై ఆయన సమీక్షించి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని కోరారు. పెట్రోలింగ్ బిట్ సమర్ధవంతంగా నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పలువురుపోలీస్ అధికారులకు రివార్డులు అందజేశారు. జిల్లా అదనపు ఎస్‌పిలు రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట, కోదాడ డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీధర్‌రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నర్సింహచారితో పాటు ఆయా పోలీస్‌స్టేషన్‌ల సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకోవాలి




ప్రజాపక్షం/మిర్యాలగూడ: ప్రతి విద్యార్థి ప్రశ్నించడం నేర్చుకో వాల అని తెలంగాణ విద్యా వికాస వేదిక నాయకులు కస్తూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మిర్యాలగూడలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిచయం శాస్త్రీయ దృక్పథం అనే అంశం పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంత్రగాళ్ళు తంత్రగాళ్ల పేరుతో వచ్చి పేద ప్రజలను మోసం చేస్తున్న వారీని నమ్మవద్దని అన్నారు. సామాజికవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తీసుకోవాలని రోజువారి ఆహారంలో ఆకుకూరలు గుడ్డు పప్పు లాంటివి తినడం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రోటీన్స్ విటమిన్స్ అందుతాయని ఆపిల్ కన్నా అరటి మేలు చేస్తుందని లడ్డు కన్నా గుడ్డు మరి ఎంతో మంచిదని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కొండల్ రెడ్డి మ్యాజిక్ ద్వారా సైన్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుర్ర కృష్ణ కాంత్ నాయక్, ఉపేందర్‌పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పి రమేష్ అన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని ఎన్‌జి కళాశాల లో విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అడిషనల్ ఎస్‌పి రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయ ణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చదువుకున్న విద్యార్దులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉంటే తన చుట్టూ పరిసరాల్లో ఉన్న ప్రజలకు,వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తద్వారా సైబర్ మోసాలు నిరోధించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రంమలో సైబర్ క్రైమ్ ఎస్‌ఐ విష్ణు,కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గురుకుల విద్యార్థులు సత్తా

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాపక్షం/నందికొండ: తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ లో భాగంగా నల్లగొండ మేకల అభినవ్ స్టేడియం గురువారం నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ మీట్ లో నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి ఈ నెల 30, 31న మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్రస్థాయి అథెటిక్స్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లాస్థాయిలో వివిధ కేటగిరీలలో విజయంతో పతకాలు సాధించి క్రీడాకారుల వివరాలు అండర్ 18 విభాగంలోనందకిషోర్ 1 కిలోమీటర్ పరుగు పందెంలో స్వర్ణం సాధించగా, దినేష్ జావలిన్ త్రో లో స్వర్ణం, లాంగ్ జంప్ లోరజతం సాధించాడు అదేవిధంగా రవితేజ 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. అండర్ 16 విభాగంలో గణేష్ 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ రెండింటిలో స్వర్ణం సాధించగా అరవింద్ 600 మీటర్లు, హరి లంగ్ జంప్ లో రజతం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్,పి ఈ డి, జ్యోతి, పిఇటి అరుణ విద్యార్థులను అభినందించారు.



# కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ వైద్యశాల

### 3.14 కోట్లతో సిటిస్కాన్ ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడుకోట్ల 14 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేసిన సిటి స్కాన్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో 26 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి విస్తరణలో భాగంగా జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. పేదలకు మైరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగెట్ చింత కుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యానారాయణ, డిసిహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరధ, కమిషనర్ రమాదేవి, వైద్యులు అభిరామ్, వైష్ణవి, నర్సింహ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగం

ప్రజాపక్షం/మునగాల: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పనుల జాతర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధులను మెరుగుపర్చడానికి ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున పనుల జాతర కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిఆదరులకు పథకాలు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రూ.80 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటి సిఈవో శీరిష, డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటి డిఎంహెచ్‌వో జయమనోహరి, కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, ఎంపిడివో రమేష్ దీన్ దయాల్ పాల్గొన్నారు.



## నేర నియంత్రణకు కృషి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ని జిల్లా ఎస్‌పి ఆకస్మిత తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు, పోలీస్ స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిసరాలు, స్థితిగతుల వివరాల గురించి సిఐ రాజశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాక్ అప్, ఎస్‌హెచ్‌ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, సిబ్బందికి కేటాయించిన కిట్లను తనిఖీ చేయడం జరిగింది. అనంతరం, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ క్రైమ్ రికార్డ్, జనరల్ రికార్డ్స్ లు తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధిత ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా, వారి పట్ల తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తీర్చాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, పిడియస్ రైస్ అక్రమ రవాణా,జూదం లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి, గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి, కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి మౌనిక, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, ఎస్‌బి సిఐ రాము, ఎస్‌ఐలు గోపాల్ రావు, సైదులు, సతీష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధి మెరుగుకు కృషి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



ప్రజాపక్షం/చివ్వెంల: గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధులను మెరుగుపర్చేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. ప్రజలకు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెల్లో ప్రగతి కార్యక్రమంలో భాగంగా చివ్వెంల మండల కేంద్రంలో పనుల జాతర ప్రారంభించి మాట్లాడారు. 2వ వార్డులో వడ్డేపల్లి రాములు అనే లబ్ధిదారుడు సుమారు 78500 రూపాయల వ్యయంతో నిర్మించుకున్న పశువుల పాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడు వడ్డేపల్లి రాములుతో మాట్లాడుతూ పశువుల పాక నిర్మించుకునేందుకు ఎంత ఖర్చు అయిందని, ఎన్ని రోజులు పట్టిందని, పశువులు ఎన్ని ఉన్నాయని, పాలు ఎక్కడ అమ్ముతున్నారని , ఎంత ధర వస్తుందని తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తనకు మూడు పాడి అవులు ఉన్నాయని, ప్రతిరోజు ఉదయం 6 లీటర్లు, సాయంత్రం 6 లీటర్లు పాలు ఇస్తున్నాయని, లీటర్ 80 రూపాయల చొప్పున విక్రయిస్తున్నానని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టనున్న వాననీటి సంరక్షణ కట్టడం పనులను ప్రారంభించారు. వారంలోపు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో వివి అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, తహసిల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఉపాధి హామీ ఎపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకోవాలి: జిల్లా కలెక్టర్**

విద్యార్థులు బాగా చదివి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ కోరారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భవిత కేంద్రం, తహసిల్దార్ కార్యాలయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, సెప్టెంబర్ 1వ తేదీ నుండి అదనపు తరగతులు నిర్వహించాలని, విద్యార్థులు మంచిగా చదివి, మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం భవిత కేంద్రం సందర్శించి సైగలతో అంకెలు, క లర్స్ మ్యాచింగ్ లను విద్యార్థులో చేపించారు. అనంతరం సోని అనే లబ్ధిదారు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వారికి ఇసుక ఉచితంగా అందజేయాలని తహసిల్దార్‌ని అదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి, స్టాప్ హాజరు రిజిస్టర్, ఎఎన్‌సి రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈనెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని డాక్టర్ భవానిని అడిగారు. ఈడిడి క్యాలెండర్‌ను పిహెచ్‌సిలో అందరికి కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, మెడికల్ అధికారి భవాని, ఆయూష్ డాక్టర్ పార్ధసారధి, ప్రధానోపాధ్యాయురాలు కళారాణి, భవిత కేంద్రం ఇన్‌ఛార్జి పద్మ, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెగా హెల్త్ చెకప్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మెగా హెల్త్ చెకప్ కళాశాల నాలుగు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ నల్లగొండ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మ గాంధీ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదువుకునే విద్యార్థులు అందరూ పేద మధ్యతరగతి విద్యార్థులకు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించటం ఎంతో అభినందనీయమని తెలిపారు. విద్యార్థినిలకు బ్లడ్ పర్సంటేజ్, షుగర్ బిపి, లిపిడ్ ప్రొఫైల్, యూరిక్ యాసిడ్ లాంటి అత్యంత విలువైన పరీక్షలు నిర్వహించినందుకు పానగల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ నసేహ తబస్సుమ్, ఏఎన్‌ఎంలు ఎన్ శిరీష, టి మంజుల, గౌతమి, మెడికల్ టీం ని ప్రత్యేకంగా అభినందించారు. సుమారు 300 మందికి పైగా విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చైతన్య సుధ, డాక్టర్ వసంత, పుష్పలత, దయానంద్, అధ్యాపకులు మంజుల, డాక్టర్ సుంకరి రాజారామ్, డాక్టర్ రవి, నవిలా, భాగ్యలక్ష్మి, శ్వేత, కళాశాల బోధనేతర సిబ్బంది జ్యోతి పాల్గొన్నారు.



# లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతోందా?

### రివ్యూలు, ప్రకటనలకే పరిమితం అవుతున్న పోలీసులు
### భయాందోళనలో 'సూర్యాపేట' ప్రజలు

**సూర్యాపేట జిల్లా కేంద్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతోందా... అంటే ప్రజలు ఔననే చెబుతున్నారు. ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ప్రజల మానప్రాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల పరిరక్షణ కోసం పాటుపడాల్సిన పోలీసులు కేవలం రివ్యూలు, ప్రకటనలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా నేరాలు, ఘోరాలు పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.**

ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడులేని విధంగా దోపిడీలు, హత్యయత్నాలు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయి. గత రెండునెలల క్రితం జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్న ఓ వ్యక్తిని హత్య చేసేందుకు కొంతమంది దుండగులు మరణాయుదాలతో కారులో అనుమానస్పదంగా తిరుగుతుండటంతో వారి కదలికలను పసిగట్టిన ప్రజలు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించి పట్టించిన విషయం అందరికి తెలిసిందే. ఇది మరువక ముందే శుక్రవారం ఖమ్మం రోడ్డులో బైకుపై వెళ్తున్న ఒక మగ, ఇద్దరు ఆడ వారిని హత్య చేసేందుకు కారులో కొంతమంది దుండగులు వెంటాడుతుండగా వారినుండి తప్పించుకునేందుకు రోడ్డు పక్కన ఉన్న ఓ వైన్స్‌షాపులోకి వెళ్లేందుకు బైకును రోడ్డు పైనే పడేసి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అందులోకి పరుగు తీశారు. వెనుక నుండి కారులో వెంబడించిన దుండగులు కర్రలు, ఇతర మరణాయుధాలతో వారు దాక్కున్న వైన్స్ షాపులోకి వెళ్లగా అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా బయటకు రావడంతో తిరిగి వెళ్లిపోయారు. ఈదృశ్యాలన్నీ సిసి కెమోరాలు రికార్డు కావడంతో సోషల్ మీడియాలో కొందరు పోస్టు చేయడంతో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల సూర్యాపేట చరిత్రలోనే అతిపెద్ద దోపిడీ జరిగింది. అంతరాష్ట్ర దొంగలు పట్టణ నడిబొడ్డున ఉన్న ఓ బంగారు దుకాణానికి కన్నం వేసి 8 కిలోల బంగారాన్ని దోచుకెళ్లారు. సదరు వ్యాపారి 8కిలోల బంగారం చోరీకి గురైనట్లు మీడియాముందు చెబితే పోలీసులు మాత్రం కేవలం మూడుకిలోల మాత్రమే పోయినట్లు వెల్లడించారు. సొమ్ము పోగొట్టుకున్న వ్యాపారి, పోలీసులు చెప్పిన దానిలో ఎలాంటి పొంతన లేకుండా ఉండటంతో మీడియా కూడా రోజుకో రకంగా వార్తా కథనాలను ప్రచురితం కావడంతో ప్రజల్లో చర్చకు దారితీసింది. ఇది ఇలా ఉంటే గంజాయిని అరికడుతున్నామని చెబుతూ కిలోల కొద్ది గంజాయి జాతీయరహదారి వెంట తరలిస్తున్న వారిని పట్టుకుంటున్న పోలీసులు జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి తాగి కొంతమంది రోడ్లపై చేస్తున్న అగడాలు అన్ని ఇన్ని కావు, వీటిని అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. కొత్త బస్టాండ్, ఖమ్మం ఎక్స్‌రోడ్డు, నూతన వ్యవసాయ మార్కెట్ రోడ్డులో గంజాయి బ్యాచ్ అగడాలు రోజు రోజుకు సృతిమించుతున్నాయి. వీరి అగడాలు అడ్డుకున్నవారిపై దాడులకు తెగబడి వీరంగం సృష్టిస్తున్నారు. రహదారులపై పార్కింగ్ చేసిన వాహనాలపై రాళ్లతో దాడిచేసి ధ్వంసం చేస్తున్న పరిస్థితి. గత పదిహేను రోజుల క్రితం విద్యానగర్‌కు చెందిన ఓ మాజీ కౌన్సిలర్, వస్త్ర వ్యాపారి కుమారుడి ఇంట్లో ఉండగా ఓ గంజాయి బ్యాచ్ అతన్ని బయటకు ఈడ్చుకొచ్చి రోడ్డుపై విచక్షణ రహితంగా దాడి చేశారు. అక్కడ ఉన్న చుట్టుపక్కల వారంతా ప్రతిఘటించడంతో వారు అక్కడ నుండి పరారి అయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంఘటనలు కోకొల్లలు...

పోలీస్ అధికారులు రివ్యూలు, ప్రకటనలకే పరిమితం కావడంతో నేరాలు, ఘోరాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్టేషన్‌లకే పరిమితమై ఏసీ కింద కుర్చీని సివిల్ వివాదాల్లో తలమునకలు అవుతున్నారే తప్ప, బయట ఏమీ జరుగుతుందోనేది తెలుసుకునేందుకు కూడా కనీస ప్రయత్నం చేయడంలేదని చర్చ ప్రజల్లో సాగుతోంది. కొంతమంది అధికారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగించుకుంటున్నారు. గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాత్రి వేళలో గస్తీ నిర్వహించేందుకు అధికారులు బిట్లుగా విభజించి బిట్‌కు ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డును నియామకం చేశారు. వీరు రాత్రి వేళలో పొద్దుపోయేంత వరకూ గస్తీ నిర్వహించేవారు నేడు ఆ గస్తీ కొరవడిందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. దీంతో నేరాలు, ఘోరాలు పెరిగాయని అదే శాఖలో పనిచేస్తున్న కొందరు పోలీసులు చెప్పకనే చెబుతున్నారు. నేరాలు, ఘోరాలు దీంతో ప్రజలు తీవ్ర ఆందోళకు గురవుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ ఏ ఘోరం జరుగుతుందోనని ఇంట్లోనుండి రోడ్డుమీద కాలుమోపినప్పటి నుండి భయం భయంగానే బయటకు వెళ్తూ తమ పనులను చక్క పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి లాఅండ్ ఆర్డర్‌ను అదుపులో పెట్టి తమ మాన ప్రాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



## దొంగ అరెస్ట్



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మండల పరిధిలోని కొర్రతండాలో గత వారం కొర్రపట్టి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి దొంగతనం చేసి ఒక కేజి వెండి ఆభరణాలు, రూ. లక్ష 50వేల నగదు, ఒక సెల్ ఫోన్ దొంగిలించాడు. బాధితురాలు కొర్రపట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా అదే తండాలో అనుమానాస్పదంగా ఉన్న కేతావత్ బద్యను విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. నిందితుడు బద్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తక్కువ సమయంలో కేసును చేధించినందుకు సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్‌లను ఎస్పి శరత్ చంద్ర పవార్ అభినందించి, నగదు రివార్డులను అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

## నానో యూరియాతో అధిక లాభాలు

ప్రజాపక్షం/డిండి; నానో యూరియా వినియోగం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, నానో యూరియా ద్రవ రూపంలో చిన్న డబ్బాలో లభిస్తుందని నిల్వతో పాటు రవాణా సులభ తరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి రెహానా అన్నారు. శుక్రవారం రైతులతో మాట్లాడుతూ నానో యూరియా వల్ల పంటలకు అవసరమైన నత్రజని సమృద్ధిగా లభిస్తుందని, పంట దిగుబడి, నాణ్యతను సాంప్రదాయ యూరియా బస్తా రూ. 266 కాగా, రూ. 225లకు వచ్చే నానో యూరియా అర లీటర్ డబ్బాతో ఎకరా పొలానిక సరిపోతుందని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు అందించే నానో యూరియా పర్యావరణానికి మేలు చేస్తుందని రైతులు నానో యూరియా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయితేజ, సీఈవో బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సమన్వయ సమావేశం

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో భరోసా, షీ టీమ్, ఎహెచ్‌టియు (ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్), కళాబృందం సభ్యులతో సమన్వయ సమావేశం జరిగించింది. ఈ సమావేశానికి సిఐడి, ఎస్పి అన్వేష్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజల్లో, ముఖ్యంగా మహిళలు, బాలికలు, విద్యార్థుల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు భరోసా, షీటీమ్, ఎహెచ్‌టియు, కళాబృందం సభ్యులు సమన్వయంగా పని చేయాలి. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు, గ్రామీణ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలి. సైబర్ క్రైమింగ్ వంటి సమస్యలను అరికట్టడానికి తద్దిందుకు కౌన్సిలింగ్ చేయాలి. అలాగే ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, గృహ హింస, మహిళలపై దాడులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలి.ఈ సమావేశంలో సిఐడి ఎస్పి అన్వేష్య, అదనపు ఎస్పీ ఎంటి రత్నం, డిసిఆర్‌బి ,డిఎస్‌పి రమణా రెడ్డి, సిఐడి ఇన్స్పెక్టర్ లక్ష్మన్, ఉమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, భరోసా ఇంచార్జ్ ఉమెన్ ఎస్సై సుజాత, అలాగే భరోసా, షీటీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

## టీఎల్ఎంతో బోధన మరింత సులభం

ప్రజాపక్షం/వీపనగండ్ల : విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించడానికి టీఎల్‌ఎం మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈహెచ్ఎం వర లక్ష్మి, ఎంఈఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులలో పాఠం బోధన పట్ల ఆసక్తి పెంచేందుకు పాఠశాల ఉపాధ్యాయులు బోధన సహాయక దృశ్య సామాగ్రి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్‌ఎం ప్రాముఖ్యత, వాడుక, బోధనలో దాని పాత్రపై వివరిస్తూ విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించడానికి అనేక రకాల టీఎల్‌ఎం తయారీ పద్ధతులను ప్రదర్శించారు. మోడల్స్, చార్టులు, ఫ్లాష్ కార్డులు, చిత్రాలు వంటి విద్యాసామాగ్రిని వినియోగించే విధానాన్ని చేశారు. మండల విద్యాధికారి నర్సింహ మాట్లాడుతూ టీఎల్‌ఎం వాడకం వల్ల బోధన మరింత సులభం, ఆసక్తికరంగా మారుతుంది. విద్యార్థులు పాఠశాలను సులభంగా అర్థం చేసుకోవడమే కాకుండా వాటిని సృజనాత్మకంగా ఉపయోగించుకోవడం నేర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు భాను ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, సిఆర్‌పిలు వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.



## ఘనంగా సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : సిపిఐ రాష్ట్ర 4 మహాసభల్లో మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బి.బాల్‌కిషన్ మాట్లాడుతూ జిల్లా సమస్యల పరిష్కారానికై సుదీర్ఘ పోరాటం నిర్వహిస్తామని ప్రతినిధుల సభలో మాట్లాడుతూ పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని అదేవిధంగా భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని పాలమూరు విశ్వవిద్యాలయానికి అధిక నిధుల కేటాయించాలని అదేవిధంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పేద విద్యార్థులు చదివేందుకు అగ్రికల్చర్ కళాశాల లేక విద్యార్థులు వేరే రాష్ట్రాలకు వెళుతున్నందున మన పాలమూరు యూనివర్సిటీలో అగ్రికల్చర్ కోర్సులు మంజూరు చేయాలని కోరడం జరిగింది. పాలమూరు పట్టణంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని అదే విధంగా 523 సర్వే నెంబర్లు పట్టాలు కోల్పోయిన నిరుపేదలకు మిగిలిపోయిన డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అనేక అంశాల పై మాట్లాడడం జరిగింది. రాష్ట్ర నాలుగోవ మహాసభలకు ప్రతినిధులుగా మహబూబ్ నగర్ జిల్లా నుండి మాజీ కార్యదర్శి పరమేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి. సురేష్ , గోవర్ధన్ పాల్గొన్నారు.

## పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం




ప్రజాపక్షం/కృష్ణ : మండలంలోని కున్సీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల్లో పఠనాసక్తిని, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా మండల విద్యాధికారి నిజాముద్దీన్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, నీటి, నిజాయితీ, నైతిక విలువలు తెలుస్తాయని, సమాజంలో మంచి చెడులను తెలుసుకునే అవకాశం ఉంటుందని, స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు చదవడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు అన్నారు. అలాగే గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తకాలను చదువుకునేందుకు ప్రతీ రోజు సాయంత్రం ప్రత్యేకంగా ఒక పీరియడ్‌ను కేటాయించి చదువుతున్నప్పుడు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు నల్లే శివరాజ్, ఉపాధ్యాయులు అనిత, అశోక్, అమృత, మాధవి, ప్రియాంక, సుప్రజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పనుల జాతర కార్యక్రమం



ప్రజాపక్షం/నర్వ: మండల పరిధిలో నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతన గ్రామపంచాయితీ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్యసాగర్, మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ముఖ్య సమస్యలు గ్రామ లిఫ్ట్, నాగిరెడ్డి పల్లి నుండి ఉంద్యాల రోడ్డు అండ్ అంగన్‌వాడీ బిల్డింగ్ పూర్తి చేయిస్తామని చెప్పగా ఈ విషయానికి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ తో పాటు ఎమ్మార్వో మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈఈడిఈ ఎపియం గ్రామ సెక్రెటరీ శైలజ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్, చందు, రాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల జాతర ప్రారంభం



ప్రజాపక్షం/కొత్తపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు పనుల జాతర 2025లో భాగంగా మండలంలో మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం నుండి పలు రకాల అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. మండలంలో ప్రతి గ్రామపంచాయతీలో ఉదయం గ్రామ సభలు నిర్వహించారు. యంపిడివో కృష్ణారావు, ఎంపివో రామన్నతో కలిసి మండల కేంద్రంలోని ఉపాధి హామి పథకంలో మూడున్నర ఎకారాల్లో మామిడి మొక్కలు, ఒకటిన్నర ఎకరంలో మునగ మొక్కలను పరిశీలించి, అలాగే లబ్దిదారుని పొలంలో మొక్కలను నాటారు. ప్రభుత్వ ఆదేశం మేరకు ప్రతి శుక్రవారం ప్రతి గ్రామ పంచాయతీలో ఏదో ఒక అభివృద్ధి పని చేయాలనే సంకల్పంతో పనుల జాతరను మొదలు పెట్టారని తెలియజేశారు. అదే విధంగా భూనీడ్‌లో అంగన్‌వాడీ, సాముహిక మరుగుదొడ్లకు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల పంచాయతి కార్యదర్శులు, అధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ప్రజాపక్షం/మద్దూర్ : మండల పరిధిలోని పల్లేర్ల గ్రామంలో శుక్రవారం రోజు గ్రామ పంచాయతీ దగ్గర పనుల జాతర 2025 లో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ కడా ఆధికారి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా యంజియన్‌అర్‌ఇజియస్ నిధుల ద్వారా అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. అలాగే గ్రామంలో ఉన్నా పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. పారిశుద్య కార్మికులను, ఉపాధిహామీలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్నవారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్ రెడ్డి, యంపిడివో రహమతుద్దిన్, డిఇ విలోక్ కూమర్, ఎఇ సందిప్, ఎపివో నాగరాజు, పిఎసియస్ చైర్మెన్ గుళ్ళ నర్సిములు, మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సెక్రటరి, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో త్వరలో హెలీటూరిజం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : త్వరలోనే తెలంగాణలో హెలీటూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా హెలీటూరిజం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గగనతలంలో కొద్దిసేపు విహరింపచేసి పర్యాటకులకు ఆహ్లాదాన్ని, అనుభూతిని కల్పించేందుకు హెలీటూరిజం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈజ్‌మైట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్‌నుంచి సోమశిల అక్కడినుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు హెలీటూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల మన పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుందని, దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు. రూ.68.10కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.45.84కోట్లవ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు రూ.1.60కోట్లతో సోమశిల విఐపిఘాట్ బోటింగ్ పాయింట్‌కోసం ట్రెంచింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలకేంద్రంలో శుక్రవారం రూ.8లక్షలవ్యయంతో



నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన, పెంట్లవెల్లి నుండి మంచాలకట్ట గ్రామానికి ఒకకోటి 40లక్షల రూపాయలతో నూతన బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి , పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# గణేష్ మార్గ్‌ను పరిశీలించిన అధికారుల బృందం



ప్రజాపక్షం/నారాయణపేట్ : రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కొండ రెడ్డ పల్లి చెరువు, గణేష్ మార్గ్‌ను పరిశీలించి ముందస్తు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆర్డీఓ రామ్ చందర్, డిఎస్పీ లింగయ్యలు అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. కొండ రెడ్డి పల్లి చెరువు నుండి జిల్లా కేంద్రంలోని గణేష్ మార్గ్ ను మెయిన్ చౌక్ నుండి సరబ్ బజార్, గుడ్ లక్ కమాన్, హజారి హోటల్, మాసుమలీదర్గా, అంబా భవాని టెంపుల్, చౌడేశ్వరి టెంపుల్, కాలమ్మ గుడి, ఉట్కూర్ మజీద్ మెయిన్ రోడ్, ఓల్డ్ బస్టాండ్ తదితర మార్గంలో అధికారుల బృందం పరిశీలించి రోడ్డు పై గుంతలు ఉన్నచోట మరమ్మత్తులు చేయాలని రోడ్డు పైన విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లను తొలగించాలని, రోడ్డుకు అడ్డంగా ఉండే చెట్లను కొమ్మలను తొలగించాలని అధికారులకు ఆర్డిఓ రామచందర్, డిఎస్పీ లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, విద్యుత్, మున్సిపల్, ఫిషరీస్ తదితర అధికారుల బృందం పాల్గొన్నారు.

# రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు

### కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/జడ్చర్ల : పిహెచ్‌సి వైద్యులు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జడ్చర్ల మండలం గంగాపూర్ పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి ఆవరణలో వర్షానికి విరిగిపోయిన చెట్టు అలాగే ఉండడం, బయట చెత్తాచెదారం పడి ఉండి చూసి పిహెచ్‌సి లోపల పరిశుభ్రత లేకపోవడం గమనించి కలెక్టర్ సంబంధిత వైద్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిహెచ్‌సి నిర్వహణ బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిహెచ్‌సి ఆవరణ, గదులు, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది ఓపి నమోదు అయ్యారు? 64 మంది ఓపి నమోదు చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ వివరించారు. పిహెచ్‌సికి ఎటువంటి కేసులు వస్తున్నారు. అడిగి తెలుసుకున్నారు. జ్వరం, దగ్గు, కోల్డ్, ఒళ్లు నొపులతో వస్తున్నారు అని కలెక్టర్‌కు వివరించారు. డెంగ్యూ కేసుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. జూలై నెలలో 5 డెంగ్యూ కేసులు నమోదు జరిగినట్లు ఆగస్టు నెలలో



ఎటువంటి కేసులు లేవని తెలిపారు. ఆసుపత్రిలో మందుల గది, ల్యాబ్ రూం ను పరిశీలించారు. రక్త పరీక్షలకు తీసుకున్నటి హబ్‌కు ఎప్పుడు పంపిస్తారు. అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కింది 64 ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఎం.పీ.డి.ఓ విజయ్ కుమార్, మండల అధికారులు ఉన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : తమ కాళ్ల మీద నిలబడే మహిళకు సమాజంలోనే కాదు కుటుంబంలో గౌరం ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ నగరంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో 20 మంది విద్యార్థులు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని, ఈ సంఖ్య వచ్చే సంవత్సరం భారీగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న పది సంవత్సరాల్లో 20వేల మంది విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ లో శిక్షణ ఇప్పించాలనే లక్ష్యంతో ఉన్నారు. హైదరాబాద్ నుంచి అలంపూర్ వరకు ఉన్న గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేలో ఏర్పాటు కానున్న వేలాది కంపెనీలలో మన మహబూబ్‌నగర్ బిడ్డలే ఫస్ట్ ఉండి, ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు, డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని ఆయన చెప్పారు. గత సంవత్సరం హుబ్లిలో జరిగిన దేశ్ పాండే ఫౌండేషన్‌వర్క్ షాప్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. అవసరమైతే విద్యా నిధి నుంచి కూడా ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా.అనురాధ, కాకతీయ స్యాండ్ బాక్స్ హెడ్ సాహితీ, దేశ పాండే ఫౌండేషన్ రాజవల్లి, శిక్షణ పొందుతున్న విద్యార్థులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ మంత్రి



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలోని సత్యేశ్వర ఆశ్రమంలో బ్రహ్మకుమారీలు సోదర దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం నాడు ఆశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. బ్రహ్మకుమారీలు సోదర దినోత్సవం వేడుకలను సత్యేశ్వర ఆశ్రమంలో జరుపుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం గర్వించదగిన విషయం అన్నారు. గతంలో కూడా సత్యేశ్వర ఆశ్రమ నిర్వాహకులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని వారికి ఎల్లప్పుడూ అండగా ఉండి ముందుకు సాగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. రక్తదాన శిబిరం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారమవుతున్నారని ఇంతటి గొప్ప కార్యం నిర్వహించిన బ్రహ్మకుమారీలను అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా మతిస్థిమితం లేని వారిని సత్యసుల ఆశ్రమంలో తీసుకువచ్చి చికిత్స నిర్వహించి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. అనంతరం జిల్లా మాజీ జడ్పివైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య కుమార్తె జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాల్లో శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రమ నిర్వాహకులు, వాసవి క్లబ్ అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, యెచ్చం నవీన్, మేడిశెట్టి రామకృష్ణ, కొండూరి వెంకటేశ్, కండె కృష్ణ, ఓం శాంతి ఆశ్రమ నిర్వాహకులు సుజ్ఞాని, ప్రభ, రాఘవులు, వినయ్, నాయకులు పాలాది రామ్మోహన్ కొడుగల్ యాదయ్య, శ్రీశైలం యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగుల బ్లాక్‌డేను విజయవంతం చేయండి

ప్రజాపక్షం/కల్వకుర్తి : సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో శనివారం చేపట్టిన టిఎస్ సిపిఎస్ ఈయుబ్లాక్‌డేను విజయవంతం చేయాలని జిల్లాప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహ్మ పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రతి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుడు వారు పనిచేస్తున్న కార్యాలయంలో, పాఠశాలలో, కాలేజీల్లో మధ్యాహ్న భోజన విరామంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోనైనా సిపిఎస్ ఉద్యోగుల కష్టాలు తొలగిపోతాయని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ కల్పిస్తారనే ఉద్దేశ్యంతో వేలాదిమంది సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చురుకుగా పాల్గొన్నారని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేశారు.




## ఉల్లాసంగా సాగిన మహాసభలు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : సిపిఐ 4వ రాష్ట్రమహాసభలు మేడ్చల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐపార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ నాగర్‌కర్నూల్ జిల్లా తీర్మాణాలను ప్రవేశపెట్టారు. కల్వకుర్తి ఎత్తిపోతల మహాత్మాగాంధీ ప్రాజెక్టులోని చివరిఆయకట్టుకు నీరు అందించేరకంగా డిజైన్‌లో ఉన్న అన్ని రిజర్వాయర్లు చిన్నకాల్వలో పిల్ల కాల్వలను నిర్మించి దానికికావాల్సిన భూసేకరణచేసి తక్షణమే చివరి ఆయకట్టువరకు నీళ్ల అందించాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. జిల్లాలో లభిస్తున్న ముడి సరుకుల ద్వారా పరిశ్రమలు నిర్మించి ఈప్రాంతంలోని ప్రజానీకానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సిమెంటు, రాయి, సున్నపురాయి, గ్రైనేడ్ ఎదురుబొంగు ఇతర అనేక ప్రకృతి సిద్దమైన ముడిసరుకులు లభిస్తాయన్నారు. అదేవిధంగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో నీళ్లు పుష్కలంగా ఉందన్నారు. జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న అతి ముఖ్యమైన సమస్య జడ్చర్లటు నంద్యాల పోయే నాగర్‌కర్నూల్ కొల్లాపూర్ రైల్వేలైన్ , జడ్చర్ల టు మాచారం వయా అచ్చంపేట మాచారం ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు పంపడం జరిగిందికాని ఇప్పటికి ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కావున తక్షణమే ఈ రెండులైన్ల పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఒకే లైన్‌వే రూట్ ఉంది కాబట్టి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈరైల్వే విస్తరణకోసం ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంపై చర్చగోష్టి




ప్రజాపక్షం/బిజినేపల్లి : కృషి విజ్ఞాన కేంద్రం పాలెంవారి ఆధ్వర్యంలో మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సహకారంతో సేంద్రీయ వ్యవసాయం ఎరువుల యాజమాన్యంపై అవగాహన సదస్సు శుక్రవారం కృషివిజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయంపై రైతులతో చర్చగోష్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జి.పి శ్రీదేవి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వ్యవసాయ రసాయన మందులను వాడాల్సిందిగా రైతులను కోరుతూ దీనివలన ప్రజల ఆరోగ్యం, నేలమట్టి ఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటాయని తెలిపారు. రసాయనకేంద్రం జల్‌కోడ్‌వెండి అక్రం మాట్లాడుతూ రైతులందరూ ఈ రసాయనేతర ఎరువులు మొదలగు వేపకషాయం వేపగింజలు, జీవామృతం వంటివి వ్యవసాయంలో వాడటంవలన పర్యావరణాన్ని పరీక్షించుకుంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని తెలిపారు. ఇందులోభాగంగా 42 మంది రైతులు, కళాశాల విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## శాంతియుతంగా పండుగలు



ప్రజాపక్షం/మద్దూర్ : మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం హిందు మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సైదులు మాట్లడుతూ రాబోయే వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిపించాలని దీనికి సహకరించాలని అన్నారు. డిజే సౌండ్స్ వాడకం పూర్తిగా నిషేధం కాబట్టి ఎవరు కూడా డిజేలు వినియోగించరాదని స్పష్టంగా తెలిపారు. చట్టాలు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, ఎవరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదని సూచించారు. అనంతరం మద్దూరు మండలంలో వినాయక విగ్రహాలు వేసే గణేష్ మార్గ్ పరిశీలించి గణేష్ విగ్రహాలు వెళ్ళే మార్గంలో విద్యుత్ వైర్లు కేబుల్ వైర్లు లేకుండా చూడాలని, గుంతలు పడ్డ రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేయాలని అధికారులకు సిఐ తెలిపారు. గణేష్ నిమజ్జనం చేసే కా చెరువును పరిశీలించి అక్కడ క్లీనింగ్ బారికేడ్స్ ఏర్పాటు, లైటింగ్ తదితర ఏర్పాట్ల గురించి పరిశీలించి నిమజ్జనం చేసే సమాయానికంటే ముందు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఎఈ రామకృష్ణ, పంచాయత్‌రాజ్ ఏఈ సందిప్ రెడ్డి, విద్యుత్ అధికారి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు, మండపాల ఆర్గనైజర్స్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాపక్షం/నారాయణపేట్/ధన్వాడ: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం ఉట్కూరు మండలం పెద్ద జట్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పక్కనే ఒక చిన్న రేకుల షెడ్‌లో మధ్యాహ్న భోజనానికి వంట వండుతుండటం చూసి అసహనం వ్యక్తం చేశారు. వంట గది అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారని వారికి ఇంత చిన్న షెడ్డులో అపరిశుభ్రత మధ్య వంట వండటం ఏమిటని పాఠశాల హెచ్‌ఎంను నిలదీశారు. వెంటనే వంట గదితో పాటు పాఠశాల ఆవరణను శుభ్రం చేయించాలని సూచించారు. ఈసారి పదో తరగతి పరీక్షల కోసం అందరూ కష్టపడి చదవాలని, పండగలు ఉన్నాయని ఎక్కువ రోజులు పాఠశాలకు సెలవు పెట్టవద్దని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. వచ్చే నెల నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని, ఆ తరగతులకు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. గతేడాది సాధించిన వందశాతం ఫలితాలను ఈ సారి కూడా సాధించాలని కలెక్టర్ సూచించారు.

**అభివృద్ధి పనులను వెంటనే పనులు చేపట్టాలి**

ధన్వాడ మండల కేంద్రంలో రెండో విడత మంజూరైన జాతర పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం ధన్వాడలోని అంగన్‌వాడీ భవనం కమ్యూనిటీ మరుగుదొడ్లను నిర్మాణానికి జరిగిన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతూ పనులను ఆలస్యం చేయకుండా గడువులోగా పూర్తి చేయాలని, అధికారులను సూచించారు. ఇందులో డిఆర్‌డిఓ మొగులప్ప , డిపిఓ సుదాకర్ రెడ్డి, పేట చైర్మన్ సదాశివరెడ్డి, ఎమ్మార్వో సింధుజ, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి నాయకులు చిట్టెం మాధవరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కించి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# కేప్‌టౌన్‌లో ఫైనల్!

## డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా టీ20 నాలుగో సీజన్..

# స్వర్ణంతో మెరిసిన ఎలవెనిల్..

## కొద్దిలో కాంస్యం చేజార్చుకున్న ఘోష్



భారత యువ షూటర్ ఎలవెనిల్ వలరివన్ మరోసారి పతకంతో మెరిసింది. కజకిస్తాన్ వేదికగా జరుగుతున్న ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో టీమ్ విభాగంలో కాంస్యం గెలుపొందిన ఆమె.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత పోటీల్లో గోల్డ్ మెడల్ కొల్లగొట్టింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో గురి తప్పకుండా పాయింట్లు సాధించి పోడియం మీద మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది ఎలవెనిల్. ఇదే విభాగంలో మెహులి ఘోష్ నాలుగో స్థానంతో నిరాశపరిచింది. ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 253.6 పాయింట్లు సాధించింది. చైనాకు చెందిన పెంగ్ గ్జిన్లు (253.0 పాయింట్లు) రెండో స్థానంలో నిలవగా, కొరియా షూటర్ వొన్ ఎనుజి (231.2 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకున్నారు. తమిళనాడుకు చెందిన ఎలవెనిల్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ కేటగిరీలో మెహులీ ఘోష్, అనన్యా నాయుడులతో కలిసి కాంస్యం సాధించింది. అయితే.. వ్యక్తిగత విభాగంలో అదిరే ప్రదర్శనతో బంగారు పతకం గెలుపొందింది ఎలవెనిల్. ఇప్పటివరకూ ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు 10 పతకాలు అందుకున్నారు. ఇందులో మూడు స్వర్ణాలు, ఒక వెండి, ఆరు కాంస్యాలు ఉన్నాయి.



మూడు సీజన్లుగా అభిమానులను అలరించిన దక్షిణాఫ్రికా టీ20 లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. ఈ ఏడాది డిసెంబర్ 26 నుంచి నాలుగో సీజన్ షురూ కానుంది. మెగా టోర్నీకి సమయం దగ్గరపడుతున్నందున శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు నిర్వాహకులు. న్యూలాండ్స్‌లోని కేప్‌టౌన్ మైదానంలో సంబరంగా సీజన్‌ను ప్రారంభించనున్నారు. ఇదే వేదికపై ఫైనల్ ఫైట్ నిర్వహిస్తామని లీగ్ కమిషనర్ గ్రేమ్ స్మిత్ వెల్లడించారు. 'బెటివే ఎస్ఏ20 నాలుగో సీజన్ క్రికెట్ అభిమానులకు ఈ వేసవిలో అపరిమిత వినోదాన్ని పంచనుంది. సెప్టెంబర్ 9న ఆటగాళ్ల వేలం నిర్వహిస్తున్నాం. క్రిస్మస్ తెల్లారి.. బాక్సింగ్ డే (డిసెంబర్ 26)న మెగా టోర్నీ మొదలవ్వనుంది. గతేడాది న్యూలాండ్స్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌ల టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. అందుకే.. ఈసారి ఇదే మైదానంలో ఆరంభ వేడుకలు నిర్వహించాలనుకుంటున్నాం. ఫైనల్ మ్యాచ్ కూడా ఇక్కడే జరుగుతుంది. తొలిసారి డర్బన్‌లో క్వాలిఫయర్ మ్యాచ్‌లు ఆడించాలని భావిస్తున్నాం' అని స్మిత్ వివరించాడు. నాలుగో సీజన్‌లో ఎంఐ కేప్‌టౌన్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. తొలి రెండు ఎడిషన్లలో విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు.. మూడో సీజన్లో మాత్రం టైటిల్ వేటలో తడబడింది. నాలుగో సీజన్ విషయానికొస్తే.. ఓపెనింగ్ మ్యాచ్‌లో ఎంఐ కేప్‌టౌన్, డర్బన్స్ సూపర్ జెయింట్స్ తలపడనున్నాయి. క్వాలిఫయర్ 1 జనవరి 21న డర్బన్‌లో జరుగనుంది. జనవరి 23న సెంచూరియన్‌లో ఎలిమినేటర్.. జోహన్నెస్‌బర్గ్‌లో జనవరి 24న క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లు ఉంటాయి.

# సెలక్షన్ కమిటీలోకి కొత్త సభ్యులు..

## దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ!

భారత క్రికెట్ నియంత్రణ మండలి శుక్రవారం మెన్స్, ఉమెన్స్ జాతీయ సెలక్షన్ కమిటీల్లోని ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. సీనియర్ పురుషుల సెలక్షన్ కమిటీలో ఇద్దరు సభ్యులు, మహిళల సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులను భర్తీ చేయనున్నది. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని బీసీసీఐ కోరింది. గతంలో ఉన్న అర్హత ప్రమాణాలు ఉంటాయని బీసీసీఐ స్పష్టం చేసింది. కనీసం ఏడు టెస్టు మ్యాచ్‌లు.. లేకపోతే 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడిన అనుభవం ఉండాలని పేర్కొంది. ప్రత్యామ్నాయంగా కనీసం పది వన్డే ఇంటర్నేషనల్స్, లేకపోతే 20 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎంపికైన సెలక్టర్ల ఒప్పందం ప్రతి సంవత్సరం పునరుద్ధరించనున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఉన్న సెలెక్టర్లలో ఎవరిని భర్తీ చేయాలో ఇంకా నిర్ణయించలేదని.. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఓ బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ఇటీవల ఆసియా కప్ కోసం జట్టును ఎంపిక చేసిన ప్రస్తుత పురుషుల సెలక్షన్ కమిటీకి మాజీ ఫాస్ట్ బౌలర్ అజిత్ అగార్కర్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయనతో పాటు కమిటీలో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్ శరత్ సభ్యులుగా ఉన్నారు. అలాగే, పురుషుల జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో ఒక సభ్యుడి కోసం బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ కమిటీ అండర్22 వరకు వయస్సు గల జట్లకు క్యాంపులు, పర్యటనలు, టోర్నమెంట్లను టీమ్‌ను ఎంపిక చేస్తుంది. మహిళల జాతీయ సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రస్తుత మహిళా ప్యానెల్‌కు నీతు డేవిడ్ నేతృత్వం వహిస్తున్నారు. ఆమెతో పాటు రేణు మార్గరెట్, ఆర్తి వైద్య, కల్పనా వెంకటాచర్, శ్యామా డే షా ఉన్నారు. ఈ కమిటీ ఇటీవల స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ కోసం భారత మహిళా జట్టును కూడా ఎంపిక చేసింది. అయితే, ఇటీవల పలు నివేదికలు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలని బిసిసిఐ నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. భారత జట్టు సాధించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది.

# ఫోకస్ సైన్స్



# జీనోమిక్ పరిశోధనలో విప్లవాత్మక ఆవిష్కారం

బార్సిలోనాలోని సెంటర్ ఫర్ జీనోమిక్ రెగ్యులేషన్ (సిఆర్‌జి) సహా అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ఇటీవల భారీ ... వచ్చింది. సాంకేతిక విభాగంలో ప్రధాన మానవ జీనోమ్ రీడింగ్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి 1,67,000కి పైగా కొత్త జన్యు భిన్నాలను గుర్తించింది. 'నేచర్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయన వ్యాసం ప్రకారం, ఇప్పటివరకు తెలియని నిర్మాణాత్మక భిన్నాల సంఖ్య దాదాపు రెట్టింపైంది. డీఎన్ఏలో తొలగింపులు, నకిలీలు, చొప్పింపులు, తలకిందులు కావడం వంటి మార్పులు లక్షల కొద్దీ జెనెటిక్ అక్షరాలను ప్రభావితం చేస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. 1,019 మందికి చెందిన జన్యు నమూనాల పరిశీలనలో, వ్యక్తుల మధ్య డిఎన్ఏలో సగటు 7.5 మిలియన్ తేడాలు బయటపడ్డాయి. ప్రకృతి తనకు తానే ఎంత విస్తృతమైన జన్యు మార్పులు చేస్తుందో ఈ అధ్యయనం నిరూపిస్తున్నదని పరిశోధకులు అన్నారు. ఈ కొత్త పాన్జీనోమ్ ద్వారా వ్యక్తిగత వైద్యపద్ధతులు, అరుదైన జన్యు వ్యాధుల నిర్ధారణ, కేన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలకు చికిత్సా పరిశోధన మరింత ఖచ్చితంగా చేసుకునే అవకాశం కలుగుతుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రామాణిక మానవ జీనోమ్‌గా ఒక్క వ్యక్తి డిఎన్ఏ శ్రేణినే అధ్యయనం చేసేవారు. అయితే ఇది ప్రపంచవ్యాప్త జనాభా వైవిధ్యాన్ని ప్రతిబింబించలేదు. ఈ లోటును అధిగమించేందుకు తాజా మానవ పాన్జీనోమ్ ప్రాజెక్ట్ ముందుకు వచ్చింది. ఈ పరిశోధన 1,67,000 కొత్త నిర్మాణాత్మక భిన్నాలను గుర్తించింది. ఇప్పటి వరకు యూరోపియన్ మూలాల జన్యు నమూనాలుకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల నిర్లక్ష్యానికి గురైన ఇతర జనాభాల్లో గణనీయమైన దాగి ఉన్న వైవిధ్యం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. కదలిక లాంగ్ రీడ్ సీక్వెన్సింగ్ వాడకంలో ఉంది. ఇది వేల నుండి లక్షల్లో డిఎన్ఏ అక్షరాలను ఒకసారి చదివే సాంకేతికత, దీని ద్వారా పెద్ద డిఎన్ఏ మార్పులను ఖచ్చితంగా గుర్తించే అవకాశం లభించింది. దీని వల్ల అరుదైన జన్యు వ్యాధులను తక్కువ సమయంలో గుర్తించడం సాధ్యమవుతుంది. అనుమానిత మ్యూటేషన్ల సంఖ్యను వేలలో నుంచి వందల్లోకి తగ్గించే అవకాశం ఉంటుంది. కేన్సర్‌సహా అనేక వ్యాధుల నిర్ధారణలో వేగవంతమైన ఖచ్చితత్వం సాధించడం కూడా ఈ ప్రయోగ లక్ష్యాల్లో ఒకటి. సమగ్రంగా చూస్తే, ఈ పాన్జీనోమ్ పరిశోధనను జన్యు శాస్త్రంలోని అత్యంత విప్లవాత్మక దశగా పేర్కోవచ్చు. ఇది వైద్యరంగంలో వ్యక్తిగతీకరించిన చికిత్సలకు దారితీసే ప్రపంచ వ్యాప్త జీనోమ్ పటంగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఐస్ కోర్స్‌పై విస్తృత అధ్యయనం



అంటార్కిటికాలో సేకరించిన ఐస్‌కోర్స్ (ఐస్‌తో నిండిన ప్రాంతాల్లో లోతుగా తవ్వి, అక్కడి నుంచి సేకరించిన నమూనాలు)ను విస్తృతంగా అధ్యయనం చేస్తున్నారు. బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే తాజా ప్రకటనను అనుసరించి, అంటార్కిటికాలో 1.5 మిలియన్ సంవత్సరాల పురాతన ఐస్ కోర్స్‌ను తీసుకొని యుకెకి పంపారు. ఈ ఐస్ కోర్స్‌లను లిటిల్ డోమ్ 'సి' ప్రాంతం నుండి 2,800 మీటర్ల లోతులో డ్రిలింగ్ ద్వారా సేకరించారు. ఈ ప్రాచీన ఐస్ కోర్స్‌లో భవిష్యత్తు వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడానికి అనువుగా ఉన్న అత్యంత పురాతన వాతావరణ సమాచారాన్ని పొందగలిగే అవకాశం ఉంది. వీటిని శాస్త్రీయ విధానంలో కరగబెట్టి చేసి, ఆ సమయంలో వాతావరణంలో ఉన్న గ్యాసులు, వాయువులు, మైక్రోస్కోపిక్ సముద్ర అల్గేల ద్రవ్యాలు తదితర వివరాలను ల్యాబ్‌లలో విశ్లేషిస్తారు. ఈ డేటా 1.5 మిలియన్ సంవత్సరాల కాలవ్యవధిలో వాతావరణం ఎలా మారిందో, గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయి ఎలా ఉన్నదో చెప్పగలుగుతుంది. ఇలాంటి శాఖల సహాయంతో గ్లోబల్ క్లైమెట్ మార్పుల తీరుతెన్నులను వాటి సంభవానికి ముందుగానే అర్థం చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాల్లో ఇది ముందడుగుగా బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే పేర్కొంది. ముఖ్యంగా, సుమారు 1 మిలియన్ సంవత్సరాల క్రితం గ్లేషియల్‌ఇంటర్గ్లేషియల్ ఆవృతిలో జరిగిన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా అనేకానేక పర్యావరణ సమస్యలకు పరిష్కారం కనుగొనే అవకాశాలు ఉన్నాయి. 41,000 సంవత్సరాల సైకిల్ నుండి 100,000 సంవత్సరాల సైకిల్‌కు గ్లేషియల్‌ఇంటర్గ్లేషియల్ ఆవృతులు మారాయన్న ప్రధాన శాస్త్రీయ ప్రశ్నకు సమాధానం కనిపించవచ్చని భావిస్తున్నారు. ఈ పురాతన ఐస్ కోర్స్ ద్వారా భూగోళ వాతావరణ సమాచారంలో అనేక విప్లవాత్మక వివరాలు వెలుగులోకి రానున్నాయి. ఇవి భవిష్యత్ వాతావరణ మార్పులను అంచనా వేయడంలో కీలకం అవుతాయి.



# రీల్



# 'భద్రకాళి' నుంచి లవ్ సాంగ్ రిలీజ్

విజయ్ ఆంటోనీ మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి' వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్ మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ మారెనా ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. విజయ్ ఆంటోని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన లిరిక్స్ హత్తుకునేలా వున్నాయి. అభిజిత్ అనిల్‌కుమార్ వోకల్స్ మరింత ఎమోషన్ ని యాడ్ చేశాయి. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది.

# మిస్టర్ రోమియో టీజర్ విడుదల

శ్రీలక్ష్మి ఆర్ట్స్, మీడియా 9 క్రియేషన్స్ బ్యానర్ పై నేతి శ్యామ్ సుందర్ నిర్మాతగా మనోజ్ కుమార్ కటోకర్ దర్శకత్వం వహించిన మ్యూజికల్ ఫిలిం మిస్టర్ రోమియో. ఏ రీల్ లైఫ్ స్టోరీ అనే ట్యాగ్ లైన్ తో రూపొందించారు. గురుచరణ్ నేతి, జుహీ భట్, అమిషి రాఘవ్ హీరో హీరోయిన్స్‌గా నటించారు. ఎస్కే ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్ పురోహిత్ ముఖ్య పాత్రల్లో నటించారు. చైతన్య గరికిన స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. ప్రజ్వల్ క్రిష్ సంగీతం సమకూర్చారు. ఈ మూవీ టీజర్ రిలీజ్ చేసిన హీరోయిన్ శ్రియా శరణ్ టీమ్ కు బెస్ట్ విషెస్ చెప్పారు. టీజర్ చాలా బాగుంది. మూవీ కూడా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గురు చరణ్ అద్భుతంగా నటించారు. తనలో మంచి నటుడు ఉన్నాడు. టీజర్ లో కార్తీక్‌గా కనిపించిన చరణ్ నటన బాగుంది. 'నాకు రియల్ లవ్ కావాలి. రీల్స్ లవ్ కాదు' అని చరణ్ చెప్పే డైలాగ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. హీరోగా తను మరిన్ని సినిమాలు తీయాలని కోరుతూ ఆల్ ది బెస్ట్. డైరెక్టర్ అని శ్రియా చెప్పారు.




# సమంత సరికొత్త అవతారం..



టాలీవుడ్, కోలీవుడ్ పరిశ్రమల్లో స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటిన సమంత ఇప్పుడు మరో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతుందని టాక్. ఇప్పటికే నటిగా తన టాలెంట్ నిరూపించుకున్న సమంత, తాజాగా దర్శకురాలిగా మారే ఆలోచనలో ఉన్నారు అనే వార్తలు సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. సమంత ప్రస్తుతం ఓ క్యూట్ లవ్ స్టోరీ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసిందని, కథకు తానే డైరెక్షన్ వహించాలను కుంటోందని సమాచారం. ఇప్పటికే కొన్ని యంగ్ అప్‌కమింగ్ ఆర్టిస్ట్లతో డిస్కషన్స్ జరిపిందని టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కూడా తన సొంత బ్యానర్‌లోనే నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు టాక్ ఇప్పటికే సమంత 'శుభం' అనే హర్రర్‌కామెడీ సినిమాతో ప్రొడ్యూసర్‌గా అడుగుపెట్టి, తన కెరీర్‌లో ఓ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు డైరెక్షన్ వైపు అడుగులేస్తోంది అంటే, నటనతో పాటు ఫిల్మ్‌మేకింగ్‌పై ఉన్న ఆమె ప్యాషన్ స్పష్టంగా తెలుస్తోంది. 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్', 'హనీ బన్నీ' వంటి ఇంటర్నేషనల్ ప్రాజెక్టుల్లో సమంత నటనతో ఆకట్టుకుంది. యాక్షన్ రోల్స్‌లో తన స్థాయిని పెంచుకున్న సమంత, ఇప్పుడు దర్శకురాలిగా ఎలాంటి నూతన కోణాన్ని చూపిస్తుందో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కానీ సమంత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఆమె అభిమానులు మాత్రం ఈ వార్తలపై ఉత్సాహంగా స్పందిస్తున్నారు. డైరెక్టర్ సమంత ఏ విధంగా తన టాలెంట్‌ను చూపుతుందో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నటిగా, నిర్మాతగా, ఇప్పుడు దర్శకురాలిగా కూడా సమంత తన టాలెంట్‌ను పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోందంటే ఆమె కెరీర్ మరో కీలక మలుపు తిరగబోతోందన్నమాట . మరి ఇది గాసిపో, నిజమా అనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది. మరోవైపు సమంతా రక్త్ బ్రహ్మాండ అనే వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. రాజ్ అండ్ డికె పర్యవేక్షణలో ఇది రూపొందుతుండగా , ఏవో ఆర్థిక కారణాల వల్ల ఆగిపోయిందనే ప్రచారం జరిగింది కానీ అలాంటిదేమి లేదని ఇటీవలే ప్రొడ్యూసర్లు క్లారిటీ ఇచ్చారు. అయితే షూట్ తిరిగి మొదలయ్యింది లేనిది అనే దానిపై క్లారిటీ లేదు. మరో వైపు మా ఇంటి బంగారం అనే సినిమాని సామ్ గతంలోనే ప్రకటించింది. దీనికి నందినిరెడ్డి దర్శకత్వం వహించే ఛాన్స్ ఉంది.

# ఆయనతో నటించడం అదృష్టంగా భావిస్తా..

## ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. జాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ ఒక వ్యక్తి కాదు ఓ శక్తి. ఆయన ఒరిజినల్‌గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్యబోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, 'బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం'' అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ''ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్యబోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, 'విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



# 'మన శంకరవరప్రసాద్ గారు' గ్లింప్స్ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి, దర్శకత్వంలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మాతలుగా షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ మూవీకి 'మన శంకరవరప్రసాద్ గారు', అనే టైటిల్ ఖరారు చేశారు. చిరంజీవి జన్మదినం సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. చిరంజీవి కెరీర్‌లో ఇది 157వ సినిమా. ఈ చిత్రానికి 'మన శంకరవరప్రసాద్ గారు' అనే టైటిల్ పెట్టి 'పండగకి వస్తున్నారు' అనేది ట్యాగ్‌లైన్ పెట్టారు. చిరంజీవి కారులో పవర్ ఫుల్ ఎంట్రీ ఇస్తూ, సిగరెట్ వెలిగిస్తూ, తన ట్రేడ్ మార్క్ స్వాగ్‌లో కమాండోల పక్కన నడుస్తుండగా గ్లింప్స్ ప్రారంభమవుతుంది. సిగరెట్ విసిరేస్తున్నప్పుడు టైటిల్ రివిల్ అవుతుంది. విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్ ఫ్యాన్స్‌ని మరింత సర్ ప్రైజ్ చేసింది. డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిరంజీవి ఎవర్ గ్రీన్ చరిస్మాని, స్టయిల్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ మెగా చరిస్మా అదిరిపోయింది. చివర్లో వచ్చే గుర్రం సీన్ అయితే మైండ్‌బ్లోయింగ్. ఆ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే బాస్.. బాస్ చాంట్స్ క్యారెక్టర్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లాయి. అందులోనే మరో సర్‌ప్రైజ్ రౌడీ అల్లుడులోని కల్ట్ సాంగ్ లవ్ మీ మై హీరోను భీమ్స్ సిసిరోలియో కొత్తగా రీమిక్స్ చేయడం విశేషం.

సినిమాటోగ్రాఫర్ సమీర్ రెడ్డి కెమెరా వర్క్ అదిరిపోయింది. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌ని హీరోయిజంతో ఎలివేట్ చేస్తూ టాప్ లుక్ ఇచ్చారు.. మెగా ఫ్యాన్స్‌కి, సినిమా లవర్స్‌కి ఈ గ్లింప్స్ పర్ఫెక్ట్ బర్త్‌డే గిఫ్ట్. మెగాస్టార్ ఇంత యంగ్, చార్మింగ్ లుక్‌లో కనిపించడం సెలబ్రేషన్‌లా మారిపోయింది. అంతే కాదు వెంకటేశ్ వాయిస్ ఓవర్ కూడా మరింత స్టార్ అట్రాక్షన్ ఇచ్చింది. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి తమ్మిరాజు ఎడిటర్‌గా, ఏ.ఎస్. ప్రకాశ్ ఆర్ట్ డైరెక్టర్. ఎస్. కృష్ణ, జి.ఆదినారాయణ కోరైటర్స్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తారు.

ఈవెంట్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ. చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు. చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఆయన లుక్ పరిచయం చేయాలనుకున్నాం. గ్లింప్స్‌కి రెస్పాన్స్ అదిరిపోయింది. చిరంజీవి గారి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన కం బ్యాక్ తర్వాత మెగా స్వాగ్ చూడాలని ఒక కోరిక ఉండేది. నాకు ఎప్పుడు ఆ అవకాశం వస్తుందని ఎదురు చూశాను. ఫైనల్‌గా ఆ అవకాశం వచ్చింది. చిరంజీవిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, ఎంటర్టైన్మెంట్ అన్ని అద్భుతంగా కుదిరాయి. చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్ లో నుంచి మేము శంకర వరప్రసాద్ తీసుకుని ఈ సినిమాలో క్యారెక్టర్‌కి పెట్టడం జరిగింది. దాన్నే.. మన శంకరవరప్రసాద్ గారు'గా చేసి సినిమాకి టైటిల్‌గా పెట్టాం. క్యాప్షన్ పండగకి వస్తున్నారు. గింప్స్‌కి విక్టరీ వెంకటేష్ వాయిస్ ఇచ్చారు. ఈ సందర్భంగా విక్టరీ వెంకటేష్‌కి థాంక్యూ. ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. వెరీ సూన్ ఎంట్రీ కూడా ఇవ్వబోతున్నారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కాంబో ఎలా ఉంటుందో ఈసారి పండక్కి చూస్తారు అని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను ఇక్కడికి వచ్చినందుకు చాలా గర్వపడుతున్నాను. అనిల్ రావిపూడికి జీవితాంతం కృతజ్ఞతతో ఉంటాను అని అన్నారు.

# సినిమా రైట్స్ దోపిడీ..

## నిర్మాతల ఆవేదన



'ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు' సినిమా నిర్మాణంలో నిర్మాతలు కే.మురళి (శరత్ వర్మ), బి.ఆనంద బాబు తమపై పెద్ద మోసం జరిగిందని మీడియా ముందుకు వచ్చారు. 'సినిమా కోసం మేము రూ.2 కోట్లు పెట్టుబడిగా పెట్టాం. మొత్తం ఖర్చు మేమే భరించాం. తిరిగి ఇవ్వలేకపోవడంతో సంబంధిత వ్యక్తి 2024 సెప్టెంబర్ 12న మా పేర్లపైకి సినిమా రైట్స్, కాపీరైట్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీస్ అన్నీ ఇష్టపూర్వకంగా ఇచ్చాడు. ప్రస్తుతం సినిమా రిలీజ్ పనులు కొనసాగుతున్నాయి. కానీ సహకరించాల్సిన రామకృష్ణ తోట మాపై విశ్వాస ఘాతుకం చేశాడు. సినిమా తనదేనని ప్రకటించి, అనుమతి లేకుండా టైటిల్, పోస్టర్లను పత్రికల్లో ప్రచురించాడు. ఇది మా హక్కులపై దాడి, మోసం. ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా ప్రతిష్ట కూడా దెబ్బతిన్నది' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'రామకృష్ణ తోటపై ఐపిసి 406, 420 (మోసం, విశ్వాస ఘాతుకం) సెక్షన్ల కింద, అలాగే కాపీరైట్ చట్టం 1957 ప్రకారం కేసులు నమోదు చేస్తాం. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం' అని నిర్మాతలు చెప్పారన్నారు. నిర్మాత మండలి మాకు న్యాయం చేయాలని కోరారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## లేబర్ ఐడి కార్డుల అందజేత



**ప్రజాపక్షం/శంషాబాద్ :** శంషాబాద్ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లకు లేబర్ ఐడీ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఎలక్ట్రీషియన్ సంఘం అధ్యక్షుడు చిన్న గండు భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎలక్ట్రీషియన్ లేబర్ కార్డు తీసుకోవాలన్నారు.. భవిష్యత్‌లో కార్మికులకు సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు పొందడానికి ఈ కార్డులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోనమొల్ల సంజీవ, కె.బ్రహ్మం, అంకిత, కొల్లూరు హరికృష్ణ, ప్లేబోటమీ, శంషాబాద్ కార్మికులు పాల్గొన్నారు.

## శిల్పాకళా వేదికలో అలరించిన భరతనాట్య నృత్యాలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని శిల్పాకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన ఆరంగేట్ర ప్రదర్శనలో అక్కా, చెల్లెల్లు ప్రదర్శించిన భరతనట్య నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి. భరతనట్య గురువు సంతోష్ కుమార్ తమంగ్ పర్యవేక్షణలో కొత్తకాపు హర్షితరెడ్డి, కొత్తకాపు రుచితరెడ్డిలు నృత్యించి మన్ననలు అందుకున్నారు. నృత్యప్రదర్శనలో భాగంగా షణ్ముఖ కౌతం, అలరింపు, జతిపనర్వం, శబ్ధం, పదవర్ణం, నటనం, ఆడినార్, రామచంద్ర భజన, తిల్లాన అంశాలను భరతనట్య నృత్య ప్రదర్శనలో ప్రదర్శించి శిల్పాకళావేదిక కు వీచ్చేసిన సందర్శకులను అలరించారు. నాట్యం పట్ల ఇష్టం, గౌరవం, సాధన పట్ల ఏకాగ్రతలను వారి నృత్యం ద్వార చూపించారంటూ కర్ణటిక్ సంగీత గురువు డాక్టర్ మీనాక్షీ పద్మనాభం వారిని కొనియాడారు. కార్యక్రమంలో హర్షిత, రుచితల తల్లిదండ్రులు గాయత్రి, జగన్మోహన్ రెడ్డి,భరతనాట్య గురువు డాక్టర్ ఇందిరా హేమ, కూచిపూడి నట్య గురువు డాక్టర్ విజయ్‌పాల్ పతోత్, వోకల్స్ జయకుమార్ భరద్వాజ, గౌతమ్, గోపాలకృష్ణ, రాయప్రోలు సుధాకర్, వెంకటేషం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ఉత్సవాల నిర్వహణ

ఎల్‌బి నగర్ అడిషనల్ డిసిపి కోటేశ్వర్‌రావు




**ప్రజాపక్షం/హయత్ నగర్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎల్‌బి నగర్ అడిషనల్ డిసిపి కోటేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం హయత్ నగర్ పోలీస్ సిబ్బంది వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కాలనీ సంక్షేమ సంఘాలు యువజన సంఘాల సంయుక్త సమావేశానికి కోటేశ్వర్‌రావు ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు మంటపాల నిర్వాహకులు పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. సమావేశంలో సిఐ నాగరాజ్‌గౌడ్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, నర్సింహా పోలీస్ సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాలను కూల్చిన అధికారులు



**ప్రజాపక్షం/గండిపేట:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గిరిగిరి గడ్డ ప్రాంతంలోనీ ఆరోవ వార్డులో రోడ్డుపై అక్రమంగా దుకాణాలను నిర్మించి వ్యాపారాలు చేస్తున్న సముదాయాలపై శుక్రవారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణి హారిక తన బృందంతో కలిసి పోలీస్ బందోబస్తు మధ్య జెసిబిల సహాయంతో అక్కడికి చేరుకొని అక్రమంగా రోడ్డును ఆక్రమించి దుకాణాలను నడుపుతున్న వాటిని అధికారులు కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో అధికారులకు స్థానికుల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో పోలీసులు అదుపు చేశారు సుమారు 14 దుకాణాలను నేలమట్టం చేశామని టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లపై అక్రమంగా దుఃఖనాలు పెట్టుకుని వ్యాపారాలు చేస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్. ఐ సరిత, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం , వార్డ్ అధికారులు జవాన్లు పాల్గొన్నారు.

## సెక్రటేరియట్ ముట్టడిలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి బిజెపి కార్పొరేటర్లతో కలిసి సెక్రటేరియట్‌ను ముట్టడిలో మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, జి హెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజా సమస్యలు పెరుగుతున్నా, ప్రభుత్వం మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముట్టడి కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, సాయి రామ్ గౌడ్, సోమనాథ్, ముత్యం రెడ్డి, రమేష్ చారి, జయ తేజ, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపురం గ్రామ శివారులో పనుల జాత కార్యక్రమంలో భాగంగా ఉపాధి మహాలింగాపురం గ్రామానికి చెందిన బోడ వెంకటయ్య కు ఉపాధి హామీ పథకం కింద మంజూరైన కోళ్ల షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ, గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, శంకర్ పల్లి పిఎసిఎస్ డైరెక్టర్ కాడి గారి రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, చంద్రయ్య, ఎస్. ప్రవీణ్ కుమార్, బొల్లారం వెంకటరెడ్డి, కె. గోపాల్, చేకూర్త గోపాల్ రెడ్డి, తహసీల్దార్ సురేందర్, ఇంచార్జ్ ఎంపి డిఒ గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ చర్యలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై డిసిపిలు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనరులు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయనున్నందున, వినాయక మంటపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించాలని, సమస్యలు ఎక్కువగా ఉన్నచోట భారీ బందోబస్తు కల్పించాలని, సిసి కెమెరాలు ఏర్పాట్లు చేయాలని, భారీ కేడింగ్, బందోబస్త్, మెడికల్, సానిటేషన్, కంట్రోలింగ్ రూం తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో వేలాడే తీగలు, వంగి ఉన్న చెట్లు, తదితర వాటిని తొలిగించాలన్నారు. చెరువుల వద్ద క్రేన్‌లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మహేశ్వరం డిసిపి సునితారెడ్డి, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, శంషాబాద్ అడిషనల్ డిసిపి కె.రామ్‌కుమార్, మాదాపూర్ అడిషనల్ డిసిపి సాయిరామ్, ఆర్డీఓలు అనంత రెడ్డి, చంద్రకళ, సరిత, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

భారీవర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతోపాటు సోమవారం నుండి ఇంటింటికి జ్వరాల సర్వేను నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో పారిశుద్ధ్యం, వనమహోత్సవం, తాగునీటి వసతి, ఇందిరమ్మ ఇళ్లపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యఅధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, గ్రామాలలో, మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం పనులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో పర్యటించి పైప్ లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. వన మహోత్సవంపై సమీక్షిస్తూ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించేందుకు శాఖల వారీగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షిస్తూ గ్రౌండింగ్ చేసి బేస్మెంట్ లెవెల్ వరకు వచ్చిన ఇండ్లకు పేమెంట్ త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ, ఆస్పలిగూడ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు ఆధేశాలు జారీ చేసిన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారిగా అమలు చేస్తున్నట్లు వివరించారు. గత బిఆర్ఎస్ పాలనలో రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి ద్వారా రెవెన్యూ సదస్సులు పెట్టి రైతుల దగ్గరకు అధికారులు వెళ్లి భూ సమస్యలను పరిష్కరించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అపర్ణగుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, సీనియర్ నాయకులు దండు రాహుల్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



# సమాజాభివృద్ధికి చేసిన పనులతోనే పేరుప్రతిష్టలు



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజ అభివృద్ధికి చేసిన పనులే జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సమీపంలో ఉన్న శ్రీ భవాని మాత దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భవాని మాత దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసిందని వివరించారు. ఈ ప్రాంత మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు దేవాలయ అభివృద్ధికి విరాళాలు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.కొత్తూరు మాజీజడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి రూ.5లక్షలు, కొందుర్గు సింగిల్ విండో చైర్మెన్ దామోదర్ రెడ్డి రూ.2లక్షలు, మరికొందరు రెండు లక్షల చొప్పున విరాళాలను ప్రకటించారు. మొత్తం రూ.21లక్షలు అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో దాతలు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ నరేందర్, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ ముత్యాల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, విశాల విశ్వం, లత శ్రీశైలం గౌడ్, కృష్ణవేణి, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, బుడ్డ నర్సింహ్మా ముదిరాజ్, శ్రీనునాయక్, ముబారక్, ఖదీర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు గౌడ్, ఎంపిడిఒ బన్సీలాల్, వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్ పాల్గొన్నారు.

### యూరియా కొరత లేకుండా చూడండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి

యూరియా కొరత లేకుండా చూడాలంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని, దానికి అనుగుణంగా పంపిణీ చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పంధించినట్లు వివరించారు. అదే విధంగా జిల్లేడు చౌదరిగూడ మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డును మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు స్పంధిస్తూ త్వరలోనే మంజూరు చేసేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి హామీ వచ్చినట్లు తెలిపారు.

# యూరియా కోసం అన్నదాతలకు తప్పని తిప్పలు

ఫరూక్‌నగర్ సింగిల్ విండో వద్ద అన్నదాతల క్యూలైన్



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** యూరియాను సకాలంలో సరఫరా చేయండి సారూ అంటూ అన్నదాతలు సింగిల్ విండో కార్యాలయం వద్ద క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ సింగిల్ విండో కార్యాలయంలో వివిధ గ్రామాల అన్నదాతలు పెద్ద ఎత్తున క్యూలైన్‌లో యూరియా కోసం వేచి ఉన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియాను అన్నదాతలకు అవసరం ఉన్న మేరకు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. అదును దాటితే యూరియాతో తమకు ఎలాంటి పనులు ఉండవని, ప్రస్తుతం వరినాట్లు వేసే సీజన్‌లోనే యూరియా ఎక్కువగా అవసరం ఉంటుందని వివరించారు. ఇప్పటికే అనేక మార్లు ఫరూఖ్‌నగర్ సింగిల్ విండో కార్యాలయానికి వచ్చివెళ్ళామని, ఇది వస్తుంది..అదిగో వస్తుందంటూ అధికారులు మాటలు చెప్పి దాట వేస్తున్నారే తప్పా ఆశించిన స్థాయిలో యూరియా ఇవ్వడం లేదని రైతులు మండిపడ్డారు. ఇదే పరిస్థితి నందిగామ, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో సైతం కొనసాగుతుందని అన్నదాతలు పేర్కొన్నారు. ప్రభుత్వం మాత్రం యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, అన్నదాతలకు అవసరం ఉన్న మేరకు ఇస్తున్నాయని ప్రకటనలు చేస్తున్నారే తప్పా క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో స్పంధించి యూరియాను కొరత లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆధ్యాత్మికత కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత అభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. లక్ష్మీ నర్సింహ్మాస్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన తెలిపారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామ సమీపంలో ఉన్న శ్రీ పానకాల లక్ష్మీ నర్సింహ్మా స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కొలిచే భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తున్న శ్రీ లక్ష్మీ నర్సింహ్మాస్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండే విధంగా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. స్వామివారి కళ్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతాపూర్ మాజీ సర్పంచ్ వరలక్ష్మి ప్రభాకర్‌రెడ్డి, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, కాకునూరు మాజీ సర్పంచ్ యారం శేఖర్‌రెడ్డి, నేతలు నాగిళ్ల వెంకటేష్, సాజిద్, నరేందర్‌రెడ్డి, కొత్తపేట జగన్‌రెడ్డి, యాదయ్య గౌడ్, క్రిష్ణ, రజినీకాంత్ గౌడ్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు.



## ర్యాలీ నిర్వహించిన వ్యాపారస్తులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మార్వాడీలకు వ్యతిరేకంగా వివిధ వ్యాపారస్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం తెలంగాణ జెఏసి మార్వాడీలకు వ్యతిరేకంగా బంద్ పిలుపునివ్వటంతో ఇబ్రహీంపట్నంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరాల రమేష్, మడుపు వేణుగోపాల్ ఆధ్వర్యంలో వివిధ వ్యాపారస్తులు పాల్గొన్ని మార్వాడీ హటావో తెలంగాణ బచ్చావో, మార్వాడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసుకుంటు సాగర్ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ నార్త్ ఇండియా నుండి తెలంగాణకు మార్వాడీలు వలస వచ్చి స్థానికులకు ఉపాధి, ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండ్రు రఘుపతి,బర్తాకి జగన్,కిరణప్ప,ఆబేద్‌షబీర్,సాగర్,యాదగిరి,వివిధ వ్యాపారస్తులు పాల్గోన్నారు.

**కొందుర్గు:** మార్వాడి గో బ్యాక్ అంటూ నిర్వహించిన బంద్ విజయవంతమైంది. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. మార్వాడి గో బ్యాక్ అనే బంద్‌ను కొందుర్గు విశ్వకర్మ సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చి వ్యాపారం చేస్తుండటంతో ఈ ప్రాంత వ్యాపారస్తులకు పనులు లేకుండా పోయాయని విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు కె.లక్ష్మీ నారాయణ చారి వివరించారు. ఇతర రాష్ట్రాల నుండి మార్వాడీలు వచ్చి అన్ని వ్యాపారాలను చేస్తుండటంతో తమకు పనులు లేకుండా పోతున్నాయని, దాంతో నిరుద్యోగులుగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పాండు, కోశాధికారి మాణిక్య ప్రభు చారి, ఆంజనేయులు చారి, దామోదర్ చారి, ప్రభాకర్ చారి, శ్రీనివాస్ చారి, శ్రీకాంత్ చారి, కృష్ణామాచారి, భీమాచారి తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో భయపడేది లేదు

**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రభుత్వ అక్రమ అరెస్టులతో భయపడే ప్రసక్తి లేదని, ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్దంగా ఉన్నట్లు బిజెపి కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి వివరించారు శుక్రవారం జిహెచ్‌ఎంసిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బిజెపి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసనకు పిలుపునిచ్చారు. దాంతో పోలీసులు ముందస్తుగా ఇళ్ల వద్దకు చేరుకొని బిజెపి శ్రేణులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# విద్యార్థుల్లో సేవాభావం పెంచేందుకు కృషి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు వారిలో సేవాభావం పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట నాగార్జున మాంటెస్సోరీ, ఐఐటి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాధ ఆశ్రమానికి మూడు క్వింటళ్ల బియ్యం, 30 కేజీల కందిపప్పు విరాళంగా అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ విఠల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఇటీవల పాఠశాలలో ఛారిటీడే నిర్వహించారు. విద్యార్థులు సేకరించిన సరుకులకు తోడు యాజమాన్యం మరిన్ని వస్తువులు కలిసి ఆశ్రమానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో సేవా భావాన్ని పెంపొందించడానికి తమ పాఠశాలలో ఏడాదిలో ఒక రోజు ఛారిటీ డే నిర్వహిస్తామన్నారు. సమాజంలో అభాగ్యుల పట్ల ప్రతిఒక్కరు సేవా భావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, ఇంచార్జ్ దుర్గ, రాధిక, సంధ్య, ప్రశాంతితో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమర్చిన శాశ్వత దంతాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దంతాలకు సంబంధించి అతి క్లిష్టమైన అరుదైన చికిత్స ద్వారా శాశ్వత దంతాలను ప్రభుత్వ దంత వైద్య నిపుణుడు డాక్టర్ వినోద్ విజయవంతంగా చేసారు. పూర్తిగా కుళ్లిపోయిన 41 ఏళ్ల మహిళకు రూట్ కెనాల్ చేసి 28 మెటల్ సిరామిక్ శాశ్వత దంతాలను అమర్చటం ద్వారా దంత రోగికి శాశ్వత పరిష్కారం లభించేలా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయటం తొలిసారని, దంత వైద్యసేవలను అవసరం ఉన్నవారు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి కోరారు. ఈ సందర్భంగా దంత వైద్యుడు డా.వినోద్‌ను ఆమె అభినందించారు.



## వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

### తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** తూంకుంట మున్సిపల్ పరిధిలోని వివిధ చెరువుల వద్ద వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిమజ్జన ఏర్పాట్లపై తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన వసతులపై అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వినాయక నిమజ్జనాలకు క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయుటకు పలు శాఖల అధికారులకు సూచనలు చేశామని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో వినాయక నిమజ్జన ఏర్పాట్లను చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సునీత, ఇరిగేషన్ ఎఇఇ రాజీవ్ కుమార్‌సింగ్, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, విద్యుత్ ఎఇ రాఘవేంద్ర, మెడికల్ ఆఫీసర్ విజయనిర్మల, ఆర్‌అండ్ బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 50 శాతం రిజర్వేషన్ల కొరకు ఉద్యమిస్తాం : ధూళిపాళ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నాగోల్‌లోని డాంగే భవన్‌లో జరిగిన బిసి ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టకుండా



గత 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు ఎట్టకేలకు దిగి వచ్చి కులగణన చేపడుతామంటూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయటం బిసిల తొలి విజయమన్నారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయటం, విద్యా ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ ఎత్తివేయటం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బిసిలకు మినహాయింపు ఇవ్వటం తమ డిమాండ్లని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, పిల్లుట్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో యువకుడి మృతదేహం లభ్యం


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పెద్ద చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకూరి రసూల్ (25) తమ్మిదపాడు గ్రామం, వింజమురు మండలం, నెల్లూరు జిల్లాకు చెందిన రసూల్ గుండ్లపోచంపల్లిలోని మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా కుటుంబీకులతో కలిసి నివాసం ఉంటున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువులో



ఒక మగవ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతు కనిపించిందని పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు శవాన్ని బయటకు తీసి చెరుకురి రసూల్‌గా గుర్తించారు. ప్రేమ వ్యవహారమా లేక ఇతర కారణాలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## తెలంగాణ దళిత సంఘం అధ్యక్షుడుగా సాయిబాబా

**ప్రజాపక్షం/చర్లపల్లిః** తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కమిటి మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా సానాది సాయిబాబా నియామకం అయ్యారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ దళిత సంఘాల ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం సానాది సాయిబాబాను అధ్యక్షులుగా నియమిస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల హక్కుల



సాధనకోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సునీల్, రాష్ట్ర యువజన విద్యార్థి సంఘం ఇన్‌చార్జ్ వనం రమేష్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు బయ్యారం రాజన్న, తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగునీరు... పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** కాలనీలలో గత కొన్ని నెలలుగా మురుగు నీరు ప్రవహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఠాకూర్ బస్తీ నుండి పోచమ్మ దేవాలయం వీధిలో గత ఆరు నెలలుగా డ్రైనేజీ మురుగు నీరు ఇండ్ల మధ్య ప్రవహిస్తుండడంతో దుర్వాసన రావడం జరుగుతుందని మురుగువల్ల దోమలు వ్యాప్తి చెంది అనేక రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిపా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టి సారించి ఇండ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## జర్నలిస్టుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### టియుడబ్ల్యుజె రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం / మేడ్చల్ మాల్కాజ్‌గిరి :** ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని, లేనట్లయితే ఆందోళన తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి అన్నారు. కీసరలో గురువారం జరిగిన టియుడబ్ల్యుజె మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్‌ల నియ మ నిబంధనలను తక్షణమే విడుద ల చేసి కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లాలో మన సంఘం బలోపేతంగా ఉందని రాష్ట్ర కమిటీ కూడా అభినందించిందని తెలిపారు. నూతన సభ్యత్వ నమోదు ప్రక్రియను మండలా లు, నియోజకవర్గాల వారీగా చేపట్టాలని సూచించారు. వర్కింగ్ జర్నలిస్టులందరినీ కూడా సభ్యులుగా చేర్చుకొని సంఘం పటిష్టతకు పాటుపడాలన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ వరకు సభ్యత్వ నమోదులను పూర్తి చేసి నూతన కమిటీ ల ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టాలని సూచించారు. జర్నలిస్టులు అంతా ఐకమత్యంగా ఉండి పోరాటం చేస్తేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీ సభ్యులంద రూ గౌరవించి అందుకు అనుగుణంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకత్వం సూచించే సూచనల మేరకు జిల్లా కమిటీ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, రామకృష్ణ, బాల్రెడ్డి, రచ్చ శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, చంద్రమౌళి, విజయ్, గోవింద్, రాజిరెడ్డి, ఆదిమూలం శ్రీనివాస్, మల్లేష్ గౌడ్, బాలరాజు, నాగేంద్రచారి, ఏ వి శ్రీధర్ రావు, దయాకర్ రెడ్డి, రమేష్, లతోపాటు వివిధ ప్రెస్ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బురాన్‌పల్లిని అభివృద్ధి చేస్తా

### స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ మండల పరిధిలోని బురాన్‌పల్లి గ్రామంలో పల్లెల్లో పను ల జాతర 2025లో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 20లక్షల వ్యయంతో చేపట్టే బురాన్‌పల్లి గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పిడబ్లుడి రోడ్డు నుండి బురాన్‌పల్లి వరకు 63లక్షల తో చేపట్టిన నూతన బిటి రోడ్డుకు బురాన్‌పల్లి నుండి ధన్నారం వరకు 63లక్షలతో నూతనంగా చేపట్టిన బిటి రోడ్డులకు సభాపతి ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలను ఉద్దేశించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటు ముందుకు వెళుతుందన్నారు. ఇంకా ప్రజలకు ఇచ్చిన హామీలైన మహాలక్ష్మి పథకం కింద ఇంటి యాజమనికి 2500 ఆర్థిక సహాయం కళ్యాణలక్ష్మి కి ఇవ్వాల్సిన తులం బంగారం త్వరలోను చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం 6వేల కోట్ల అప్పు చేసిందని వీటికి 6500కోట్ల వడ్డీ చెల్లిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన వెంటనే రేషన్‌కార్డు లు, ఇండ్లు, సన్న బియ్యం సరఫరా చేయడంతో పాటుగా పెన్షన్లను కూడా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రద్దుచేసిన అసైన్మెంట్ కమిటీని పునరుద్ధరించి భూములు లేని పేదలకు భూములు ఇచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ తెలిపారు. పంట పొలాలకు వెళ్లే దారులకు రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారికి స్పీకర్ ఆదేశించారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. మహిళ సంఘాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఉపాధి హామీ కింద ఉద్యానవన మొక్కలు నాటేందుకు ప్రొసీడింగ్ కాపీలను స్పీకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ వినయ్‌కుమార్, ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్టిఎ సభ్యులు జాఫర్, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### జినోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు, యువకులు ప్రశాంతంగా జరుపుకోవాలని జినోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్య అన్నారు. అలియాబాద్ చౌరస్తాలోని ఓ గార్డెన్‌లో బాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి సమావేశాన్ని నిర్వహించారు. తూంకుంట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటిల్లో గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా గణేష్ మంటపాల నిర్వాహకులను ఉద్దేశించి ఇన్‌స్పెక్టర్ గురువయ్య మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ప్రతి మంటపానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ స్తంబాలు, తీగలు లేనిచోట వేదికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్లు బ్లాక్ లేకుండా దారి ఉండేటట్లు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. డిజెలకు అనుమతులు లేవని ఎవరైన నిబంధనలను అతిక్రమి స్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్, శామీర్‌పేట డిఐ రాజు, తూంకుంట మున్సిపల్ డిఇ సునీత, మూడుచింతలపల్లి మున్సిపల్ మేనెజర్ ఉషా, ఎస్‌ఐలు దశరథ, శశివర్ధన్‌రెడ్డి, బాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం

### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరుః** కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆహయంలోనే రైతులకు ఎంతో మేలు చేకూరిందని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూరు నియోజకవర్గం పెద్దేముల్, యాలాల మండలలోని బండపల్లి, సిద్దన్నమడుగు తాండ, ఇందూరు తదితర గ్రామాలలో పర్యాటించిన ఎంఎల్‌ఎ పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు గావించారు. అంతకు ముందు ఆయా గ్రామాల లో మొక్కలు నాటడంతో పాటు పశువుల షెడ్లు, మేకల షెడ్ల నిర్మాణానికి రైతులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. గతంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చిన ఘతన తమ ప్రభుత్వతానికే దక్కిందని, పదేండ్లు బిఆర్‌ఎస్ పాలనలో గ్రామాలలో ఒక్క ఇల్లు ఇచ్చిన పాపన పోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాతనే సిఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని కోరి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. మరోమారు రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చి ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్‌లు అంజయ్య, పట్లోళ బాల్‌రెడ్డి,తట్టేపల్లి పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, సీనియ ర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, పిఎసిఎస్ డైరక్టర్ నరేందర్, నాయకులు కిరణ్, ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, బొర్ర నర్సిములు, మండల స్పెషల్ ఆఫిసర్ సత్యనారాయణ,ఎంపిడిలు, వివిధ శాఖల అధికారులు, తదితర నాయకులు పాల్గొన్నారు

## అహ్మద్‌గూడ 2 బిహెచ్‌కె కాలనీకి మహర్దశ

* పనులు చేపట్టాలంటూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
* నాలుగు రోజుల పాటు కాలనీ వాసుల నిరాహారదీక్షల ఫలితమే




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** దశల వారీగా దమ్మాయిగూడలోని అహ్మద్‌గూడ 2 బిహెచ్‌కె కాలనీ సమస్యలను పరిష్కరిస్తానన్న హామీ మేరకు ఆ దిశగా సత్వర పనులు చేపట్టాలంటూ శుక్రవారం సంబంధిత అధికారులను సమావేశపరచి తగు ఆదేశాలు జారీ చేసారు. తాను స్వయంగా పరిశీలించిన సమయంలో అక్కడి నివాసితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విషయం స్పష్టమైందని, మరింత లోతుగా వీటిని జిహెచ్‌ఎంసి, హౌజింగ్ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. డ్రైనేజి, వర్షం నీరు నిలవటం, రోడ్లపై పారటాన్ని అరికట్టేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, అన్ని బ్లాక్‌లకు రూఫ్ డ్యామేజిని చిప్పింగ్ చేయించాలని, ట్యాంక్ వాటర్ లీకేజిని సరి చేయటం, ప్రహరీ గోడ నిర్మాణం, ఆట స్థలం వద్ద ఉన్న సంపుకు ఫెన్సింగ్, పిల్లలకు ఆట వస్తువుల ఏర్పాటు లిఫ్ట్ సమస్యలను పరిష్కరించటంలాంటి పనులన్నింటికి తనకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు దారి తీసే విధంగా ఇళ్ల సమీపంలో ఉన్నాయని వాటిని మరో చోటకు మార్చటం, కేసింగ్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.2 బిహెచ్‌కె కాలనీలో రోడ్డు మలుపు దగ్గరలో ఫ్లాష్ లైట్లు, అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, భద్రతలో భాగంగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు వచ్చి కాలనీవాసుల ఇళ్ల నుండి చెత్తను తీసుకొని వెళ్లే ఏర్పాటుతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు అక్కడి నివాసితులు చిరు వ్యాపారాలు చేసుకొనే వీలుగా ఉపాధి నిమిత్తం బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు మేళా ఏర్పాటు చేసుకొని ధరఖాస్తులు స్వీకరించి తగు ఏర్పాట్లు చేయాలని ఎల్డీఎంకు సూచించారు. సమీపంలో ఒక రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 2 బిహెచ్‌ఎ కాలనీవాసులకు అనుకూలంగా ఉండే విధంగా వాటి సముదాయంలోనే బస్తీ దవాఖానాకు సరిపడే విధంగా గదులున్నాయని అక్కడ బస్తీ దవాఖానాను కొత్తగా ఏర్పాటుచేసి తక్కువ సంఖ్యలో రోగులు వచ్చే ఇతర బస్తీ దవాఖానాల్లో ఉండే సిబ్బందిని నియమించుకొని త్వరలో ప్రారంభమయ్యేలా చూడాలని దీనికి అవసరమైన పరిపాలనా మంజూరికి నివేదికలు పంపాలని కలెక్టర్ వైద్యారోగ్యశాఖాధికారి డా.ఉమాగౌరికి సూచించారు. దీంతోపాటు మరో ప్రాంతంలో సరైన భవనం లేని అంగన్‌వాడీ కేంద్రాన్ని 2 బిహెచ్‌ఎ కాలనీకి తరలించాలని జిల్లా సంక్షేమ శాఖాధికారిని ఆదేశించారు. కొత్తగా విద్యార్థులు చేరనటువంటి ప్రభుత్వ పాథమిక పాఠశాల ఏదైనా ఉంటే అలాంటి పాఠశాలను 2 బిహెచ్‌కె కాలనీకి మార్చాలని, దీనికి అవసరమైన అనుమతుల కోసం తనకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారిని ఆదేశించారు. 2 బిహెచ్‌కె నివాసితులందరూ కల్సి వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించటం ద్వారా కార్యవర్గాన్ని ఎన్నుకోవటం ద్వారా చిన్నచిన్న సమస్యలను తమకు తామే పరిష్కరించుకోవటం, అవసరమైతే తమ దృష్టికి వినితిపత్రాల ద్వారా తమ దృష్టికి తీసుకొని వస్తుండటం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించా రు. సంబంధిత అధికారులు 2 బిహెచ్‌కె కాలనీ సమస్యలను పరిష్కరించటంలో ఏ మాత్రం జాప్యం పనికి రాదన్నారు.

## ముమ్మరంగా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు

**ప్రజాపక్షం/కొడంగల్ః** గ్రామ పంచాయితీలను ఆదర్శంగా తిర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో కొడంగల్ స్థానిక ఎంఎల్‌ఎ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే మండల పరిధిలోని పలుగురాళ్ల తాండ గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడిన తరుణం లో అందుకు సంబంధించిన గ్రామ పంచాయతీ పక్కా భవనాలు లేకపోవడం పరిపాలన అస్తవ్యస్తం గా మారడంతో ఎన్‌ఎఆర్ఈజిఎస్ కింద దాదాపు 20 లక్షల రూపాయలతో నూతన భవనాన్ని ఏర్పా టు చేయడం జరుగుతుందని తాండ వాసులు చెబుతున్నారు. రేవంత్‌రెడ్డి గెలిచిన తరువాత మా తాండాకు బిటి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాల మరమత్తు పనులతో పాటు కొత్త గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని అందుకు రేవంత్‌రెడ్డికి, కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి, మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాజబహదూర్ వెంకటరామిరెడ్డి సామాజిక సేవలు స్పూర్తి దాయకం

**ప్రజాపక్షం/కాప్రా:** రాజబహదూర్ వెంకటరామిరెడ్డి సామాజిక సేవలు స్పూర్తి దాయకమనిమల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాజబహదూర్ వెంకటరామిరెడ్డి 156 జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహానికి రెడ్డి సంఘంఅధ్యక్షుడు కాసం రాజారెడ్డి, ప్రధా న కార్యదర్శి దోమ శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ దయాకర్‌రెడ్డితోకల్సి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సంఘం సభ్యులంతా సేవాభావం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షురాలు అరకాల పద్మారెడ్డి, కోశాధికారి ముత్యం రెడ్డి, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుధా



## తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారుల డబ్బులు మాయం

* సిబ్బంది చేతివాటం
* ఆందోళనలో ఖాతాదారులు
* పోలీసులకు ఫిర్యాదు చేసిన మేనేజర్

**ప్రజాపక్షం/తాండూరుః** బ్యాంకులు అంటేనే భద్రతకు మారుపేరు..అలాంటి బ్యాంకులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చేతివాటంతో దాచి పెట్టిన డబ్బులు కాజేసిన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో వెలుగు చూసింది. ఖాతాదారుల ఖాతాలకు కన్నం వేసిన ఈ ఘటన శుక్రవారం తాండూరు పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జరిగింది. తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ గ్రామీ ణ బ్యాంకులో ఓ మహిళ ఖాతా తెరచింది. ఒక ఎఫ్‌డి ఖాతాలో రూ.2.84వేలు, మరో ఎఫ్‌డి ఖాతాలో రూ.3లక్షల 15వేలు చొప్పున ఆ బ్యాంకులో దాచిపెట్టుకుంది. ఈ మధ్యకాలంలో అట్టి డబ్బులను రెన్యూవల్ చేయడానికి గాను బ్యాంక్‌ను ఆశ్రయించారు. దీంతో ఆమె ఖాతాలో డబ్బులు డ్రా చేసినట్లు మేనేజర్ తెలిపారు. దీంతో ఖంగు తిన్న ఆ మహిళ తాను డబ్బులు డ్రా చేయలేదని, ఒకసారి తన ఖాతాకి సంబంధించిన లావాదేవీలను పూర్తిగా పరిశీలించాలని మేనేజర్ శ్రీనివాస్‌ను కోరా రు. అట్టి ఖాతాను పరిశీలించిన మేనేజరక్ బిత్తరపోయే నిజాలు బయటపడ్డాయి. బ్యాంకు లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై అనుమానం వచ్చింది. బ్యాంకు సిబ్బంది చేతివాటంతో ఖాతాదారులు దాచిపెట్టిన డబ్బులుకు కన్నం వేశారు. ఆ మహిళ ఖాతాలోని డబ్బులను మరో ఖాతాలోకి మార్చి డబ్బులు డ్రా చేసినట్లు తేలింది. దీంతో బ్యాంకు ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.



# సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల మూడవ రోజు చిత్రమాలిక

ఫొటోలు... అనిల్





సిపిఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు సన్మానం







డిహెచ్‌పిఎస్ ప్రతినిధులు

















నవచేతన పుస్తకాలయంలో రాజాకు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



రాజా, నారాయణ, అజీజ్ పాషా చర్చలు..



పాత కార్యవర్గం..



గీతా పనివారల ఫ్రంట్



లాయర్ల ఫ్రంట్



సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శితో పార్టీ వెటరన్ నేతలు



తల్లీ కూతుళ్లు, తండ్రీ కొడుకులు



రాజా, శ్రీనివాస్ రెడ్డితో ప్రజాపక్షం జర్నలిస్టులు



తక్కళ్లపల్లితో మగ్దూమ్ భవన్ కార్యాలయ సిబ్బంది



ప్రజానాట్యమండలి గీతాలాపన



ప్రజానాట్యమండలి నృత్యాలు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com